
# బైబిలు లోని
# మూడు ప్రాముఖ్యాంశములు

## THREE IMPORTANT BIBLE SUBJECTS



JERRY BATES

## GODHEAD, WORSHIP
## BIBLE COVENANTS

# మూడు బైబిలు ప్రాముఖ్యాంశములు

## (THREE IMPORTANT BIBLE SUBJECTS)

**JERRY BATES**

SATYA VANI - CHURCH OF CHRIST
P.O. Box. 80, KAKINADA
A.P. - 533 001

# INTRODUCTION

The three books compiled in this volume were originally written and printed as three separate titles. They were designed for people with some knowledge of the Scriptures but who want a more in-depth study of God's Word.

These three studies cover subjects that lie at the foundation of our Christian faith, yet all three are often misunderstood in our religious world. They all are related as to how we relate to God. We cannot have a relationship with God unless we understand His nature, thus a study of the Godhead. God has related to man in different ways in the past; thus, the need for better understanding of the different covenants God has had with man. The worship many has offered to God has also changed over time because of the different covenants. Therefore, all three subjects are connected by understanding how we as man relate to God our Creator. Because they are misunderstood, much false teachings and practices have become a part of many religious groups which are affecting the unity that should characterize God's church and thus threatens the salvation of multitudes of people claiming to be followers of Christ. It is hoped that this combined study of these subjects will help the readers in their understanding of these vital subjects.

**- Jerry Bates**

# విషయ సూచిక

## I దైవత్వము



| | | పేజీ |
|---|---|---|
| 1. | దైవత్వము యొక్క విశిష్ఠత | 2 |
| 2. | యేసుదేవుడై యున్నారు | 9 |
| 3. | పరిశుద్ధాత్మ దేవుడై యున్నారు | 19 |
| 4. | మన ప్రభువగు యెహోవా అద్వితీయుడు | 25 |
| 5. | ముగ్గురు ఒక్కటే అంటే అర్థమేమిటి? | 30 |


## II ఆరాధన


| | | |
|---|---|---|
| 1. | ఆరాధన యనగానేమి? | 36 |
| 2. | మనం ఎక్కడ ఆరాధించాలి? | 42 |
| 3. | ప్రార్థన | 50 |
| 4. | ప్రభురాత్రి భోజనము | 58 |
| 5. | పాటలు పాడుట | 65 |
| 6. | కానుక లిచ్చుట | 73 |


## III బైబిలు నిబంధనలు


| | | |
|---|---|---|
| 1. | బైబిలు నిబంధనలు | 80 |
| 2. | మోషే ధర్మ శాస్త్రము | 86 |
| 3. | క్రీస్తు యొక్క ధర్మశాస్త్రము | 91 |
| 4. | క్రొత్త నిబంధన యొక్క శ్రేష్టత | 97 |
| 5. | ఇద్దరు స్త్రీలు, రెండు ధర్మశాస్త్రములు | 106 |
| 6. | క్రొత్త నిబంధనను అన్వయించుకొనుట | 112 |



# I

# దైవత్వము

## (Godhead)

1. దైవత్వము యొక్క ప్రాముఖ్యత
2. యేసు దేవుడై యున్నారు
3. పరిశుద్ధాత్మ దేవుడై యున్నారు
4. మన ప్రభువగు యెహోవా అద్వితీయుడైన దేవుడు
5. ముగ్గురు ఒక్కటే అంటే అర్థమేమిటి?

# 1. దైవత్వము యొక్క విశిష్టత

## (The Importance of Godhead)

దైవత్వాన్ని గూర్చి పలుమంది పలువిధాలుగా చెబుతారు గాని అది చాలా ప్రాముఖ్యమైన అంశము. దేవుని అర్ధము చేసుకొనడం మనకు కష్టం. అది ఆశ్చర్యము కాదు. పరిమితి గల జ్ఞానముతో పరవిమితి లేని దేవుని మనం అర్ధంచేసుకొనడానికి ప్రయత్నించుచున్నాము. కనుక యిది ఆశ్చర్యము కాదు. అయినను ఈ ప్రాముఖ్యాంశము క్రైస్తవులు గ్రహించుకోవాలి. దైవత్వము అనగా తండ్రియైన దేవుడు కుమారుడైన దేవుడు పరిశుద్ధాత్మ దేవుడు కలసి ఒకే దేవుడై యున్నారు. వారు ముగ్గురై యున్నారు. గాని ఒకే దేవుడై యున్నారు. లాటిన్ భాషలో ఆయన ముగ్గురై యున్న ఒకే దేవుడని చెప్పబడింది. ఈ సిద్ధాంతము గ్రహించుకొనుటకు కష్టమైనందున అనేకులు దానిని బహిరంగముగా కాదంటారు లేదా వారు దానిని మార్చుదురు. అందువలన యేసు యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు దైవత్వాన్ని వారు నిరాకరించుదురు. ఈ పాఠములలో దైవత్వాన్ని గూర్చిన సిద్ధాంతము ప్రాముఖ్యమా? అను ప్రశ్నకు జవాబును వెదుకుదాం. తదుపరి యేసు ప్రభువు యొక్క దైవత్వాన్ని గూర్చిన బైబిలునందలి పరిపూర్ణ ఋజువులను గమనించుదాం. చివరిగా దైవత్వాన్ని గూర్చిన బోధ మనకు అవసరమా? యను దానిని పరిశీలించుదాం.

### ఈ సిద్ధాంతమును కొందరు ఎందుకు నిరాకరించుదురు?

ఈ సిద్ధాంతము వలన ప్రయోజనం యేమిలేదని కొందరు

చెబుతారు. దైవత్వము యదార్ధము కాకపోతే నైతిక, సాంఘిక వాదనలలో మార్పుయేమీ వుండదు అని వారు భావిస్తారు. క్రైస్తవ సాహిత్యము పెద్దగా మార్చబడవలసిన అవసరం యేమీ వుండదు. దైవత్వాన్ని గూర్చిన సిద్ధాంతాన్ని చాలామంది క్రైస్తవులు ఎరుగరు గనుక దీనిని గూర్చి మనం పట్టించకోనక్కరలేదు. సత్యాన్ని గూర్చి చెప్పినప్పుడు దానితో నాకేమి పనియని చాలామంది చెబుతారు. మరియు ఈ సిద్ధాంతము వలన క్రైస్తవులు పలువిధములుగా చీలిపోయారు. అందువలన దీనిని విసర్జించాలని వారంటారు.

దైవత్వాన్ని గూర్చిన సిద్ధాంతము వలన యితర మతముల వారు క్రైస్తవ్యాన్ని హేళన చేస్తారు. క్రైస్తవులు కూడా బహుళ దేవుండ్లనే కలిగి యున్నారని వారందురు. ఒక విధంగా చూస్తే త్రియేకుడైన దేవుడనుట ఆశ్చర్యం కలిగించును. ఇంకోవిధంగా చూస్తే అది స్వవిరుద్ధము! అందువలన దీనిని గూర్చి బోధించనక్కర్లేదని చాలామంది చెబుతారు.

## దైవత్వము యొక్క ప్రాముఖ్యత

అయితే ఈ సిద్ధాంతము చులకనయైనది కాదు. ఏలయనగా అది దేవుని తత్వాన్ని గూర్చినట్టిది. దైవత్వములో ఒక అంశము అవతారము, దేవుడు మానవునిగా అవతరించుట. మానవునికి శోధనలు బాధలు సంభవించునప్పుడు దేవుడెక్కడవున్నారు? అని ప్రశ్నిస్తాడు. అయితే మానవుని సాధక బాధకాల యెడల దేవుడు ఉదాసీనుడు కాదని క్రీస్తు అవతారము సూచించుచున్నది. ఈ లోకాన్ని రక్షించుట కొరకు ఆయన ఈ లోకంలో ఒక భాగమయ్యారు. యేసు

దైవత్వములో ఒక భాగమై యుంటే ఆయన యిష్ట పూర్వకముగానే బలి అయ్యారు.

తదుపరి, దైవత్వము మిగతా మతాల నుండి క్రైస్తవ్యాన్ని వేరు చేయుచున్నది. పలు మతములున్న ఈ సమాజంలో అన్ని మతములు సమానమేయనే భావన కొందరిలో యున్నది. వాటి మధ్యనున్న విభేదములు పరిష్కరింపబడ వచ్చును లేదా వాటిని లెక్కచేయనక్కరలేదు. అయితే దైవత్వము అట్టి నమ్మికను అసాధ్యపరచును. దైవత్వము ఇంకొక మతమునకు అంటుకట్టబడదు. అది అసాధారణమైనది.

## ఎవరికి ప్రార్థించాలి?

మనం ఎవరికి ప్రార్థన చేయాలి? అనే అంశమును క్రైస్తవులు సాధారణంగా తర్కించుచుందురు. తండ్రియైన దేవునికి తప్ప మరెవరికిని ప్రార్థన చేయరాదని బైబిలు చెప్పుచున్నందున ప్రార్థనలన్ని తండ్రియైన దేవునికే సమర్పించబడాలి. అందువలన దైవత్వములోని ప్రతి వ్యక్తి వేరొకని నుండి వేరుగా యున్నట్లు యిది చిత్రీకరించుచున్నది. దైవత్వములో ఆయా వ్యక్తులు కొన్ని ప్రత్యేక పనులు నిర్వహించుచున్నట్లు కనబడినను అన్ని విషయములలో వారు ఏకమై ఆయా పనులు చేయుచున్నారు. క్రీస్తునామమున మనము దేవునికి ప్రార్థన చేయునప్పుడు పరిశుద్ధాత్ముడు మనకు సహాయము చేయును (రోమా 8:26-27; యోహాను 15:16;16:23). గనుక మనము తండ్రియైన దేవునికి ప్రార్థన చేయుచుండినను ప్రార్థనకు జవాబిచ్చుటలో ముగ్గురు ఏకమై యుందురు. అందువలన దైవత్వములోని వేర్వేరు వ్యక్తుల మధ్యయున్న ఈ ప్రత్యేకతను మనము తెలుసుకొనవలసియున్నది.

మన ప్రార్థనలు, ఆరాధన అంతయు తండ్రియైన దేవునికి ఒక్కరికే గాక త్రియేక దేవునికి ఉద్దేశించబడినది.

## దైవత్వములో ఒక్కొక్కరిని ఎట్లు గ్రహించుకొనుచున్నాము?

ఒకరితో నొకరికి గల సంబంధమును బట్టి దైవత్వము మనకు ఒక మాదిరియై యున్నారు. దైవత్వములోని ముగ్గురు మూర్తులు నిత్యత్వము, సర్వసమానత్వము కలిగియున్నారు. వేరొకపాఠములో యేసు తన్నుతాను తగ్గించుకొనుటను గూర్చి తెలుసుకొందుము. అయితే యేసు యొక్క తగ్గింపు తత్వము ఆయన అవతారమును గూర్చి నట్టిదియై యున్నదే గాని అది ఆయన నిత్యతత్వమును గూర్చి కాదు. తండ్రియైన దేవుడు యేసు ఏకమై యున్న లాగున మనమును ఏకమై యుండాలని యేసు చెప్పారు (యోహాను 17:11,21). ఆయన శిస్యులమైన మనము అందరము ఏకమై యుండాలనునది గ్రహించుకోవాలంటే, దైవత్వములోన ఏకత్వము ఐక్యతలను గ్రహించుకోవాలి.

మొదటిగా క్రైస్తవులందరు విలువలో సమానులే. వారిలో అనేకులకు వివిధమైన తలాంతులు శక్తి సామర్థ్యాలు పనులు ఉండవచ్చునేమో గాని దేవుని దృష్టిలో మనందరము విలువలో సమానులమే. “క్రీస్తులో యూదుడని గ్రీసుదేశస్థుడనిలేదు. దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీయని లేదు. యేసు క్రీస్తునందు మీరందరు ఏకముగా యున్నారు” (గలతీ 3:27). గనుక ఒకరికంటె మరొకరు ఎక్కువని కాని తక్కువని గాని యెంచుట సమంజసము కాదు. ఒకని కంటె యొకడు ఎక్కువని తక్కువనే భావముల వలన

సంఘములో అనేక సమస్యలు ఉత్పన్నమగును. దైవత్వములోని ముగ్గురుమూర్తుల మధ్య అధికరవాంఛయున్నట్లు మనము ఎన్నడు ఊహించము. ఆయన సంఘములో కూడ అట్లేయుండవలెను.

రెండవదిగా ఒకనికంటె మరియొకడు హెచ్చింపబడకూడదు. సంఘములో బోధకుడు పెద్దలు మిగతావారి కంటె ఎక్కువ కనబడుచుయుందురు. మితగా వారికంటె కొందరికి హెచ్చు తలాంతులు ఉండవచ్చును. సంఘమునకు వారు చేయు పరిచర్యలు కొందరికంటె ఎక్కువగా యుండవచ్చును. కొందరి ఆర్థిక ఉన్నత స్థితిని బట్టి వారు మిగతా వారికంటె ఎక్కువ ఇయ్యవచ్చును. అట్టి పరిస్థితులలో వారిని మిగతావారికంటె మిన్నగా ఎంచుచుండవచ్చును. యిది మానవ సహజ నైజము. అయితే దేవునిలో అట్టి నైజము యేమీ లేదు. ఇక్కడ రెండు ఉదాహరణలు గమనించ వచ్చును. బీద విధవరాలు రెండు కాసులు మాత్రమే యిచ్చినను ధనికులందరికంటె ఆమె ఎక్కువ యిచ్చెనని యేసు ఆమెను అభినందించుచు చెప్పెను. యాకోబు పత్రిక రెండవ అధ్యాయములో సంఘములో ధనికులను హెచ్చుగాను బీదలను తక్కువగాను చూచుట యాకోబు ఖండించెను. క్రైస్తవు లందరినీ విలువలోను స్థాయిలోను దేవుడు సమానముగా చూచును. మనము కూడ అట్లే ప్రవర్తింపవలెను.

ఇంకా I కొరింథీ 12వ అధ్యాయములో పౌలు సంఘమును శరీరముతో పోల్చుచున్నాడు. భౌతిక శరీరములో అనేక అవయవము లుండినను ప్రతి అవయమునకు ఒక ప్రత్యేక పనియుండును అట్లే సంఘములో కూడ అనేకమంది సభ్యులుండినను వారందరు ఒకే

శరీరమై యుందురు మరియు ప్రతి వాని పని వేర్వేరుగ యుండును. అయినను బలహీన సభ్యులు ప్రాముఖ్యులు కారని ఎంచరాదు. సరిగదా ప్రతివాడు శరీరక్షేమాభివృద్ధి కొరకు కృషి చేయవలెను. మన శరీరములో ఏ చిన్న అవయవము సరిగ పనిచేయకపోతే ఆ శరీరము ఆరోగ్యవంతము కాదని తలంచుదుము. అట్లే సంఘములో సభ్యులందరు ఏకమై, సరిసమానముగా ఎంచబడకపోతే అది ఆరోగ్యవంతమైన సంఘముకాదు.

ఇదే సూత్రము స్థానిక సంఘముల మధ్యను కూడ అనుసరించుచుండవలెను. ఒక స్థానిక సంఘము యొక్క పని మిగతా స్థానిక సంఘములపై ప్రభావము చూపునను సంగతిని పలుమారులు మరతురు. స్థానిక సంఘ ములు ఒక దానికంటె ఇంకొకటి పెద్దదిగా కనబడుటకు పోటీ పడుదురు. అభివృద్ధి జెందనుద్దేశ్యములో దోషమేమియు లేదు గాని మనం మిగతా స్థానిక సంఘములను కూడ మనస్సునందుంచుకొనవలెను. వ్యాపార సంస్థలతో క్రైస్తవ్యమును పోల్చరాదు. వ్యాపార సంస్థలు మిగతా వాటిని నాశనం చేసి తామే గొప్పగా ఉండాలని పోటీపడుదురు. వ్యాపార విషయాల్లో అట్టిది సహజం. సంఘములయితే తమ వనరులను యితరులకు కూడా వాడుచు ఆయా స్థానిక సంఘములు బలపడునట్లుపయోగపడవలెను. దైవత్వములోని ముగ్గురు మూర్తులలో ఒకరు మిగతావారికంటె ఘనముగా ఉండుటకు ఎన్నడు ప్రయత్నించరు. అట్టిది అసంభవము.

ఇదే సూత్రము మన కుటుంబములలో కూడ కనబడును. కుటుంబములో ఏ సభ్యుడు కూడ మిగతా వారికంటే ఎక్కువ కాదు

తక్కువకాదు. అట్లే కుటుంబ క్షేమాభివృద్ధి నిమిత్తము అందరు కష్టపడి పనిచేయవలెను. దైవత్వములో ముగ్గురుమూర్తులు ఏకమైయుండి ఒకే గమ్యము కొరకు కలసిపనిచేయుదురు.

## ముగింపు

మన జీవితంలో దైవత్వము యొక్క ప్రభావమును మనం ధ్యానించుచుయున్నాము. దేవుడు క్రీస్తు, పరిశుద్ధాత్ముడు తన సేవకుల జీవితములలో నివసింతురు. గలతీ 2:21లో "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను. ఇక మీదట జీవించువాడను నేను కాదు గాని, క్రీస్తే నా యందు జీవించు చున్నాడని పౌలు వ్రాసాడు. మన ద్వారా దేవుడు జీవించాలంటే మనం దేవుని యొక్క తత్వమును గ్రహించుకోవాలి. క్రైస్తవుల వలెమనం ఒంకొరుల యొక్క సంబంధులము అని తరచు మనం చెప్పుకొందుము గాని అదెట్లో మరతుము. ప్రేమ వలన మనం ఫలాని విధముగా నడుచుకోవాలని చెప్పుచుయుంటాము. అది వాస్తవమే అయినను అది దేవునిదే. ఏలయనగా దేవుడు ప్రేమయై యున్నారు (I యోహా 4:8).

మనం ఒంకొరుల యెడల ఎట్లు ప్రవర్తిస్తామో యనునది చివరకు దైవత్వములో యున్న ఏకత్వము ప్రేమ వలన సంభవించును. దైవత్వాన్ని మనం నిర్మూలించితే మన జీవిత ఆధారమును కోల్పోయినట్లే. అదెంత ప్రాముఖ్యమో నీవు గమనించాలి!

# ౨. యేసు దేవుడై యున్నారు

## (Jesus is God)

దేవుడు తండ్రియైయున్నాడని అందరు అంగీకరింతురు. దైవత్వమును విశ్వసించు వారెవరైనను తండ్రియైన దేవుడు దేవుడని అంగీకరిస్తారు. అది వాస్తవమని మనం అంగీకరిస్తాము. అయితే యేసు దేవుడా, కాదా? యనునది ఇప్పుడు చూచుకొందము.

### యేసు నిత్యుడు

యేసు యొక్క పూర్వపు ఉనికిని నిత్యత్వాన్ని సూచించు ఒక లేఖనము యోహాను 1:1, “ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను; వాక్యము దేవుడై యుండెను”. వాక్యమునకు, దేవునికి యున్న ప్రత్యేకతను మనం గమనించగలము. ఏలయనగా “వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను”. వాక్యమునకు, దేవునికి యున్న ప్రత్యేకతను మనం గమనించగలము. ఏలయనగా వాక్యము దేవుని యొద్ద ఉండెను. దేవుడు తనతో యుండెనని చెప్పుట అవివేకము. అయినను వాక్యము దేవుడై యుండెనని అనగా ఆయన దేవుడై యుండెనని మనము చూడగలము. అదే ప్రత్యేకతను మరల యోహాను 1:14లో మనము చూడగలము. ఆ వాక్యము శరీర ధారియై యున్నట్లు అక్కడ చూడగలము. యిది క్రీస్తును సూచించు మాటయై యున్నది. 15వ వచనములో ఆయన నా కంటె ముందున్న వాడని బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పుచున్నాడు. యోహాను కంటే యేసు ముందునుండే యున్నవాడు. అయినను

శారీరకంగా యోహాను పుట్టిన ఆరు నెలల తరువాత యేసు ఈ లోకంలో జన్మించెను.

యోహాను 8:58లో అబ్రాహాము పుట్టకమునుపే నేనున్నానని యేసు చెప్పెను. ఉండునవాడను అను పదము నిర్గమ 3:14-15లో, నిత్యము వుండు స్వయం సంభూతుడైన యెహోవా దేవుని గూర్చి వాడబడిన పదము. అబ్రాహాము పుట్టకముందు నుండే యున్న వాడనని యేసు చెప్పుట మాత్రమే గాక, తండ్రియైన దేవునికి వర్తించు గుణమును తనకు ఆయన వర్తించుకొనెను. అట్లు స్వయం సంభూతుడైన దేవునితో తాను సమానుడని ఆయన సంబోధించుకొనెను.

యేసు పరలోకము నుండి వచ్చెను. యోహాను 3:13లో యేసు నీకొదేముతో మాట్లాడుచు, “పరలోకము నుండి దిగివచ్చిన వాడే పరలోకములో ఉండు మనుష్య కుమారుడే తప్ప పరలోకమున కెక్కిపోయిన వాడెవడును లేడు” అని చెప్పెను. మనుష్య కుమారుడు అను పదము యేసు తన్ను గూర్చియే పలికెను. గనుక ఆయన ఈ లోకమునకు రాకముందు పరలోకమందున్న సజీవుడైన దేవుడనని తెలియజేసెను. యోహాను 6:51 లో యేసు అట్టి మరియొక ప్రకటన చేసెను. “పరలోకము నుండి దిగివచ్చిన జీవాహారము నేనే”. తదుపరి యోహాను 6:62లో “అలాగైతే మనుష్య కుమారుడు మునుపు వున్న చోటునకు ఎక్కుటమీరుచూచిన యెడల ఏమందురు?” అని ఆయన పలికెను. యేసు మరణించి తిరిగి లేచిన తరువాత, ఆయన ఈ లోకమునకు రాకముందున్న పరలోకమునకు ఎక్కిపోయెను.

మెస్సీయను గూర్చియున్న 110వ దావీదు కీర్తనను యూదులందరు అంగీకరించారు. "ప్రభువు నా ప్రభువుతో సెలవిచ్చిన వాక్కు - నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా చేయు వరకు నాకుడి పార్శ్వమున కూర్చుండుమని" మొదటి వచనము చెప్పుచున్నది. మొదటి ప్రభువు తండ్రియైన దేవుడు, రెండవ ప్రభువు మెస్సీయ. గనుక పరిశుద్ధాత్మ వలన దావీదు అప్పటికింకను జన్మించని తన వంశ కర్తను "ప్రభువు" అని పిలుచుచున్నాడు. అయితే ఈ మెస్సీయ దావీదు యొక్క ప్రభువును, తన వంశములో జన్మించిన వాడును ఎట్లవుతాడు? ఒకప్పుడు పరిసయ్యులు కూడియుండగా యేసు వారిని చూచి, "క్రీస్తును గూర్చి మీకేమితోచుచున్నది? ఆయన ఎవని కుమారుని అడిగెను. వారు ఆయన దావీదు కుమారుడని చెప్పిరి. అందుకాయన - ఆలాగైతే నేను నీ శత్రువులను నీ పాదముల క్రింద ఉంచువరకు నీవు నా కుడి పార్శ్వమున కూర్చుండమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను అని దావీదు ఆయనను ప్రభువని యేలచెప్పు చున్నాడు? దావీదు ఆయనను ప్రబువని చెప్పిన యెడల ఆయన ఏలాగు అతనికి కుమారుడగును అని వారినడిగెను" (మత్తయి 22:41-45). గనుక యేసు మెస్సీయ అయితే ఆయన పూర్వము నుండి యున్న వాడై యుండాలి. ఇంకో మాటలో దేవుడై ఉండియుండాలి! మెస్సీయను గూర్చియూదులు సరిగ గ్రహించనందున దీనిని వారు గ్రహించలేక పోయిరి.

## దేవుని నామములు యేసుకు వర్తింపజేయబడ్డాయి.

యెషయా 42:8 లో యెహోవాను నేనే ఇదే నానామము. మరి

ఎవరికిని నా మహిమను నేనిచ్చువాడను కాను" అని ఆయన పలికెను. పరిశుద్ధాత్మ వేశము వలన మత్తయి వ్రాస్తు యెషయా 40:3 ను ఎత్తి చూపెను. అక్కడ యెహోవా నామమును యేసు క్రీస్తుకు అతడు వర్తింపజేసెను (మత్త 3:3). తీతు 2:13లో మహాదేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు మనము ఎదురు చూచుచుండవలెనని" పౌలు హెచ్చరించాడు. యేసు మహాదేవుడని గమనించుము.

యేసు దేవుడని నిదానముగా చేయబడిన ప్రకటన యోహాను 20లో యున్నది. యేసు పునరుత్థానుడైన తరువాత తోమా తప్ప తన అపోస్తులందరికీ ప్రత్యక్షమాయెను. తాము యేసును చూచినట్లు శిష్యులు తోమాతో చెప్పగా "నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనని అతడు చెప్పెను (యోహాను 20:25). ఆ మరుసటి ఆదివారమున యేసు మరల తన శిష్యులకు కనబడెను. ఈ సారి తోమా కూడ వారితో ఉండెను. ఆయన "తోమాను చూచి, నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమని చెప్పెను. అందుకు తోమా ఆయనతో నా ప్రభువా, నా దేవా అనెను" (యోహాను 20:26-28). ఈ సందర్భములో దేవుడు అను పదముకు Theos అని వాడబడినది. అది యోహాను సువార్తలో పలుమారులు వాడబడెను. అది దేవునికి మాత్రమే వర్తించే పదము. గనుక తండ్రి ఎట్లో, కుమారుడైన యేసు కూడ అట్లే దేవుడని మనకు నిర్ధిష్టముగా ప్రకటింపబడినది.

యేసు అల్ఫాయు ఓమేగయునని పిలువబడెను. అనగా ఆయన ఆదియు అంతమునై యున్నాడు. గ్రీకు భాషలో అల్ఫా మొదటి అక్షరము, ఒమేగా ఆఖరి అఖరము. యెషయా 44:6లో "సైన్యముల కధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చు చున్నాడు. నేను మొదటి వాడను కడపటివాడను. నేను తప్ప ఏ దేవుడును లేడు" అయితే ప్రకటన 1:8లో ''అల్ఫాయు ఓమేగయు నేనే, వర్తమాన భూత భవిష్యత్కాలములలో ఉండు వాడను నేనే అని సర్వాధికారియు దేవుడునగు ప్రభువు సెలవిచ్చుచున్నాడు". తరువాత 1:18లో "నేను మొదటి వాడను కడపటి వాడను" అని యేసు యోహానుతో చెప్పెను. అదే పేరు ప్రకటన 22:12-13లో యేసుకు మరల వర్తింపజేయబడెను. ఈ పదములు యేసుకు, సర్వాధికారియైన దేవునికి వర్తింపజేయబడెను. గనుక సర్వాధికారియైన దేవుడే యేసుక్రీస్తు. తండ్రియు, యేసుక్రీస్తును సర్వాధికారియైన దేవుడే. ఆదియు అంతమును వారే.

హెబ్రీ 5:9-10లో యేసు తనకు విధేయులైనవారికి నిత్య రక్షణకు కారకుడని చెప్పబడినది. వేరే యే నామమున రక్షణ లేదు (అపొకా 4:12). దేవుడు తప్ప మానవుల పాపములను ఎవడును క్షమించలేడు. తనకు జన్మించు శిశువుకు యేసు అను పేరు పెట్టబడవలెనని మరియకు తెలియజేయబడెను; ఏలయనగా ఆయన తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును (మత్తయి 1:21). దేవుడు మాత్రమే చేయునవి క్రీస్తు చేయు చుండినందున యేసుక్రీస్తు దైవ సమానుడు, దేవుడు. యేసు ఇమ్మానుయేలు, అనగా

దేవుడు మనకు తోడని యర్థము. కొలస్స 2:9లో "దైవత్వము యొక్క సర్వపూర్ణత శరీరముగా క్రీస్తు నందు నివసించుచున్నది" యని పౌలు ప్రకటించెను. ఇంకోమాటలో దేవునిలో ఏమైతే యున్నవో అవన్నీ క్రీస్తులో యుండెను. ఇంకోమాటలో తండ్రియైన దేవుని వలే క్రీస్తు కూడ సంపూర్ణముగా దేవుడే.

## దైవ లక్షణములన్నీ యేసులో యుండెను.

దేవుడెట్లో, యేసు క్రీస్తు కూడా అట్లే నిత్యుడే, యెషయా 9:6 లో "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్య భారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును" అనియున్నది. ఈ పేర్లన్నియు లేఖనములలో దేవునికి వర్తింప జేయబడెను. హెబ్రీ 1:8లో "దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచునది" యని చెప్పబడెను. కీర్తన 45 నిశముతగా దేవుని గూర్చి వ్రాయబడినది. మరియు కుమారుడు దేవదూతల కంటే శ్రేష్టుడని చెప్పబడినది. అట్లు యేసు దేవుడనే మరొక రుజువు మనము కలిగియున్నాము. ఏలయనగా ఆయన సమస్తమును సృజించిన వాడు (కొలస్స 1:16-18).

యేసు సర్వశక్తుడని ప్రకటింపబడెను. దేవుని వాక్యము సమస్తము సృజించెనని యోహాను 1:3 చెప్పుచున్నది. దేవుడే సమస్తమును నిర్మించినవాడు (హెబ్రీ 3:4). యేసు సమస్తమును సృజించినవాడు గనుక ఆయనే దేవుడు. ఇంకా కొలస్స 1:16లో "సర్వమును

ఆయనయందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను, ఆయనను బట్టియు సృజింపబడెను". యేసు సమస్తమును సృజించెను యేసు దేవుడైయున్నారు.

యేసు సమస్తమును ఎరిగియుండెను "యేసు అందరినీ ఎరిగినవాడు గనుక ఆయన తన్ను వారి వశముచేసుకోలేదు. ఆయన మనుష్యుని ఆంతర్యమును ఎరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గూర్చి ఆయనకు సాక్ష్యమియ్యనక్కరలేదు" (యోహాను 2:24-25). దేవుడొక్కడు మాత్రమే మనుష్యుని అంతర్యము నెరిగినవాడు గనుక యేసు దేవుడని ప్రకటింపబడెను.

## దేవుని క్రియలు యేసుకు వర్తించును

యేసు 5000 మందికి ఆహారము పెట్టిన తరువాత, జీవాహారము నేనేయని ప్రకటించెను (యోహాను 6:48, 51, 53-58). యేసు ఆత్మీయాహారమై మన ఆత్మలకు జీవమునిచ్చు వాడై యున్నారు. మానవమాత్రుడు ఇట్లు చెప్పుకొనలేడు. యేసు పునరుత్థానమును జీవమును నేనేయని చెప్పి చనిపోయిన లాజరును బ్రతికించెను, అనగా జీవమునిచ్చే అధికారము ఆయన కలిగియుండెను "తండ్రి మృతులను ఏలాగు లేపి బ్రతికించునో ఆలాగే కుమారుడును తనకిష్టము వచ్చిన వారిని బ్రతికించును" (యోహాను 5:21). దేవుడొక్కడు మాత్రమే జీవము నియ్యగలడు గనుక, యేసు జీవము నిచ్చినవాడు గనుక యేసు దేవుడైయున్నారు. తాను సబ్బాతుకు ప్రభువైయున్నానని యేసు ప్రకటించెను (మత్తయి 12:8). దేవుడే సబ్బాతు నిచ్చెను గనుక సబ్బాతుకు ఆయనే ప్రభువై యున్నారు.

పలుమారులు తాను దేవునితో సమానుడనని యేసు ప్రకటించెను. నేనును తండ్రియు ఏకమై యున్నామని ఆయన చెప్పెను (మత్తయి 10:30). అనగా దేవునికిచ్చే ఘనతను ఆయన పొందనర్హుడని ఆయన తెలియజేసెను. ఆయన చెప్పుకొను దానిని యూదులు విపులముగా గ్రహించుకొన్నారు. తాను దేవుడనని చెప్పుకొను చున్నందున వారాయనను రాళ్ళు రువ్వి చంపాలనుకొన్నారు. యేసుకు తీర్పు తీర్చునప్పుడు ప్రధాన యాజకుడు, "నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆమాట మాతో చెప్పుమని" యేసును అడిగాడు (మత్తయి 26:63-64). "నేనే" యని యేసు పలికెను (మార్కు 14:61-62).

పాపములు క్షమించు అధికారము తాను కలిగియున్నానని యేసు వక్కాణించెను. దేవుడు మాత్రమే పాపములు క్షమించగలడని అందరు ఎరుగుదురు. పక్ష వాయువుగల వానిని స్వస్థపరచక ముందు యేసు "నీ పాపములు క్షమించబడియున్నవని చెప్పెను" (మార్కు 1:1-12). దేవుడు మాత్రమే ఈ మనుష్యుని స్వస్థపరచగలడు. ఆయన వానిని స్వస్థ పరిచెను. పాపములు క్షమించెను. ఈ యద్భుతము యేసును దేవుడని నిరూపించెను. ఆయన మనుష్యులందరికీ తీర్పు తీర్చువాడనని చెప్పుకొనెను. "తండ్రి యెవనికిని తీర్పు తీర్చడుగాని తండ్రిని ఘనపరచునట్లుగా అందరు కుమారుని ఘనపరచవలెనని తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించి యున్నాడు" (యోహాను 5:22).

# యేసు ఆరాధన సంగీకరించెను

యోహాను సువార్త 9వ అధ్యాయములో పుట్టు గ్రుడ్డివానిని యేసు స్వస్థపరచెను. వానికి చూపుననుగ్రహించెను. తదుపరి యేసు వానిని కలిసికొని నీవు దేవుని కుమారుని యందు విశ్వాసముంచు చున్నావా యని అడిగెను. అందుకతడు ప్రభువా నేనాయన యందు విశ్వాసముంచుటకు ఆయన ఎవడని అడుగగా, యేసు నీవాయనను చూచుచున్నావు. నీతో మాట లాడుచున్న వాడు ఆయనే యనెను. అంతటవాడు ప్రభువా నేను విశ్వసించు చున్నానని చెప్పి ఆయనకు మ్రొక్కెను (యోహాను 9:35-38). ఇటువంటి సందర్భమొకటి మత్తయి 14లో రికార్డు చేయబడెను. యేసు నీళ్ళమీద నడుచుచు రాత్రివేళ శిష్యులు యున్న దోనె యొద్దకు రాగా, దోనెలో యున్నవారు నీవు నిజముగా దేవుని కుమారుడవని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14:33).

యేసు మనుష్యుల ఆరాధనను అంగీకరించెను. ఆయన కేవలము మానవ మాత్రుడే అయితే నిష్టగల యూదుడెవ్వడు ఆయనను ఆరాధించడు, దేవుడొక్కడు మాత్రమే ఆరాధనీయుడని యూదులందరు ఎరుగుదురు. ఆయన దేవుడు కాకపోతే ఆయన ఎన్నడు మానవుల ఆరాధనను అంగీకరించరు. సరిగదా యూదులు ఆయనకు మ్రొక్కరు.

దేవుడు ఆయన కుమారుడు ఆరాధింపబడవలెనని దూతల కాజ్ఞాపించినట్లు మనము చూడగలము. ''మరియు ఆయన భూలోకమునకు ఆది సంభూతుని మరల రప్పించినప్పుడు దేవుని

దూతలందరు ఆయనకు ఆరాధించవలెనని (నమస్కారము చేయవలెనని) చెప్పుచున్నాడు" (హెబ్రీ 1:6). ఈ వచనము ద్వితీయోపదేశ కాండము 32:43, కీర్తన 97:7లో చెప్పబడినది. ఆది సంభూతుడగనగా దేవుని కుమారుడైన యేసుక్రీస్తు, దేవుడు కాని వానిని ఆరాధించుమని దేవుడు దూతలకు ఎన్నడు ఆజ్ఞాపింపరు.

## ముగింపు

యేసు దేవుడని బోధించు అనేక లేఖనభాగములను మనము ఇంకా చూపించవచ్చును. గాని యివి సరిపోవును. బైబిలును విశ్వసించు విజ్ఞత గల వాడెవడైనను యేసు తండ్రివలె దేవుడై యున్నారని తప్పక విశ్వసించును.

# 3. పరిశుద్ధాత్ముడు దేవుడైయున్నారు

## (The Holy Spirit is God)

యేసు దేవుడై యున్నారని గత పాఠంలో మనం తెలుసుకొనియున్నాము. ఇప్పుడు పరిశుద్ధాత్ముడు దేవుడైయున్నారని తెలిసుకొందుము. యేసును గూర్చిన అంశము కంటే ఈ అంశము మరింత క్లిష్టమైనది. ఆయన పనిని గూర్చి వివరించుట క్లిష్టమైనది. ఆయన పని విషయమై అనేక భిన్నాభిప్రాయములున్నవి. ఇప్పుడున్నది పరిశుద్ధాత్ముని యుగమని అనేకులు అభిప్రాయపడుదురు. అందువలన పరిశుద్ధాత్ముడు తండ్రియైన దేవుని కంటెను, యేసు ప్రభువుకంటెను ఎక్కువగా హెచ్చింపబడుట జరుగుచున్నది. అయితే అది పరిశుద్ధాత్ముని గూర్చి బైబిలు చెప్పుదానిని వక్రీకరించుట యగును.

### పరిశుద్ధాత్ముడు ఒక వ్యక్తి

పరిశుద్ధాత్మ దేవునికి వ్యక్తిత్వము కలదు (యోహాను 14:26; 15:26;16:13-14). పరిశుద్ధాత్ముని ఒక వ్యక్తిగా ఈ లేఖనాల్లో యేసు 9 సార్లు సంభోధించారు.

పరిశుద్ధాత్ముడు మాటలాడును యితరులు మాట్లాడుటకు శక్తినిచ్చును. “అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును దయ్యముల బోధయందును లక్ష్యముంచి విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మతేటగా చెప్పుచున్నాడు” (I తిమో 4:1-2)

పరిశుద్ధాత్ముడు బోధించును : "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26).

ఆయన నడిపించును : "అయితే ఆయన అనగా సత్య స్వరూపియైన ఆత్మవచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యము లోనికి నడిపించును (యోహాను 16:13).

పరిశుద్ధాత్మునికి మనస్సున్నది : "మరియు హృదయములను శోధించువాడు ఆత్మ యొక్క మనస్సు ఏదో యెరుగును" (రోమా 8:27).

ఆయనకు అనురాగమున్నది : సహోదరులారా....నేను దేవుని చిత్తము వలన సంతోషముతో మీ యొద్దకు వచ్చి మీతో కలిసి విశ్రాంతి పొందునట్లు మీరు నా కొరకు దేవునికి చేయు ప్రార్ధనల యందు నాతో కలసి పోరాడవలెనని మన ప్రభువైన క్రీస్తును బట్టియు ఆత్మ వలన ప్రేమను బట్టియు మిమ్మును బతిమాలు కొనుచున్నాను" (రోమా 15:30-32).

పరిశుద్ధాత్ముని కొక చిత్తమున్నది: "అయినను వీటన్నిటిని ఆ ఆత్మయొక్కడే తన చిత్తముచొప్పున ప్రతి వానికి ప్రత్యేకముగా పంచి యిచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు" (I కొరింథీ 12:11).

ఆయన దుఃఖించును : "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచన దినము వరకు ఆయన యందు మీరు ముద్రింపబడి యున్నారు" (ఎఫెసీ 4:30).

# పరిశుద్ధాత్ముడు దేవుడు

పరిశుద్ధాత్మ దేవుని గూర్చిన విపులమైన వివరణ అపొ.కా. 5:3-4లో ఇయ్యబడియున్నది. అననీయ సప్పీరా అను దంపతులు తమ భూమిని పేదల కొరకై అమ్మి ఆ సొమ్ములో కొంత దాచుకొని మరికొంత భాగమును అపోస్తలుల పాదములు యొద్ద పెట్టుట మనము చూడగలము. అయినను అమ్మిన సొమ్మంతయు తెచ్చితిమని వారు అబద్ధమాడారు. "అప్పుడు పేతురు అననీయా నీ భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్ముని మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను?"... నీవు మనుష్యులతో కాదు దేవునితోనే అబద్ధమాడితివని వానితో చెప్పెను" (అపో.కా. 5:3-4). అవనీయ ఆడిన అబద్ధము పరిశుద్ధాత్మునికి దేవునికి చెప్పిన అబద్ధము అని పేతురు చెప్పెను. యిది పరిశుద్ధాత్మ దేవుడు తండ్రియైన దేవునితో సమానముగా యున్నట్లు గ్రహింపచేయుచున్నది.

ద్వితీయో 32:11లో "యెహోవా మాత్రము వాని నడిపించెను" అని యున్నది గాని యెషయా 63:10లో ఇశ్రాయేలీయులు తిరుగుబాటు చేసి పరిశుద్ధాత్మను దుఃఖింపజేసిరియని యున్నది. యిది స్వ విరుద్ధము కాదుగాని పరిశుద్ధాత్ముడు తండ్రి, కుమారుల వలె దేవుడై యున్నారు. తండ్రియైన దేవుడు యేసు ప్రభువు పరిశుద్ధాత్ముడు ముగ్గురు ఇశ్రాయేలీయులను నడిపించిరి. యెషయా 40:13 మరియు రోమా 11:34లో కూడ ఇట్టి పరిస్థితిని మనం కనుగొనగలము. యెషయా 40లో యెహోవా ఆత్మకు నేర్పిన వాడెవడు? అని యున్నది. రోమా 11లో ప్రభువు మనస్సును ఎరిగినవాడెవడు? ఆయనకు

ఆలోచన చెప్పిన వాడెవడు? అని యున్నది. రోమా 11లో పౌలు ఈ వచనమును ఎత్తి చూపించి దానిని తండ్రియైన దేవునికి వర్తింపచేసాడు. మరల వారిద్దరు ఏకమైయున్నారని మనకు బోధించుచున్నాడు.

## పరిశుద్ధాత్మునికి దైవ లక్షణములున్నవి

హెబ్రీ 9:14లో ఆయన నిత్యుడగు ఆత్మయని చెప్పబడినది. పరిశుద్ధాత్ముడు సర్వజ్ఞానియని కూడ చెప్పబడినది. 1 కొరింథీ 6:19లో "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమైయున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకాదు విలువ పెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" యని అపొ.పౌలు చెప్పాడు. క్రైస్తవుని యొక్క హృదయములో ఆత్మ నివసించుచున్నాడని చెప్పబడినది. క్రైస్తవులు ఈ ప్రపంచమంతా వ్యాపించి యున్నారు గనుక ఆత్మ సర్వాంతర్యామి కాకపోతే యిది సాధ్యము కాదు (కీర్తన 139:7). అంతేకాకుండా ఆత్మ సర్వజ్ఞానియై యున్నారని చెప్పబడినది. "మనకైతే దేవుడు వాటిని తన ఆత్మ వలన బయలుపరచియున్నాడు. ఆ ఆత్మ అన్నిటిని దేవుని మర్మములను కూడ పరిశోధించుచున్నాడు (1కొరింథీ 2:10). దేవుని మర్మములను కూడ పరిశుద్ధాత్ముడు ఎరిగియున్నాడని చెప్పబడినది. అందువలన ఆయన దేవుడైయున్నారు. ఆ ఆత్మ పూర్ణ బలముతోను శక్తితోను యున్నట్లు మీకా 3:8లో చెప్పబడియున్నది.

## పరిశుద్ధాత్ముడు దేవుని కార్యములను చేయును

సృష్టి జరిగించు ప్రక్రియలో పరిశుద్ధాత్ముడు పాల్గొనియున్నారు.

కీర్తన 33:6లో "యెహోవా వాక్కుచే ఆకాశములు కలిగెను. ఆయన నోటి ఊపిరిచేత వాటి సర్వసమూహములు కలిగెను" అని చెప్పబడెను. ఆయన నోటి ఊపిరియనగా ఆయన ఆత్మయే. అట్టిది మరియొకటి కీర్తన 104:30లో కనబడును "నీవు నీ ఊపిరి విడువగా అవిసృజింప బడును. అట్లు నీవు భూతలమును నూతన పరచుచున్నావు" అని అక్కడ చెప్పబడినది. ఈ భూమిని సృజించుటలోనేగాక పరిశుద్ధాత్ముడు ఈ భూమిని సంరక్షించి నూతనపరిచి యున్నారు.

ఆత్మయే జీవింపచేయునని యేసు ప్రకటించారు (యోహాను 6:33). దేవుడొక్కడే జీవము నీయగలరు అయితే ఇక్కడ పరిశు ద్ధాత్ముడు జీవింపజేయువాడని యేసు చెప్పారు. అనగా పరిశుద్ధాత్ముడు దేవుడై యున్నారు. I పేతురు 3:18లో పేతురు యేసు ప్రభువు యొక్క శ్రమలను, ఆయన మహిమను మనకు వర్ణించుచున్నాడు. మానవజాతి దేవుని యొద్దకు వచ్చునట్లు యేసు శ్రమబొందారని పేతురు చెప్పుచున్నాడు. భౌతికంగా ఆయన చంపబడ్డారు గాని ఆయన ఆత్మ విషయంలో బ్రతికింపబడ్డారు. రోమా 8:11లో "మృతులలో నుండి యేసును లేపిన ఆత్మ"యని పౌలు చెబుతాడు. ఆయన మనలను కూడ లేపును.

యేసు యొక్క అవతారమే పరిశుద్ధాత్మ దేవుని యొక్క రుజువై యున్నది. పరిశుద్ధాత్ముని వలన యేసు కన్య మరియ యొక్క గర్భవాసి యాయెనని మత్తయి లూకాలు వ్రాసారు (మత్తయి 1:20; లూకా 1:35). ఒకడు ఎవని వలన జనింపచేయబడెనో అతడాయన కుమారుడగును. అయినను యేసు దేవుని కుమారుడని పలుచోట్ల

చెప్పబడెను. గనుక ఆత్మదేవుడై యున్నారు. దేవుడొక్కడే యను బోధను యిది నిర్ధారించుచున్నది. ఆ ముగ్గురు ఏకము కాకపోతే యేసుకు ఇద్దరు తండ్రులున్నట్లగును!

## పరిశుద్ధాత్ముడు ఆరాధనామూర్తి

2 కొరింధీ 13:14లో దైవత్వములోని వ్యక్తిగా పరిశుద్ధాత్ముడు చెప్పబడెను. "ప్రభువైన యేసుక్రీస్తు కృపయు దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడైయుండునుగాక". ఈ త్రిత్వములో వేరే ఇంకొక పేరును చేర్చుట దేవదూషణ యగును. యేసు యిచ్చిన గొప్ప ఆజ్ఞలో కూడ ఇట్టిదే మనకగుపడును : "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి". ఎవరి నామముననైనా బాప్తిస్మము పొందుట ఒక ఆరాధన క్రియ యగును. పౌలు తన నామమును బట్టి ఎవరైనా బాప్తిస్మము పొందుట ఖండించెను (1కొరింధీ 1:13) అట్లు పరిశుద్ధాత్ముడు తండ్రి కుమారులతో సమానముగా ఆరాధనీయుడు.

## ముగింపు

పైన చెప్పబడిన దానిని బట్టి పరిశుద్ధాత్ముడు దేవుడై యున్నారు, తండ్రియైన దేవుని వలెను, కుమారుడైన క్రీస్తు వలెను ఆయన ఒకే రకమైన లక్షణములు కలిగియున్నారు. గనుక ఆత్మ దేవుడై యున్నారు. తరువాతి పాఠములో ఆ ముగ్గురు ఏకమై ఎట్లున్నారో తెలిసికొందము.

# 4. మన ప్రభువగు యెహోవా అద్వితీయుడైన దేవుడు (The Lord our God is one)

ఈ పాఠములో తండ్రియైన దేవుడు, యేసుక్రీస్తు, పరిశుద్ధాత్ముల యొక్క సంబంధమును మనము చూచుకొందము. వీరు ముగ్గురు మూడు దేవుండ్లని మొదట్లో అనుకొనవచ్చును. అంటే క్రైస్తవ్యములో బహుళ దేవుళ్ళున్నట్లుగును. అది ఆలాగంటే ఈ ముగ్గురు ఒకే దేవుని యొక్క వేర్వేరు ప్రత్యక్షతలు అని కొందరు తలంచవచ్చును. ఇంకొక మాటలో ఉన్న దేవుడొక్కడే గాని వేర్వేరు సమయాల్లో ఆయన తండ్రియైన దేవుడని, కుమారుడైన యేసు అని, పరిశుద్ధాత్మ దేవుడని చెప్పబడినట్లు తలుస్తారు. ఈలాగు తలంచుటలో ముగ్గురు దేవుడ్లను గూర్చిన సందిగ్ధము తొలగునుగాని దీనిని బైబిలు చెప్పు దానితో సమన్వయించుట దుర్లభమగును.

దైవత్వాన్ని గూర్చిన బోధ గ్రహించుట కష్టము. మనం దైవత్వాన్ని సంపూర్తిగ గ్రహించుకోగలమని నేనను కొనుట లేదు. యిది మనకు ఆశ్చర్యము కాదు. మానవులు దేవుని గూర్చి గ్రహించుకోలేని అనేక సంగతులున్నవి. ఉదాహరణకు నిత్యత్వాన్ని గూర్చి మానవులు గ్రహించుకోలేరు. ఏలయనగా ఈ లోకంలో యున్న ప్రతిదానికి ఒక ఆరంభమున్నది. అయితే నిర్వచించవలసివస్తే నిత్యత్వానికి ఆరంభము లేదు, అంతము కూడా లేదు. దీనిని గ్రహించుకొనుటకు మనం కొన్ని ఉదాహరణలు ఇయ్యవచ్చును గాని మనలను సంతృప్తి పరచవు. మనం దేవుని పూర్తిగా అర్థం చేసుకొని ఆయనను సంపూర్తిగా గ్రహించుకో గలిగితే ఇక ఆయన దేవుడే కాదు. మనం దేవుని పూర్తిగా

గ్రహించుకొన్నామనుకుంటే ఆయనను ఒక స్వరూపముగా చిత్రీకరించుకొంటాము. అటువంటప్పుడు ఆయన దేవుడు కాజాలడు. ఎవరినైనా లేక దేనినైనా మానవుని కంటే అధికుడైయుండి యున్నట్లయితే దానిని లేక వానిని మనం ఆరాధించరాదు.

## ఈ చిక్కుముడి పరిష్కరించు ప్రయత్నములు

దైవత్వాన్ని గ్రహించుకొనుటలో యున్న చిక్కుముడులను పరిష్కరించుటకు మానవుడు పలు సిద్ధాంతాలను ప్రవేశపెట్టాడు. వాటిలో కొన్ని ప్రాముఖ్యమైన వాటిని ఇప్పుడు గమనించుము.

యేసుయొక్క దైవత్వాన్ని తిరిగి నిర్వచించుట ఒక పరిష్కారమైయున్నది. ఈ సిద్ధాంత ప్రకారము యేసు దేవుడే కాదు. ఆయన గర్భమందు ఉద్భవించినప్పుడు గాని, జన్మించి నప్పుడు గాని ఆయన దేవుడే కాదు. గాని తదుపరి దేవుడాయనను స్వీకరించి దేవుని స్థానానికి హెచ్చించారు. దేవుడు యేసు ద్వారా బలముగా పని చేయుచుండినందున ఆయనను దేవుడుగా మనము ఉచ్ఛరించవచ్చును. యిది దేవునికిని యేసు యొక్క దైవత్వానికి మధ్యయున్న ఒత్తిడిని పరిష్కరించును. అయితే దేవునితో సమానుడని బోధించే లేఖనాలకు యిది భిన్నముగా యున్నది. యేసు ఈ లోకమునకు రాకముందును, వచ్చిన తరువాతను కూడా దేవుడే అయ్యుండెను.

మరింకొక కోణం యేమంటే, వాటిని ఇంతకు ముందే మనం చూచాం. అది దేవుడే భిన్నమైన పాత్రలు వహించుచున్నాడనునది. ఒక సమయంలో దేవుడు తన తండ్రిగాను మరొక సమయంలో

కుమారునిగాను, ఇంకొక సమయంలో పరిశుద్ధాత్మగాను ఆయన ఆ పాత్రలలో మనకు కనబడుచున్నారు. గనుక దేవుడు నిజానికి ముగ్గురు మూర్తులు కారు గాని ఆయన ఒక్కడే అయ్యుండి ఈ మూడు పాత్రలను వహించుచున్నాడు.

ఈ దృక్పథము మన దేవుడు ఒక్కడే గాని, ముగ్గురు వేర్వేరు వ్యక్తులుగ చిత్రీకరించుచున్న అనేక లేఖనాలను అది నిర్లక్ష్యము చేయుచున్నది. యేసు బాప్తిస్మము పొందినప్పుడు దేవుడు పరమునుండి మాట్లాడారు. పరిశుద్ధాత్ముడు పావురము ఆకారమున ఆయనపై దిగెను (లూకా 3 : 21-22). యేసు ఈ లోకమందున్నప్పుడు ఎవరిని ప్రార్థించారు? యేసు తనకు తానే ప్రార్థన చేసారని చెప్పుట బుద్ధిహీనతయే. దేవుడు ఒక పిండము వలె మరియు గర్భమందున్నప్పుడు ఆయన ఈ విశ్వాన్ని ఎట్లు కంట్రోలు చేసి దానిని సంరక్షించారు? యేసు ఈ లోకంలో యున్నప్పుడు పరిమితి జ్ఞానం కలిగి యుండెను (మార్కు 13:32). దేవుని యొక్క జ్ఞానాన్ని ఎట్లు మనం అదుపు చేయగలం? తండ్రి, కుమారుడు పరిశుద్ధాత్మయు ఒక్కడే అయితే దేవుడు యేసు యొక్క జ్ఞానం ఎట్లు పరిమితి చేయబడింది?

ఈ లోకంలో యున్న మరియొక పరిష్కారమార్గమేమంటే తండ్రి కుమారుల సంబంధమును పునర్నివచించుటయే. యేసును నిత్యత్వము గలవానిగా గాక ఆయన ఒక సృష్టింపబడిన వ్యక్తియని, అన్నిటికంటే ముందు సృజింపబడినవాడని చెప్పుట, ఆయన అందరికంటే ఉత్కృష్టుడైనను సృషింపబడిన వాడు గనుక, దేవుని కంటే ఉన్నతుడు కాదు. ఈ అభిప్రాయమునకు ఊతమిచ్చు కొన్ని వచనములు క్రొత్త

నిబంధనలో యున్నవి. ఉదాహరణకు యోహాను 14:28లో తండ్రి నా కంటే గొప్పవాడని యేసు బోధించారు. మార్కు 10:18లోను, లూకా 18:19లోను "నేను సత్పురుషుడనని యేల చెప్పుచున్నావు? దేవుడొక్కడే సత్పురుషుడు తప్ప ఎవరుడును సత్పురుషుడు కాడని" యేసు చెప్పారు. అయితే మిగతా అభిప్రాయముల వలె ఈ దృక్పథము కూడ యేసు యొక్క సర్వశక్తిని, జ్ఞానమును నిర్లక్ష్యము చేయును. యేసుప్రభువు ఇష్టపూర్వకంగా దైవత్వాన్ని వీడి మానవత్వాన్ని ధరించుకొన్నారని ఫిలిప్పీ 2:5-11 చెప్పుచున్నది. గనుక ఆయన భూమి మీద నరావతారియై యున్నప్పుడు తండ్రికి ఖచ్చితముగా లోబడెను.

## దేవుడొక్కడే

దేవుడొక్కడే యని బైబిలు అంతటా బోధించుచున్నది. యూదులు ద్వితీ 6:4ను అనుదినము వల్లించేవారు. "ఓ ఇశ్రాయేలు వినుము; మన దేవుడైన యెహోవా అద్వితీయుడైన యెహోవా". ఈ లేఖనమును మార్కు 12:29లో యేసు ఎత్తిచూపించినారు. "నేను తప్ప వేరొక దేవుడు నీకుండ కూడదు'' అని పది ఆజ్ఞలలో మొదటి ఆజ్ఞ చెప్పుచున్నది. విగ్రహారాధనకు వ్యతిరేకముగా యెషయా పలుమార్లు వ్రాసాడు. "నేను మొదటి వాడనూ కడపటివాడను, మొదటివాడను నేను తప్ప ఏ దేవుడు లేడు" (యెషయా 44:6). దాని తరువాతి అధ్యాయములో అట్టి వాస్తవమే మరల చెప్పబడినది. "నేను యెహోవాను మరి ఏదేవుడునులేడు. నేను తప్ప ఏ దేవుడును లేడు" (యెషయా 45:5). దానికి సమానాంతర మాటలను పౌలు కూడా చెప్పాడు.

"ఒక్కడే దేవుడు తప్ప వేరొక దేవుడు లేడనియు ఎరుగుదుము" (1కొరింథీ 8:4). దయ్యములు కూడా ఒకే దేవుని యందు నమ్మక ముంచునని యాకోబు 2:19ని బట్టి మనము గ్రహించుకొనగలము.

ముగ్గురు ఒక్కటే అయ్యి ఎట్లుండగలరు? మానవులుగా యిది మనకు సమస్యగానే యుంటాది. మూడు భౌతిక పదార్థములు ఒకే పదార్థముగా మిళితమయ్యి వాటి యొక్క వేర్వేరు లక్షణములను కలిగియుండుట మనం ఊహించలేము. తరువాతి పాఠంలో దేవుడు ఒక్కరే అనే భావాన్ని మరింత లోతుగా ధ్యానించుదాం. మరియు కొన్ని తారతమ్యములను చూచుకొని ఈ క్లిష్టమైన అంశమును మరికొంత అర్థము చేసికొందము.

# 5. ముగ్గురు ఒక్కటే అంటే అర్థమేమిటి?

## (What does three Persons in One mean?)

దైవత్వములో (దేవునిలో) ముగ్గురు వ్యక్తులున్నారని మనం ఇప్పటికే గమనించాము. ముగ్గురు దేవుని లక్షణాలను కలిగి యున్నారు. బైబిలులో ఈ ముగ్గురు వ్యక్తులనే దైవలక్షణాలు కలిగిన వారిగా బైబిలు చిత్రీకరించు చున్నది. హగ్గయి 2:5-7 ఇట్లు చెప్పుచున్నది "మీరు ఐగుప్తుదేశములో నుండి వచ్చినప్పుడు నేను మీతో చేసిన నిబంధన జ్ఞాపకము చేసికొనుడి, నా ఆత్మ మీ మధ్యను ఉన్నది గనుక భయపడకుడి. మరియు సైన్యములకు అధిపతియైన యెహోవా సెలవిచ్చునదేమనగా ఇంక కొంత కాలము ఇంకొకమారు ఆకాశమును భూమిని సముద్రమును నేలను కంపింపజేతును. నేను అన్యజనులందరిని కదలింపగా అన్య జనులందరి యొక్క యిష్ట వస్తువులు (కోరిక) తేబడును. నేను ఈ మందిరమును మహిమతో నింపుదును; ఇదే సైన్యముల కధిపతియగు యెహోవా వాక్కు".

ఇక్కడ ముగ్గురు దేవునివలె చెప్పబడ్డారు. సైన్యముల కధిపతియగు యెహోవా. ఆయన ఆత్మ మరియు అన్యజనుల యిష్టము (కోరిక) అనగా యేసు. అదే విధముగా మత్తయి 28:19లో ఈ ముగ్గురు దేవునిగా సంబోధించబడ్డారు. "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి".

ఈ వచనములో నామము అను మాట ఏకవచనమైయున్నది. గనుక ఈ ముగ్గురు వ్యక్తులు ఒకే నామమగుదురు. తదుపరి అపో.పౌలు ఈ ముగ్గురిని కలిపి 2 కొరింథీ 13 : 14లో ఇట్లు చెబుతాడు.. "ప్రభువైన యేసు క్రీస్తు కృపయు దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడై యుండునుగాక".

త్రియేక దేవుని భావము పాత నిబంధనలో మనకు పెద్దగా కనబడదని భావిస్తాము గాని పాత నిబంధనలోని అనేక లేఖనములు త్రియేక దేవుని భావముతో ఏకీభవిస్తాయి. వీటిలో విశిష్టమైనది దేవుడు తన్ను బహువచనములో సంబోధించుకొంటారు. దేవుడు ఒక్కడే అయితే ఆయన ఏక వచనముతో చెప్పబడాలి. అయినను ఎలోహిమ్ అను హెబ్రీ పదము దేవునికి వినియోగించబడినది. అది బహువచన మైయున్నది. అయినను ఆది.కా. 1:26 ను గమనించుము. "దేవుడు మన స్వరూపమందు మన పోలికె చొప్పున నరులను చేయుదము" అని పలెకెను. పలికెను అనునది ఏకవచనము గాని మన స్వరూపమందు, మన పోలికె చొప్పున అనునది బహువచనము. మరికొన్ని ఉదాహరణలు కూడ చూడవచ్చును. "అప్పుడు దేవుడైన యెహోవా – ఇదిగో మంచి చెడ్డలను ఎరుగునట్లు ఆదాము మనలో ఒకనివంటి వాడాయెను" అని తలంచెను (ఆది కా. 3:22). మరింకొక ఉదాహరణను యెషయా గ్రంథము నుండి చూడుము.. "అప్పుడు నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడుపోవునని ప్రభువు

సెలవియ్యగా వింటిని" (యెషయా 6:8). ఏకవచనమునుండి బహువచనముకు మారుట ఇక్కడ గమనించుము.

## దైవత్వాన్ని మనం ఎట్లు గ్రహించుకోగలము?

దేవుడొక్కడే యని బైబిలు బోధించుచున్నట్లు మనము గమనించాము. గాని అదే సమయములో ఆయన బహుమూర్తిత్వము గలవాడని కూడ అది తెలియజేయుచున్నది. ఈమర్మయుక్తమైన భావమును మనం ఎట్లు గ్రహించుకోగలము? దేవుడు ఒక్కడేగాని సంఖ్యలో ఆయన ఒక్కడే కాదు; గాని తత్వములో ఒక్కడైయున్నారు. ఈ ఏకత్వమును గూర్చి చెప్పు లేఖనమును గమనించుము. "ఇశ్రాయేలూ, వినుము, నీ దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా, నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమించవలెను" (ద్వితీ 6:4-6). హెబ్రీ బాషలో ఒకటి అను మాటకు రెండు పదములున్నాయి. ఒక్కడే అన్నప్పుడు అబ్రాహాము కున్న ఏకైక కుమారుని సూచించుచున్నది. నీకు ఒక్కడే అయున్న నీ కుమారుడు అని అబ్రాహాముకు చెప్పబడెను. రెండవది ద్వితీయోపదేశ కాండము 6వ అధ్యాయములో చెప్పబడిన భావము. ఇందులో అనేక సంగతులు కలసి ఒక్కటే యగుట మనము చూడగలము. అదే ఆది. కా. 2:24లో వాడబడెను. "కాబట్టి పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును. వారు ఏక శరీరమైయుందురు" (ఆది. కా. 2:24).

దైవత్వాన్ని వివరించుటకు అనేక సాదృశ్యములు వాడబడెను. గాని వాటిలో ఏదీ పరిపూర్ణము కాదు. దైవత్వాన్ని వర్ణించుటకు నీరు ఒక సాదృశ్యముగా వాడబడెను. నీరు ద్రావకముగాను, ఘన పదార్థముగాను, వాయు రూపములో కూడ యుండును. అయితే దీనిలో యున్న సమస్య యేమంటే నీరు ఒకే సమయంలో ఈ మూడు విధములుగా యుండదు. అది అసాధ్యం. మరల దైవత్వంను వర్ణించుటకు ఒక కోడి గ్రుడ్డు వినియోగించబడెను. దానిలోపైన పెంకు, లోపల తెల్లసొన, పసుపు పచ్చని సొనయుండును. దైవత్వం ఇంకా అనేక భౌతిక రూపములతో వర్ణించబడెను. మానవుడు ఒక తండ్రి వలెను, కుమారుని వలెను. భర్తవలెను ఉండుటకు సృజింపబడ్డాడు. ఉన్న వ్యక్తి ఉక్కడేగాని అతని సంబంధాలు వేర్వేరు. నాకు బైబిలు యిచ్చు వర్ణన యిష్టము. ఆది కాండము మొదటి అధ్యాయములో పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును. వారిద్దరు ఏక శరీరమైయుందురు అని చెప్పబడినది. భార్య భర్తలిద్దరు వేర్వేరు వ్యక్తులే. కాని వారిద్దరు పరిపూర్ణ ఐక్యతను కలిగియుండాలి.


అదే రీతిగా యోహాను 17:11 లో యేసు తానును, తండ్రియు ఎట్లు ఏకమై యున్నారో అట్లే తన యందు విశ్వసించు వారందరును ఏకమై యుండాలని ప్రార్థించారు. క్రైస్తవులందరు ఒకే ఒక్క వ్యక్తి కాలేరు, అది వాస్తవం. అట్లే పౌలు కూడా ఇట్లు చెప్పాడు. "నాటువాడును నీరు పోయువాడును ఒక్కడే". గనుక మానవులకు వర్తించు సంగతులు దేవునికి వర్తించవు. మానవులందరు ఒకే వ్యక్తి

కాజాలరు. దైవత్వములోని వ్యక్తులు మానవులకంటే ఉత్కృష్ట రీతిలో ఏకత్వము గలవారై యున్నారు.

దైవత్వాన్ని ఒక సొసైటీగా కూడ అనగా వ్యక్తుల సముదాయముగా (Complex గా) మనము చూడవచ్చును. దేవుడు ప్రేమయై యున్నారు. వారు ప్రేమతో బంధింపబడి యున్నారు (I యోహాను 4:8,16). ప్రేమ వారిని ఎంత సన్నిహితముగా బంధించునంటే వారు ఒకే వ్యక్తిలాగున అగపడుదురు. ప్రేమలో ఒక మూర్తి, ఆ మూర్తిని ఆరాధించు వ్యక్తి అవుసరము. గనుక సృష్టి జరుగక ముందు దేవుడు తన్ను తాను ప్రేమించు కొంటేనే తప్ప వేరొకని ప్రేమింపనవకాశము లేదు. యిది అసంతృప్తికరముగానే యుండును. అయితే దేవునిలో లేని అనేక పరిమితులు మానవునిలో యున్నవి. భౌతిక శరీరముల వలన మనము ఒండొరుల నుండి వేరు చేయబడ్డాము. దేవుడు ఆత్మ గనుక ఆయనకు పరిమితులు యేమీలేవు. మానవులు వివిధ అనుభవాలను తమ జీవితంలో కలిగియుందురు. అయితే అట్టి పరిమితి దేవునిలో లేదు. మానవులందరు తమ తమ అవసరాలను బట్టి ఆలోచించుకొనుచు యుందురు. అది అయితే దేవుని తత్వము కాదు. ఆయా కారణాల వల్ల మనము మిగతా వారితో పరిపూర్ణ సానుభూతిని గాని సంతోషమును గాని కలిగియుండుట అసాధ్యము. అయితే ఈ పరిమితులు యేమీ దేవునికి వర్తించవు. గనుక మానవులకంటే అత్యున్నతముగా పరిపూర్ణ ఏకత్వమును ఆయన సాధించగలరు.

## ముగింపు

దైవత్వమును గూర్చి కొంతమట్టుకు ఈ పాఠములలో మనము స్టడీ చేసియున్నాము. ఆయనను మనము సంపూర్తిగా గ్రహించుకొనలేముగాని ఈ పాఠముల వలన ఆయంశాన్ని మరికొంత మట్టుకు గ్రహించుకోగలిగాము. తద్వారా మన విశ్వాసములోను, బోధలోను బలపరచబడ్డాము. దైవత్వములో ముగ్గురు మూర్తులున్నారు. వారు ముగ్గురు పరిపూర్ణముగా ఏకమైయున్నారు. దైవత్వములోని ముగ్గురు మూర్తులు ఏకమై అన్ని సంగతులు జరిగించుదురు.



# II

# ఆరాధన

1. ఆరాధన యనగానేమి?
2. మనం ఎక్కడ ఆరాధించాలి?
3. ప్రార్థన
4. ప్రభురాత్రి భోజనము
5. పాటలుపాడుట
6. కానుకలిచ్చుట

# ఆరాధన అనగాయేమి?

## (What is worship?)

క్రైస్తవులు చేయు ప్రాముఖ్య విధులలో ఆరాధన ఒకటియై యున్నది. ఆధునిక ఆరాధనలో మానవులు దేవుని వాక్యాధారము లేని అనేక సంగతులు కల్పించారు. అందువలన మాటచేతగాని క్రియ చేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి" యని అపో.పౌలు చెప్పాడు (కొలస్స 3:17). యేసు పేరట ఏదైనా చేయడం అంటే ఆయన అధికారము చొప్పున చేయుట. బైబిలు ఆధారమే లేని ఆరాధన వ్యర్థము అనగా నిష్ ప్రయోజనము (మత్తయి 15:9). గనుక బైబిలు సంబంధమైన ఆరాధనలో యేమేమి వున్నదో తెలిసికొని మనము చేయు ఆరాధన దేవునికి అంగీకార యోగ్యముగా యుండునుట్లు చూచుకొనవలెను.

### ఆరాధన అనగాయేమి?

క్రొత్త నిబంధనలో వాడబడిన ఆరాధన అను పదమునకు వంగి నమస్కరించుట సాగిలపడుట లేక అమితమైన భక్తి గౌరవములను చూపుట యని అర్థము. అది భక్తిని, గౌరవమును విధేయతనుచూపుట. యోహాను 4:23-24 ఆరాధనను గూర్చి ఇట్లు చెప్పుచున్నది: "యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది. అది ఇప్పుడును వచ్చేయున్నది తన్ను ఆరాధించు వారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు;

దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింప వలెను". యధార్థముగా ఆరాధాంచు వారిని గూర్చి యేసు చెప్పినందున యధార్థముగా ఆరాధింపని వారుందురని మనకు గ్రాహ్యమగుచున్నది.

మనము తండ్రియైన దేవుని ఆరాధించాలి. యిది ప్రేమను సన్నిహితత్వాన్ని సూచించుచున్నది (ఎఫెసీ 1:3; లూకా 11:2-4). అయినను దేవుని యెడల మనకుండవలసిన భక్తి భావములు సంభ్రమాశ్చర్యములు కొనసాగుచుయుండాలి. ఆయన యెడల ఇట్టి భావములకు ఆయన అర్హుడు. ఆరాధన ఆత్మతోను సత్యముతోను యుండాలి. ఆత్మతో కూడిన ఆరాధన హృదయపూర్వకముగా నిష్కపటముగా యుండును మరియు దేవుడు తన వాక్యములో చెప్పిన రీతిగా చేయుట సత్యారాధనయై యుండును. "నీ వాక్యమే సత్యము" అని యేసు చెప్పారు (యెహాను 17:17). గనుక సత్యముతో ఆరాధించుట యనగా ఆయన చెప్పినట్లు చేయుటయే.

దేవుని ఘనపరచు క్రియ ఆరాధనయైయున్నది ఆరాధింపబడవలసిన వాడు దేవుడేగాని మానవుడుకాదని మనం గ్రహించుకోవాలి. దేవుడెవరోయని తెలుసుకొని ఆయనను గుర్తుంచుట నీవెవరవోయని గుర్తించుట; తదనుగుణంగా స్పందించుటయే ఆరాధనయని ఒకాయన అన్నారు. యిది ఒక సూక్ష్మ నిర్వచనం. ఈ పాఠంలో దానిని మూలముగా వినియోగించుటకు ప్రయత్నించుదాం,

ఆరాధనలో దేవుడెవరో తెలుసుకొని గుర్తించుట ముఖ్యము : దేవుడు సృష్టికర్త. ఆయన భూమ్యాకాశములను అందలి సమస్తమును

సృజించినవాడు (ఆది.కా. 1:1; కొలస్స 1:16). ఆయన ఒక్కడే నిజమైన దేవుడు (నిర్గ 20:2-3). ఆయన సంపూర్తిగా యధార్తవంతుడు, నీతిమంతుడు న్యాయవంతుడు (మార్కు 10:18). ఆయన ఇశ్రాయేలు యెక్క పరిశుద్ధ దేవుడు అని యెషయా చెప్పినప్పుడు ఈ సత్యాన్ని వక్కాణించుచున్నాడు (యెషయా 1:4;43:15). ఇదొక విపరీత విరుద్ధము. పరిశుద్ధుడు మన మధ్యన యున్నాడు. "సీయోను నివాసీ ఉత్సాహధ్వని బిగ్గరగా చేయుము. నీమధ్యనున్న ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడు ఘనుడైయున్నాడు" (యెషయా 12:6).

రెండవదిగా మనమెవరమో గుర్తించాలి : మానవుని యొక్క జీవితాన్ని సంక్షిప్తముగా చెప్పుటకు పౌలు కీర్తన 14:1-3; 53:1-3 లను రోమా 3:10-12లో ఎత్తిచూపించాడు. "నీతిమంతుడు లేడు ఒక్కడును లేడు. గ్రహించువాడెడును లేడు, దేవుని వెదకు వాడెవడును లేడు. అందరును త్రోవతప్పి యేకముగా పనికిమాలిన వారైరి. మేలుచేయువాడు లేడు, ఒక్కడైనను లేడు". యోబు గొప్ప విశ్వాస పరీక్షను ఎదుర్కొని నిలిచివాడైనను, "నన్ను నేను అసహ్యించుకొని ధూళిలోను బూడిదలోను పడి పశ్చాత్తాపపడుచున్నాను" అని పలికాడు (యోబు 42:6).

ప్రవక్తయైన యెషయా దైవ దర్శనమును పొందిన తరువాత "అయ్యో అపవిత్రమైన పెదవులు గలవాడను" అని అరిచాడు (యెషయా 6:5). మనము తరచు నీతిమంతులుగా సద్వర్తనులుగా తరుచు ఎంచుకొనుచున్నను దేవునితో పోల్చినప్పుడు మనం పాపాత్ములము. దేవుని పరిపూర్ణ స్థాయి అది. మానవుని మంచితనము

కంటే ఎంతో ఉన్నతమైనది గనుక ఆరాధనలో ఒకడు తన పాపపుతత్వాన్ని అనర్హతను గుర్తిస్తాడు. దేవుని సమీపించుటకు అతని అయోగ్యతను గుర్తిస్తాడు (లూకా 5:8; యెష 6:5). యిది ఆరాధించు వాని హృదయంలో కృతజ్ఞతను వినయమును ప్రోత్సహిస్తాది.

మూడవదిగా మనము సరియైన విధముగా స్పందించాలి: సరియైన స్పందన అనగా యేమిటి? ఇందులో అనేక సంగతులు ఇమిడియున్నాయి. 1. మనము వినయ విధేయతలు కలిగి దేవునిపై ఆధారపడాలి 2. కృతజ్ఞత భావము కలిగియుండాలి. మానవుడు కృతజ్ఞత కలిగియుండాలని బైబిలు ప్రోత్సహించుచున్నది. మన ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి ఎల్లప్పుడు కృతజ్ఞత చెల్లించుచు యుండాలి (ఎఫెసీ 5:20). 3. అట్లే మనము సంతోషముతో నిండియుండాలి. "ప్రభువునందు ఎల్లప్పుడును ఆనందించుడి మరల చెప్పుదును ఆనందించుడి" (ఫిలిప్పీ 4:4): "కాగా మీరు పరిశుద్ధాత్మ శక్తిపొంది, విస్తారముగా నిరీక్షణ గలవారగుటకు దేవుడు విశ్వాసము ద్వారా సమస్తానందముతోను సహనముతోను మిమ్మును నింపునుగాక" (రోమా 15:13). 4. ఆయన చిత్తముకు మనము సంపూర్తిగా సమర్పించుకొనవలెను. "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టిసేవ మీకు యుక్తమైనది".

అన్నీ కరెక్టుగా ఆరాధించితే సరిపోదు. అది పవిత్ర జీవితమునకు నడిపించాలి. మన జీవిత విధానము నుండి మన ఆరాధనను వేరు

చేయలేము. పరిశుద్ధ జీవితం మన ఆరాధన యనంతరం కనబడని యెడల దేవుడు మన ఆరాధనను ద్వేషిస్తారు. "మీ పండుగ దినములను నేను అసహ్యించుకొను చున్నాను, వాటిని నీచముగా ఎంచుచున్నాను. మీ వ్రత దినములలో కలుగు వాసనను నేను ఆఘ్రాణించనొల్లను. నాకు దహన బలులను; సమాధాన బలులుగా మీరర్పించు క్రొవ్విన పశువులను నేను చూడను" (ఆమోసు 5:21-22). ఆమోసు కాలములోని ఇశ్రాయేలీయులు దేవుని సరిగనే ఆరాధించు చున్నారు. గాని వారి జీవితములలో పరిశుద్ధత లేదు. గనుక దేవుడు వారి ఆరాధనను తిరస్కరించారు.

## ఆరాధన యొక్క ప్రయోజనములు

ఆరాధన యొక్క రెండవ ఉద్దేశ్యము సహోదరులను హెచ్చరించుటయే. "కొందరు మానుకొను చున్నట్టుగా సమాజముగా కూడుట మానక ఒకనినొకడు హెచ్చరించుచు ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరియెక్కువగా ఆలాగు చేయుచు ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకని నొకడు పురికొల్ప వలెను'' (హెబ్రీ 10:25). సమాజముగా (సంఘముగా) కూడుకొనుటను యిది వక్కాణించుచున్నది. సంఘముగా కూడుకొనకుండా ఒకరి నొకరు హెచ్చరించలేము.

"సమస్తమును క్షేమాభివృద్ధికలుగుటకై జరుగనియ్యుడి" యని కొరింథులోని సంఘమునకు అపో. పౌలు సలహాయిచ్చాడు (1 కొరింథీ 14:26). క్షేమాభివృద్ధి పెరుగుదలను సూచించుపదము I కొరింథీ 14లో 7 సార్లు వినియోగింపబడెను. ఆరాధనలోయున్న లోపములను ఆత్మీయ వరములను గూర్చిన లోపములను సరిదిద్దుటకు పౌలు

కొరింధీయులకు పత్రికలు వ్రాశాడు. అయినను సంఘము యొక్కయు క్రైస్తవుల యెక్కయు క్షేమాభివృద్ధియే ముఖ్య ఉద్దేశ్యము.

ఆరాధన యొక్క మరియొక ఉద్దేశ్యము మన రక్షణను ప్రకటించుటకును క్రీస్తులో మన ఐక్యతను చాటుటకును అయియున్నది. "మనము దీవించు ఆశీర్వచనపు పాత్రలోనిది త్రాగుట క్రీస్తు రక్తములో పాలు పుచ్చుకొనుటయే గదా. మనము విరుచు రొట్టె తినుట క్రీస్తు శరీరములో పాలు పుచ్చుకొనుటయే గదా. మనమందరము ఆ ఒక్కటే రొట్టెలో పాలుపుచ్చుకొనుచున్నాము. రొట్టె ఒక్కటే గనుక అనేకులైన మనము ఒక్కటే శరీరమైయున్నాము" (I కొరింధీ 10:16-17). దాని తదుపరి అధ్యాయములో "మీరు ఈ రొట్టెను తిని, ఈ పాత్రలోనిది త్రాగునప్పుడెల్లా ప్రభువు వచ్చు వరకు ఆయన మరణమును ప్రచురించుదురు" అని చెప్పాడు (I కొరింధీ 11:26). గనుక మనము ప్రభు రాత్రి భోజనములో పాలుపొందునప్పుడెల్ల క్రైస్తవేతరులకు క్రైస్తవులకు కూడ క్రీస్తు యొక్క గొప్పతనమును గూర్చి బలియాగమును గూర్చి ప్రకటించుదుము. తోటి క్రైస్తవులకు మన రక్షణను గూర్చి క్రీస్తు శరీరములో యున్న గొప్పసహవాసమును గూర్చి ప్రచురించుదుము.

## ముగింపు

ఆరాధన అనగా యేమిటో దాని ప్రయోజనములేమిటో ఈ పాఠములో గమనించాము. ఆధునిక ఆరాధనలలో అనేక అపశృతులు ప్రవేశించాయి. ఆరాధన యొక్క ఉద్ధేశ్యమును మరచి దానిని మన వినోద కార్యక్రమముగా ఎంచుటవలన అట్లు జరిగినది. రాబోవు పాఠములలో ఆరాధనలోని ప్రతి క్రియను విశ్లేషించుదము.

## ౨. మనము ఎక్కడ ఆరాధించాలి?

**(Where should we worship?)**

మానవులు ఆరాధన ద్వారా ఎల్లప్పుడు దేవుని సమీపించుదురు. ఆదిలోనే కయీను, హేబెలులు దేవునికి అర్పణలు తీసుకొనివచ్చుట చూస్తాము (ఆది.కా.4:15). ఆ యిద్దరు దేవునికి అర్పణలు తెచ్చినను హేబెలు యొక్క అర్పణను దేవుడంగీకరించినట్లు మనము గమనిస్తాము. పితరుల కాలములో ప్రతి కుటుంబము దేవునికి తమ తమ అర్పణలు అర్పించిరి. సీనాయి కొండమీద దేవుడు ఇశ్రాయేలీయులతో నిబంధన చేసినప్పుడు వారి ఆరాధన అంతయు ప్రత్యక్ష గుడారములో లేవీ యాజకుల ద్వారా జరుగవలెనని దేవుడు ఆజ్ఞాపించారు. తదుపరి వారి రాజ్యము ఏర్పడగా తాత్కాలికమైన ప్రత్యక్ష గుడారము యొక్క స్థానములో శాశ్వతమైన దేవాలయము యెరూషములో నిర్మించబడెను. గనుక అప్పటి నుండి ఇశ్రాయేలీయుల ఆరాధన అంతయు యెరూషలేములో జరిగెను.

తదుపరి క్రీస్తు ఏర్పరచిన నిబంధనను బట్టి ఆరాధన ఎక్కడైనా జరిగించ వచ్చును. యేసు సమరయ స్త్రీతో యాకోబు బావియొద్ద మాటలాడుచు "అమ్మా ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను, యెరూషలేములోనైనను మీరు తండ్రిని ఆరాధింపరు" అని చెప్పారు (యోహాను 4:21). ఇంకో మాటలో ఆరాధన చేయు స్థలము ప్రాముఖ్యముకాదు. ఇప్పుడు ప్రపంచమంతాయున్న దేవుని ప్రజలు ఆయనను ఎక్కడైనా ఆరాధన చేయవచ్చును. స్థలము ప్రాముఖ్యము కాదు.

# మనమెప్పుడు ఆరాధన చేయాలి?

మోషే ధర్మశాస్త్ర కాలములో ఇశ్రాయేలీయులు సబ్బాతు దినమున (శనివారమున) ఆరాధించాలని చెప్పబడెను. "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపక ముంచుకొనుము ఆరు దినములు నీవు కష్టపడి పనిచేయవలెను. ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు పరిశుద్ధ దినము. దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను నీ దాసుడైనను నీ దాసియైనను నీ పశువైనను నీ యిండ్లలోనున్న పరదేశి యైనను ఏ పనియు చేయకూడదు. ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి యేడవ దినమున విశ్రమించెను. అందుచేత యెహోవా విశ్రాంతి దినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధ పరచెను" (నిర్గమ 20:8–11). ఈ నిబంధన కేవలము ఇశ్రాయేలీయులకే ఇయ్యబడెను. తదుపరి మోషే ఇట్లు చెప్పాడు. "ఇశ్రాయేలీయులారా, నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న కట్టడలను విధులను విని వాటిని నేర్చుకొని వాటిననుసరించినడువుడి. మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను. యెహోవా మన పితురులతో కాదు, నేడు ఇక్కడ సజీవులమై యున్న మనతోనే యీ నిబంధన చేసెను" (ద్వితీ 5:1–3). సబ్బాతుతో కూడియున్న ఈ నిబంధన ఇశ్రాఏలీయులతో మాత్రమే చేయబడెను. అది వారి సంతతికి చెల్లును గాని వారి పూర్వీకులకు కాదు. అది అన్యులకు వర్తించదు.

యేసు ఈ (పాత) నిబంధనను సిలువకు మేకులతో కొట్టి వేసారు. “దేవుడా వ్రాత రూపకమైన ఆజ్ఞల వలన మన మీద రుణముగాను మనకు విరోధముగాను ఉండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండా దానిని ఎత్తివేసియున్నారు” (కొలస్స 2:14). రోమాపత్రిక 7వ అధ్యాయములో మనము క్రీస్తు అను వేరొకని చేరుటకు ధర్మశాస్త్రము విషయమై మృతులమైతిమి యని అపొ.పౌలు బోధించాడు. మరల రోమా 7:7లో ఆశింపవద్దని ఏ ధర్మశాస్త్రము చెప్పెనో దాని విషయమై మృతులమైతిమి యని తెలియజేసాడు. అది పది యాజ్ఞలలో ఒకటి (నిర్గమ 20:17). పది యాజ్ఞలలో ఒకదాని విషయమై ఒకడు మృతిచెందిన యెడల అతడు ఆజ్ఞలన్నిటి విషయమై మృతిజెందును. గనుక మనము సబ్బాతుదినమును పరిశుద్ధముగా ఆచరించ నవుసరము లేదు. ఆ దినమున ఆరాధన చేయనవుసరము లేదు.

క్రొత్త నిబంధన ప్రకారము మనము వారములో మొదటి దినమున ఆరాధించవలెను. ఆదిమ సంఘము ప్రారంభము నుండి మొదటి దినముననే ఆరాధించిరి. త్రోయలో యున్న సంఘముతో అపొ.పౌలు ఆదివారమున కూడుకొనెను. అయినను అతడు ఆ పట్టణములో ఏడు దినములు గడిపెను. వారు ఆదివారమున పౌలు కొరకు ప్రత్యేకముగా కూడు కొనలేదు గాని అది వారు సాధారణంగా ఆరాధనకు కూడుకొనే దినము. వారు రొట్టె విరుచుటకు అనగా ప్రభురాత్రి భోజనము నాచరించుటకు కూడుకొనిరి. పౌలు ప్రసంగము కొరకు గాక ప్రభువు బల్లలో పాలు పుచ్చుకొనుటకు కూడుకొనిరి.

సబ్బాతునాడు అతడు వారితో యుండెను గాని వారితో కలసి ఆరాధించుటకు ఆదివారమున కూడుకొనెను. కొరింధులో యున్న సంఘము ఆదివారమున చందాపోగుచేయుటకు కూడుకొనవలెనని పౌలు వారిని ఆజ్ఞాపించెను (I కొరింధీ 16:1-2). యిది ఆరాధన కొరకు కూడుకొను దినమని మరియొకసారి గ్రాహ్యమగుచున్నది.

ఆదిమ సంఘము దేవుని ఆరాధించుటకు ఆదివారమున కూడుకొనుట సహజమే. సంఘస్థాపన విషయములో ప్రాముఖ్య సంగతులన్నీ ఆదివారముననే సంభవించెను. యేసు ప్రభువు ఆదివారమున మృతులలో నుండి తిరిగిలేచెను. ఆదివారమున పెందలకడనే స్త్రీలు యేసు సమాధికి వచ్చి ప్రభువులేచెనని తెలుసుకొనిరి (లూకా 24:1). వారా సమాధి దగ్గరయుండగా ప్రకాశమానమైన వస్త్రములు ధరించిన యిద్దరు మనుష్యులు "మనుష్య కుమారుడు పాపిష్టులైన మనుష్యుల చేతికి అప్పగింపబడి సిలువ వేయబడి మూడవ దినమున లేవవలసియున్నదని ఆయన మీతో చెప్పిన మాట జ్ఞాపకము చేసుకొనుడని వారితో చెప్పిరి" (లాకా 24:7).

యేసు శుక్రవారమునాడు సిలువ వేయబడెను గనుక ఆదివారము మూడవదినమగును. యూదులు కాలమును లెక్కించు ప్రకారము అది మూడోదినమగును. వారు దినములో ఒక భాగమును ఒక రోజుగా పరిగణించేవారు. ఆదినమందే యిద్దరు మనుష్యులు యెరూషలేము నుండి ఎమ్మాయు అనే వూరికి వెళ్లుచుండిరి (లూకా 24:13). యేసు వారితో కలసి కొని నడిచెను గాని వారాయనను గురుతుపట్టలేదు ఆయనతో సంభాషిస్తు ఆ యిద్దరిలో ఒకడు

“ఇశ్రాయేలును విమోచింపబోవువాడు ఈయనే అని మేము నిరీక్షించియుంటిమి. అదిగాక ఈ సంగతులు జరిగి నేటికి మూడు దినములాయెను ” అని చెప్పిరి (లూకా 24:21). యేసు తాను మూడవ దినమున తిరిగి లేతునని ప్రవచించినట్లు క్రైస్తవులు ఈ రీతిగ ఎరిగియున్నారు. అది ఆదివార దినము. పునరుత్థానుడైన యేసు తన శిష్యులతో ఆదివారమున కూడుకొనెను (యోహాను 20:19). గాని అపొ. తోమా వారితో లేడు.

మరుసటి ఆదివారమున యేసు మరల తన శిష్యులను కలసికొనగా తోమా కూడ వారితో యుండెను. క్రీస్తు సంఘము పెంతెకొస్తు నాడు స్థాపించబడెను. పెంతెకొస్తు ఎల్లప్పుడు ఆదివారముననే వచ్చెడిది (లేవీ.కా. 23:15-16). పెంతెకొస్తునాడు అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. ఆదినమందే మొట్టమొదటి సువార్త ప్రసంగము చేయబడెను. అది యెషయా 2:2-4 ప్రకారము నెరవేరెను. ఆ దినమందే ఇంచుమించు మూడు వేలమంది బాప్తిస్మము పొంది రక్షింపబడిరి. వారే మొట్టమొదటి క్రీస్తు సంఘమయ్యిరి (అపొ.కా. 2:41-47). ఆ క్షణము నుండి సంఘము ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొనుచున్నట్లు చదువగలము అప్పటికి క్రైస్తవులైన వారందరు యూదులు. వారు సబ్బాతు (ఏడవ) దినమున ఆరాధించుటకు అలవాటు పడినవారు గాని ఇప్పుడు వారములో మొదటి దినమున ఆరాధించుటకు కూడుకొనుచుండిరి.

# బోధించుట, ఉపదేశించుట

దేవుని వాక్య పఠనము, ఉపదేశము క్రైస్తవ ఆరాధనలో ఒక ప్రాముఖ్య భాగమైయున్నది. సాధారణంగా ఒక వ్యక్తి దేవుని వాక్యముపై ఆధారపడి ఉపదేశము చేయును. గాని దేవుని వాక్యమును పఠించు విధానము అది ఒక్కటే కాదు. ముఖ్య సంగతి యేమంటే సంఘము క్షేమాభివృద్ధి పొందునట్లు దేవుని వాక్యము బోధింపబడాలి. దేవుని వాక్యోపదేశమును గూర్చి అనేక లేఖన బాగములున్నవి. త్రోయలో యున్న సంఘములో పౌలు అర్ధరాత్రివరకు విస్తరించి మాటలాడు చుండెను (అపొ.కా. 20:7). "ఇందు నిమిత్తము ప్రభువు నందు నాకు ప్రియుడును నమ్మకమైన నా కుమారుడు తిమోతిని మీ యొద్దకు పంపియున్నాను. అతడు క్రీస్తునందు నేను నడుచుకొనుచున్న విధమును అనగా ప్రతి సంఘములోను నేను బోధించు విధమును మీకు జ్ఞాపకము చేయును" (I కొరింథీ 4:17). "దేవుని యెదుటను సజీవులకును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తుయేసు ఎదుటను ఆయన ప్రత్యక్షత తోడు నేను ఆనబెట్టి చెప్పునదేమనగా వాక్యమును ప్రకటించుము; సమయమందును అ సమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము బుద్ధిచెప్పుము" (2 తిమో 4:1-2).

సువార్త వ్యాప్తి కొరకు దేవుడు బోధించడాన్ని ఎంచుకొన్నారు. "దేవుని జ్ఞానాను సారముగా లోకము తన జ్ఞానము చేత దేవుని

ఎరుగకుండినందున సువార్త ప్రకటన యను వెర్రితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్ప మాయెను" (I కొరింథీ 1:21). "నేను యేసుక్రీస్తును అనగా సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప మరి దేనిని మీ మధ్య ఎరుగకుందునని నిశ్చయించుకొంటిని" యని పౌలు కొరింథు సంఘమునకు తెలియజెప్పాడు (I కొరింథీ 2:2). అతడు జ్ఞానయుక్తమైన మాటలను వినియోగించలేదు (I కొరింథీ 2:5). I కొరింథీ 14లో అన్య భాషలను గూర్చిన అపోహలను సరిజేస్తు వారికి బోధించాడు. వాటియొక్క ప్రాముఖ్య ప్రయోజనము సంఘ క్షేమాభివృద్ధియే (I కొరింథీ 14:4-5). మాట్లాడినది ప్రజలు గ్రహించితే క్షేమాభివృద్ధి కలుగును I కొరింథీ 14:26 పౌలు యొక్క ముగింపు గమనించుము. "సమస్తమును క్షేమాభివృద్ధి కలుగుటకై జరుగనీయుడి". దేవుని వాక్యమును గ్రహించుకొనుట ద్వారానే ఒకడు క్షేమాభివృద్ధినొందును. గనుక ఆరాధనలో దేవుని వాక్యము బోధింపబడుట ఎంత ముఖ్యమో మనము గమనించగలము.

వాక్యోపదేశము గావించుటే ఆరాధనలో ఒక ముఖ్య భాగమైయున్నది. అది ఒక వినోద కార్యక్రమము కాదు లేదా ఒకని వాక్చాతుర్యాన్ని ప్రదర్శించే కార్యక్రమము కాదు. బోధించుట ద్వారా ఆరాధకుడు దేవుని వాక్యాన్ని వింటాడు. ఆయనను గ్రహించుకొంటాడు. ఉపదేశకుడు తాను బోధించేది దేవుని వాక్యము నుండే సేకరించును. ఉపదేశము వలన ఒకడు వాక్యాన్ని తన జీవితానికి అన్వయించు

కొనును. ఉపదేశము వలన మనం దేవుని చూస్తాం. మనలను మనమే చూచుకొంటాము మన జీవిత ధ్యేయాన్ని గ్రహించుకొంటాము. ఒక ప్రత్యేక వ్యక్తి మాత్రమే బోధించాలని ఎక్కడాలేదు. ఒకడు బైబిలులో శిక్షణ పొందిన యెడల మంచిదే గాని ఎవరైనను వాక్యమును బోధించవచ్చును. ఒకనికి బోధించే శక్తి సామర్ధ్యము ఆసక్తి కలిగియున్న యెడల అతడు తప్పక బోధించాలి. అతడు స్వయం కృషి వలన బోధించగలిగితే మంచిదే. "గురువులు" మాత్రమే బోధించాలని ఎక్కడాలేదు. అది మానవ కల్పిత పద్ధతి, బైబిలు ప్రకారమైనది కాదు.

# 3. ప్రార్థన

## (Prayer)

క్రైస్తవులు దేవునికి చేయు ఆరాధనలో ప్రార్థన ఒక ముఖ్యభాగమైయున్నది. దానియొక్క ప్రాముఖ్యతను బైబిలు వక్కాణించుచున్నది. ప్రార్థనను గూర్చిన కొన్ని లేఖన భాగములు గమనించుము. ''వారు విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉప మానము చెప్పెను" (లూకా 18:1). "నిరీక్షణ గలవారై సంతోషించుచు శ్రమ యందు ఓర్పుగల వారై ప్రార్థన యందు పట్టుదల గలిగి యుండుడి" (రోమా 12:12). "ఆత్మవలన ప్రతి సమయమందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి" (ఎఫెసీ 6:18).

### ప్రార్థన అనగా యేమిటి?

మొట్టమొదటిగా మనము దేవునితో మాట్లాడు మాధ్యము ప్రార్థన యని గ్రహించుకోవాలి. దేవునియందు సంపూర్ణ నమ్మకంతో ప్రార్థన దేవునికి సమర్పించాలి. అది నిష్కల్మషముగా హృదయ పూర్వకముగా యుండాలి. అది సరియైన మాటలు ఉచ్చరించుటయే కాదు. అది ఒక మంత్రము వంటిది కాదు. అది మన ప్రవర్తన యొక్క ప్రతిబింబమై యుండాలి. మనము ఎడతెగక నిత్యము ప్రార్థించాలి యని I థెస్స

5:17లో పౌలు చెప్పాడు. ఎడతెగక నిత్యము ప్రార్థించాలి యనునప్పుడు దేవుడు మన మనసులో నుండి ఎన్నడు దూరముగా లేడను తలంపు అందున్నది. మరియు మన హృదయము మనస్సు, జీవితములో ప్రార్థన ఒక సహజ భాగమైనట్లుండాలి. అన్నివేళలా మనం మన మనస్సులో ఒక నిశ్శబ్ధ ప్రార్థన చేసికోవాలి. దేవుని సహాయత కొరకు నడిపింపు కొరకు ఆయన నడగాలి, ఆదిమ సంఘము ప్రార్థనలో ఎడతెగక యుండిరి (అపొ.కా. 2:42).

ప్రార్థన ఒక మేజిక్ మంత్రము కాదు. ధనార్జన కొరకు అది ఒక మార్గము కాదు. దేవుడు తన ప్రజల ప్రార్థనలను విందునని వాగ్దానము చేసినను (మత్తయి 21:22), అన్ని సంగతులు ఆయన ఆధీనములో యున్నవని మనం జ్ఞాపకముంచు కోవాలి. యాకోబు 4:1-6 లో క్రైస్తవులు దేవుని నడుగుదురు గాని కొన్ని సంగతులు వారు పొందరు అని యాకోబు వ్రాసాడు. వారు తమ స్వార్థము నిమిత్తమై అడుగుదురు గనుక పొందరు అని యాకోబు తెలియజేసాడు. వారు తమ భోగేచ్ఛల నిమిత్తము అడుగుదురు గనుక వారికేమియు లభించదు అని అతడు చెప్పాడు. గనుక ప్రార్థన అనగానే మనం అడిగిన వన్నీ ఆయన వెంటనే అనుగ్రహిస్తారని తలంచరాదు.

ప్రార్థన ఒక తుది హెచ్చరిక (Ultimatum) కారాదు. నీవు నన్ను దీవించిన యెడల నేను నీ సేవ చేతుననే షరతులను దేవునికి పెట్టరాదు. ఆయన మనకు చేసిన దానిని బట్టి మనం దేవునికి సేవచేయ బాధ్యులం.

గనుక అనర్థమైన వాగ్దానములు చేసి దేవునిని మరింత మనం బలవంతపెట్టలేము. సరిగదా అత్యవసర పరిస్థితుల్లోనే ప్రార్థన చేయడం కూడా సబబు కాదు. కష్టాలు కలిగినప్పుడు అనేకులు అకస్మాత్తుగా దేవునికి ప్రార్థన చేస్తారు. అయితే ఆ కష్టాలు తీరగానే వారు దేవుని మరచిపోయి తమ గత జీవితాన్నే జీవిస్తువుంటారు.

## ఎవరు ప్రార్థించాలి?

అందరు ప్రార్థన చేయవచ్చని అనేకులు జవాబిస్తారు. ప్రార్థన చేయడం నేను నిరుత్సాహపరచను గాని అది దేవుని బిడ్డలకు మాత్రమే రిజర్వు చేయబడిన దీవెన యని మనం గ్రహించాలి. దేవుని ఆత్మీయ కుటుంబమునకు చెందని వారి యొక్క ప్రార్థనలను దేవుడు ఆలకించుననే నిర్ధారణ యేమీ లేదు. “భక్తిహీనులకు యెహోవా దూరస్థుడు. నీతిమంతుల ప్రార్థన ఆయన ఆలకించును” (సామె 15:29). 1పేతురు 3:12లో పేతురు కీర్తన 34లో చెప్పబడిన మాటలను ఎత్తిచూపిస్తాడు. “ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను ఆయన చెవులు వారి ప్రార్థనలవైపునను ఉన్నవి. గాని ప్రభువు ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది”. వీటితో మరికొన్ని వచనములను కూడ మనము జత చేయవచ్చును. అయితే ప్రార్థనను గూర్చి వ్రాయబడిన వచనములన్ని యును దేవుని బిడ్డల కొరకే వ్రాయబడినవని గమనించుము. అంతేకాకుండా నీతిగా జీవించు క్రైస్తవులకే ప్రార్థించే అర్హత యున్నదని తెలిసికొనుము. “మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి

చేయుచున్నాము గనుక మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" (I యోహాను 3:22). ఆయన ఆజ్ఞలను గైకొను వారి ప్రార్థనలనే దేవుడాలకించునని యోహాను వ్రాసిన సంగతిని గమనించుము.

క్రైస్తవులు ఒకరి కొరకు ఒకరు ప్రార్థించవలెనని ఆజ్ఞాపింపబడి యున్నారు. "మీ పాపములను ఒకరితో ఒకరు ఒప్పుకొనుడి. మీరు స్వస్థత పొందునట్లు ఒకరి కొరకొకరు ప్రార్థనచేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహుబలముగలదై యుండును" (యాకోబు 5:16). క్రైస్తవులందరి నిమిత్తమై ఈ మాటలు వ్రాయబడెను. మరియు నీతిమంతుని ప్రార్థన బలము గలదైయుండునని చెప్పబడియున్నది. అతడు బోధకుడే కానక్కరలేదు. మనం ఒక గురువు దగ్గర పాపములు ఒప్పుకొనాలని ఎక్కడా లేదు. ఒక గురువు, గాని బోధకుడు గాని వాని ప్రార్థన బలమైనదని ఎక్కడ చెప్పబడలేదు. ఒక మనుష్యుని జీవితం ముఖ్యము. అతని ఉద్యోగము కాదు. విధేయతకు బదులు ప్రార్థన సరికాదు. కొన్ని సందర్భాల్లో దేవుడు ప్రార్థన ఇక చాలునని చెప్పినట్లు చూడగలము (నిర్గమ14:15, అపో.కా. 22:16).

"కావున ప్రతి స్థలమందును పురుషులు కోపమును సంశయమును లేనివారై పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నానని" అపో.పౌలు చెప్పాడు (1తిమో 2:8). గ్రీకు భాషలో ఇక్కడ వాడబడిన పురుషులు అను పదముకు పురుషులు మాత్రమే

అను భావము వచ్చును. స్త్రీలకు, మానవజాతికి వాడబడిన పదములు వేర్వేరు. గనుక బహిరంగ ప్రార్థనలు పురుషులు మాత్రమే చేయవలెనని పౌలు విశదపరచుచున్నాడు. చేతులెత్తి ప్రార్థన చేయుటను గూర్చి ప్రజలు తరుచు అడుగుదురు. చేతులు పైకెత్తి ప్రార్థన చేయుటలో తప్పేమీ లేదుగాని, అట్లు చేయాలనేది ఆజ్ఞ కాదు. లేఖనాల్లో ప్రార్థన చేయువారు వివిధ భంగిమలలో యుండినట్లు గమనించగలము. గాని చాలాసార్లు వారు సాష్టాంగ పడినట్లును, మోకాళ్లానినట్లును గమనించగలము. మనం ప్రార్థన చేయునప్పుడు శారీరక భంగిమ ముఖ్యము కాదు. మన జీవితములు పరిశుద్ధముగా యుండాలని పౌలు హెచ్చరిక చేసాడు.

## మనము దేనిని గూర్చి ప్రార్థించాలి?

మన ప్రార్థనలలో అనేక సంగతులు ఇమిడియున్నాయి. ముఖ్యముగా ప్రార్థనలో మనం దేవునికి స్తుతులు చెల్లించాలి. తదుపరి ఆయన భౌతికంగాను, ఆత్మీయంగాను అనుగ్రహించిన దీవెనల కొరకు కృతజ్ఞత చెల్లించాలి. "దేనిని గూర్చియు చింత పడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసు క్రీస్తువలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి యుండును" (ఫిలిప్పీ 4:6-7). ప్రార్థనలయందు నిలకడగా ఉండి కృతజ్ఞత గలవారై

దానియందు మెలకువగా ఉండుడి" (కొలస్స 4:3). వ్యక్తి గత అవుసరములను కూడ పౌలు ప్రార్థనలో ఇమిడ్చియున్నాడని గమనించుము. వ్యక్తిగత అవుసరముల కొరకు ప్రార్థించుట స్వార్థము గాని, పాపముగాని కాదు. మనం దేవుని జ్ఞానముకొరకు, నడిపింపు కొరకు అడగాలి (యాకోబు 5:16).

మన ప్రార్థనలలో ముఖ్యమైనది ఒప్పుకోలు, మన విశ్వాసాన్ని, పాపములను ఆయన యెదుట ఒప్పుకోవాలి. మన పాపములను ఒప్పుకొనిన యెడల దేవుడు నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపమును క్షమించును (1యోహాను 1:8). ఒప్పుకోలుతో మారుమనస్సు జోడించి యున్నదని గ్రహించాలి. మనం బీదల కొరకు, రోగుల కొరకు, రాజుల కొరకు, ఇతర క్రైస్తవుల కొరకు ప్రార్థించాలి (యాకోబు 5:16). దేవుని క్షమాపణ అడినప్పుడు మనం కూడా యితరుల అపరాధములను క్షమించాలి. ఇతరులను మనం క్షమించకపోతే దేవుడు కూడా మనలను క్షమించరు (మత్తయి 11:26).

## మన మెట్లు ప్రార్థించాలి?

మన మనస్తత్వము ప్రార్థనలో అతి ప్రాముఖ్యమైనది. దేవుని యందు బలమైన విశ్వాసముతో, నిష్కపట హృదయముతో మనం ప్రార్థించాలి. "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురుగాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది" అని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 15:9). నిష్కపట హృదయంతో ప్రార్థించునప్పుడు

వినయ భావన కలిగి సరియైన ఉద్దేశ్యముతో ప్రార్థించాలి. పొడవుపాటి ప్రార్థనలు చేయనవసరము లేదు. వ్యర్థమైన మాటలు పలుకు సుదీర్ఘ ప్రార్థనలు యేసు ఖండించారు (మత్తయి 6:5-8). గొప్ప విశ్వాసులు చేసిన ప్రార్థనలు బహు స్వల్పమైనవే. మనం భక్తితో దేవుని ప్రార్థించాలి. దేవుడు దేవుడని మనం మానవమాత్రులమని జ్ఞాపకముంచుకోవాలి. "నీవు దేవుని సన్నిధిని అనాలోచితముగా పలుకుటకు నీ హృదయమును త్వరపడ నియ్యక నీ నోటిని కాచుకొనుము. దేవుడు ఆకాశమందున్నాడు. నీవు భూమిమీద ఉన్నావు. కావున నీ మాటలు కొద్దిగా ఉండనిమ్ము" (ప్రసంగి 5:2).

మనం దేవునికి మధ్యవరియైన యేసు ద్వారా ప్రార్థించాలి. "దేవుడొక్కడే, దేవునికిని మనుష్యునికి మధ్యవర్తియు ఒక్కడే. ఆయన క్రీస్తు యేసను నరుడు" అని పౌలు చెప్పాడు (1తిమో 2:5). ఇద్దరు వ్యక్తుల మధ్య సంధికూర్చువాడు మధ్యవర్తి. ఇక్కడ దేవునికి మానవునికి మధ్యవర్తి అవసరం. మధ్యవర్తి ఇరుపక్షాల యున్నవారిని క్షుణ్ణంగా ఎరిగినవాడైయుంటాడు. గనుక యేసుక్రీస్తు కంటే శ్రేష్టమైన మధ్యవర్తి మానవులకు లేడు. ఆయన దేవుడు గనుక దేవుని ఎరిగిన వాడు; ఆయన మానవావతారి యయ్యారు. గనుక మానవుని కూడా బాగుగా ఎరుగును (ఫిలిప్పీ 2:5-11). మన ప్రార్థనలు దేవునికి చేర్చుటలో పరిశుద్ధాత్ముడు కూడ పాత్ర కలిగియున్నారని పౌలు చెప్పుచున్నాడు. "అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన

చేయవలెనో మనకు తెలియదు గాని ఉచ్చరింప శక్యముగాని మూలుగులతో ఆ ఆత్మతానే మన పక్షముగా విజ్ఞాపన చేయుచున్నాడు" (రోమా 8:26-27). ఈ మూలుగులు మానవునివి కాదు గాని అవి ఆత్మయొక్క మూలుగులు. ఆత్మ చేయు ప్రతీది మనకు గ్రాహ్యాము కాకపోవచ్చును. గాని ఆత్మయు క్రీస్తును మన విజ్ఞాపనలను దేవుని యెదుట మన కొరకు సమర్పించుదురు. యిది మనకు గొప్ప ప్రోత్సాహకారణము.

మన ప్రార్థనల విషయంలో మనం చేయ గలిగినదంతా చేయుదుమని పేతురు చెప్పుచున్నాడు. మనం యేమీ చేయకుండా యితరులకు సహాయం చేసే సాధనం ప్రార్థన కాదు. ఇట్టి స్వభావమును గూర్చి యాకోబు హెచ్చరించాడు. "సహోదరుడైనను, సహోదరియైనను దిగంబరులై ఆనాటికి భోజనములేక యున్నప్పుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసిన వాటిని ఇయ్యక, సమాధానముగా వెళ్ళుడి. చలి కాచుకొనుడి, తృప్తి పొందుడని చెప్పి యెడల ఏమి ప్రయోజనము?" (యాకోబు 2:16-17). ఇంకో మాటలో మనం ప్రార్థన మాత్రం చేసి, వారికి సహాయం చేయకపోతే అవి నిష్ప్రయోజనము. దేవుడు తన సేవకుల ద్వారా ప్రార్థనలకు జవాబిచ్చును. గనుక యితరులకు సహాయం యేమీ చేయక కేవలం ప్రార్థన చేసేసి. మనం మన బాధ్యతను నిర్వర్తించామని తలంచరాదు.

# 4. ప్రభువు రాత్రి భోజనము

## (The Lord's Supper)

ప్రతి క్రైస్తవునికి ప్రభువు రాత్రి భోజనము ఆరాధనలో ప్రాముఖ్య భాగమై యున్నది. దీనిని గూర్చి మత్తయి 26:26-28, లూకా 22:14-20 మరియు I కొరింథీ 11:23-34లో ముఖ్యముగా చదువగలము. ప్రభువు రాత్రి భోజనమును గూర్చి పలు భావములున్నాయి. 1. అది కృతజ్ఞత నిచ్చునది. యేసు ప్రభువు రాత్రి భోజనమును ప్రతిష్ఠించినప్పుడు ఆయన కృతజ్ఞత చెల్లించారు. యేసు క్రీస్తు మన కొరకు చేసిన గొప్ప త్యాగమును బట్టి మనం కృతజ్ఞత కలిగి యుండాలి.. 2. అదొక స్మారకము. ఒకస్మారక చిహ్నమును వీక్షించగానే దాని వెనుక యున్న చరిత్ర మనకు జ్ఞాపకము వస్తాది. ప్రభువు రాత్రి భోజనము మన తలంపులను క్రీస్తు సిలువ యొద్దకు నడిపిస్తాది. I కొరింథీ 11:25 లో ప్రభువును జ్ఞాపకముంచు కొనవలెనని చెప్పబడినది. 3. మనము ప్రభువు యొక్క మరణమును ప్రచురించుదుము. “మీరు ఈ రొట్టెను తిని యీ పాత్రలోనిది త్రాగునప్పుడెల్లా ప్రభువు వచ్చు వరకు ఆయన మరణమును ప్రచురము చేయుదురు” (I కొరింథీ 11:26).

గనుక ఒక విధముగా ప్రభువు రాత్రి భోజనము ప్రచురము చేయునట్టిది. మనం ప్రభురాత్రి భోజనములో పాలు పొందుట యితరులు చూచినప్పుడు, మనం ప్రభువు చిందించిన రక్తములోను,

నలుగగొట్ట బడిన ఆయన శరీరములోను, అనగా ఆయన యందున్న పరిపూర్ణ విశ్వాసమును ప్రచురింతుము. 4. మనం ఒండొరులతో సహవాసము కలిగియుందుము. I కొరింథీ 10:16-17ను గమనించుము. "మనము దీవించు ఆశీర్వచనపు పాత్రలోని త్రాగుట క్రీస్తు రక్తములో పాలు పుచ్చుకొనుటయే గదా? మనము విరుచు రొట్టెను తినుట క్రీస్తు శరీరములో పాలుపుచ్చుకొనుటయే గదా? మనమందరము ఆయొక్కటే రొట్టెలో పాలుపుచ్చు కొనుచున్నాము, రొట్టె ఒక్కటే గనుక అనేకులమైన మనము ఒక్కటే శరీరమై యున్నాము. పాలుపుచ్చుకొనుట సహవాసము. విగ్రహముల ఆలయములలో తినుట దయ్యములతో సహవాసమని పౌలు చెప్పాడు. అదే రీతిగా ప్రభువు బల్లలో పాలుపుచ్చుకొనునప్పుడు మనము ప్రభువుతోను, క్రైస్తవులతోను సహవాసము కల్గియుందుము. క్రీస్తుతో యున్న సహవాసమును బట్టి మన ఐక్యతను చాటుదుము.

## ప్రభువు రాత్రి భోజనము లోని సంగతులు, దాని భావము

ప్రభురాత్రి భోజనములో యున్నవి సూక్ష్మమైనవి. స్మారకములను మానవులు చిరకాలముండునట్లు గ్రానైట్‌తోను, బంగారముతోను మొదలగు వాటితో తయారు చేయుదురు. దేవుడైతే తన స్మారకమును సింపుల్‌గా రొట్టె ద్రాక్షారసములతో తయారు చేసారు. ఈ పదార్థములకు మన హృదయములు భావమును చేకూరుస్తాయి. యేసు పులియని రొట్టెను వినియోగించారు (లూకా 22:1, 8-9). పస్కాపండుగలో

యూదులు పులియని రొట్టెను వినియోగించాలని ఆజ్ఞాపింపబడిరి. గనుక యేసు అట్టి దానినే తీసికొని దానికి నూతన భావము చేకూర్చారు. ఇప్పుడది యేసు యొక్క భౌతిక శరీరమునకు గురుతుగా యున్నది. అది సిలువపై మనకొరకు నలుగగొట్ట బడిన శరీరము, యేసు ద్రాక్ష పండ్ల రసమును తీసికొని అది ఆయన రక్తమునకు గురుతుగా యిచ్చారు. అనేకుల కొరకు ఆయన చిందించిన పవిత్ర రక్తమునకు గురుతుగా ద్రాక్షారసమున్నది.

ఆయన రొట్టెను పట్టుకొని "యిది నా శరీరము" అని చెప్పారు (మత్తయి 26:28). ద్రాక్షారసమును గూర్చి "యిది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని ఆయన చెప్పారు (మత్తయి 26:28). దీనిని గమనించిన తరువాత ప్రార్థించిన తరువాత రొట్టె ద్రాక్షారసములు నిజముగా యేసు యొక్క శరీర, రక్తములుగా మారునని తప్పుగా తలంచుదురు. అవి యిది వరకెట్లున్నవో ప్రార్థించిన తరువాత కూడా ఒకే లాగున కనబడ్తాయి, ఒకే లాగున రుచి కలిగి యుంటాయి. వాటిలో భౌతికంగా మార్పేమీ సంభవింపదు. గాని వాటి ఆత్మీయ భావము వేరు. యేసు యొక్క మాటల భావము అది, అవి ఆయన శరీరమునకు, రక్తముకు గురుతుగా యున్నవని యేసు సూక్ష్మముగా చెప్పారు. "నేనే ద్వారమును" అని యేసు యోహాను 1:9లో చెప్పారు. ఆయన నిజముగా ఒక ద్వారము అయ్యున్నానని ఆయన ఉద్దేశ్యము కాదు. గాని ఆత్మీయముగా ఆయన పరలోకమునకు పోవు ద్వారమై యున్నారు. రెండు వచనముల

తరువాత "నేను గొర్రెల మంచి కాపరిని" యని చెప్పారు. యేసు ఎన్నడు నిజముగా గొర్రెలు కాయు వాడు కాదు. ఆయన ఎన్నడు భౌతికంగా గొర్రెలు కాయరు. గాని ఆత్మీయముగా ఆయన ఆత్మల ప్రధాన కాపరి (I పేతురు 5:4). యేసు ఒక ద్వారమును, గొర్రెల కాపరియునై యున్నారు. అదే రీతిగా ప్రభురాత్రి భోజనములోని సింపుల్ మూలికలు మనకు ఆయన శరీరమును, రక్తమును గురుతుకు తెచ్చు జ్ఞాపికలై యున్నవి.

I కొరింథీ 11:24-25లో ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి ప్రభువు రాత్రి భోజనమును ప్రతిష్టించిన సందర్భమును పౌలు కొరింథీయులకు జ్ఞాపకము చేసాడు. "నన్ను జ్ఞాపకము చేసి కొనుటకై దీనిని చేయుడని" యేసు తన శిష్యులకు చెప్పారు. యేసే ప్రభువు రాత్రి భోజనమును ప్రతిష్ఠించారు గనుక అది ప్రాముఖ్యమైనది. అనేక సంవత్సరముల తరువాత ప్రభువు జ్ఞాపకార్థమై దానిని సంఘము ప్రతిష్టించలేదు. అది సంఘము యొక్క సంస్కారము కాదు. దానిని క్రీస్తే ప్రతిష్టించారు. నమ్మకమైన క్రైస్తవులు సంఘారంభమునుండి దీనిలో పాల్గొను చున్నారు. క్రీస్తుయొక్క బలియాగమును జ్ఞాపకముంచుకొను నిమిత్తము నిజక్రైస్తవులు దానిలో పాల్గొందురు. అయితే దానిని ఒక దుఃఖ భరితమైన సమయముగా మనంపాటించరాదు. అయినను I కొరింథీ 10:16లో అది "ఆశీర్వచనపు పాత్ర" యని చెప్పబడినది. మనకై యేసు యొక్క మరణం

గొప్ప విషాదము కాదు గాని అదొక గొప్ప ఆశీర్వాదము, మనం ఎన్నడు అందుకొన లేనట్టి గొప్ప జీవమై యున్నది.

## ప్రభురాత్రి భోజనములో ఎప్పుడు పాల్గొనాలి?

సంఘములు ప్రభురాత్రి భోజనములో పాల్గొను వేర్వేరు సమయములున్నవి. కొందరు నెల కొకసారి, మరికొందరు మూడు నెలలకొకసారి లేదా ఏదో ఒక ప్రత్యేక పండుగనాడు దానినాచరిస్తారు. మరి కొందరైతే వారానికొకసారి దానిని ఆచరిస్తారు. మనం ఎన్నిసార్లు పాల్గొన వలెనో చెప్పే బైబిలు ఆజ్ఞ యేదీ లేదని కొందరు వాదిస్తారు. మనం ఎంత కాలానికి ఒకసారి దాని నాచరించాలో చెప్పే ఆజ్ఞ లేదనునది వాస్తవమే. అయితే అట్టిదేదీ లేనప్పుడు జీవిత కాలంలో ఒక్కసారి దానిలో పాల్గొంటే సరిపోవును గదా.

ఆదిమ సంఘము యొక్క ఉదాహరణ అయితే శిష్యులు ప్రతి ఆది వారమున రొట్టె విరుచుటకు కూడుకొనిరి యని తెలియుచున్నది. వారు ముఖ్యముగా ప్రభురాత్రి భోజనము నాచరించుటకు కూడుకొనిరి యని తెలియుచున్నది. “ఆది వారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్ళనైయుండి వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడు చుండెను” (అపొ.కా. 20:7). ఆదిమ క్రీస్తు సంఘము రొట్టె విరుచుటకు ఆదివారమున కూడు కొనినట్లు ఇక్కడ చూడగలము. రొట్టె విరుచుట అనగా ప్రభురాత్రి భోజనములో పాల్గొనుట. ఆదిమ లేఖకులను బట్టి మొదటి క్రైస్తవులు

ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనము నాచరించినట్లు గ్రహించగలము. I కొరింథీ 11:20 ని బట్టి కొరింథులో యున్న సంఘము ప్రభురాత్రి భోజనము నాచరించుటకు ప్రతి ఆదివారమున కూడుకొనినట్లు తెలిసికొనగలము. వారు కూడు కొనవలసిన సమయము వారములో మొదటి దినము (I కొరింథీ 16:2). మనము ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొందుము. ప్రతి ఆదివారమున రొట్టె విరుచుటకు కూడ కొందుము.

దానిని అంత ఎక్కువ సార్లు ఆచరించుట వలన దాని భావము కోల్పోవునని కొందరు వాదించుదురు. సరిగదా అదొక ఆచారకర్మ యగునని వారందరు. అది సాధ్యమే. అయితే మిగతా అన్ని విషయములలో కూడ అది సాధ్యమే. అయితే అప్పుడప్పుడు మాత్రమే మనం ఆరాధించాలని ఎవరు వాదించరు. 1కొరింథీ 11:28-29లో పౌలు ఇట్లు హెచ్చరించాడు: “కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించు కొనవలెను. ఆలాగు చేసి ఆ రొట్టెను తిని ఆ పాత్రలోనిది త్రాగవలెను; ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు”. ఈ వచనములను తరుచు అపార్థము చేసికొంటారు. వారు దానిలో పాల్గొనుటకు యోగ్యులో కాదో యని ప్రతి ఆదివారము కొందరు ఆలోచించు కొంటారు. మనం యోగ్యులమో అయోగ్యులమోయని అక్కడ చెప్పబడలేదు. గాని మనం యోగ్యముగా ఆచరించు చున్నామో లేదో యని అది చెప్పుచున్నది. మనం తప్పకుండా ఆయన శరీరమును రక్తమును జ్ఞాపకముంచు

కొనుచున్నామో లేదా యని మనం పరీక్షించుకోవాలి. యిది తీవ్రమైన సంగతి. ఏలయనగా దానిని అనాలోచితముగా ఆచరించితే మనకు మనమే శిక్షా విధి కలిగజేసుకొందుమని పౌలు చెప్పుచున్నాడు. సరిగ్గా చేయకపోతే మనం దీవెనను పోగొట్టుకొందుము. పాపము చేసిన వారమవుదుము.

## ఎవరు పాల్గొనాలి?

"క్రైస్తవేతరులు దీనిలో పాల్గొనవచ్చునా?" యని కొందరు ప్రశ్నిస్తారు. యిది క్రీస్తుతోను, దేవుని తోను యుండు సహవాసమని మనం జ్ఞాపకముంచు కోవాలి. దీనిని ఆచరించునప్పుడు యేసుకూడా ఆయన రాజ్యమైన సంఘములో మనతో పాల్గొందురు. ఆయన సంఘమే ఆయన శరీరము, ఆయన రాజ్యము గనుక యిది ఆయన రాజ్య సభ్యులైన వారికి దాచి యుంచబడిన ఆశీర్వాదము. ఎవరు పాల్గొనాలో ఎవరు పాల్గొన రాదోయని కొందరు సహోదరులు షరతులు విధిస్తారు. అట్లుచేయుటలో తమ్మును తాము తీర్పరులుగా చేసికొందురు. గాని మనం తీర్పు తీర్చరాదు. ఒక వ్యక్తి యొక్క హృదయమెట్లున్నదో మనమెరుగము. అది ప్రభువు రాత్రి భోజనము, ఎవరిదోకాదు. అదొక సహవాసము, ఎవరైనను క్రీస్తుతో సహవాసము లేకుండిన యెడల అతడు నశించిన వాడవుతాడు. గనుక క్రీస్తు యొక్క సహవాసములో లేడు. ఒకడు చేయునదంతయు ఒక రొట్టె ముక్కను తిని, కొంచెం ద్రాక్షారసమును రుచి చూస్తాడు. అతడు

రక్షింపబడినవాడు కాదు గనుక ప్రభువు రాత్రి భోజనము పాల్గొని నందున రక్షింపబడి పోడు. ప్రభువు రాత్రి భోజనములో పాల్గొనునప్పుడు మన మనస్సును, హృదయమును క్రీస్తు సిలువపై కేంద్రీకరించాలి. ఇతరులపై కాదు.

# 5. పాటలు పాడుట
## (Singing)

ఆరాధనలో చేయు ప్రతి క్రియ క్రైస్తవునికి ఆనందదాయకముగా యుండాలి. అయినను అన్నిటి కంటె ఆరాధనలో పాటలు పాడుట మరింత ఆహ్లాదకరముగా యుండును. చాలాసార్లు మనుష్యులు తమలో తాము పాటలు పాడుకొందురు. లేదా గీతాలాపన చేయుదురు. ఒక్కోసారి వినబడు రీతిగను, మరింకొకసారి నిశ్శబ్ధముగను కూనరాగాలు చేయుదురు. క్రైస్తవారాధనలో పాటలు పాడుట ఒక ప్రాముఖ్యమైన భాగమైయున్నది. అయినను దానిని గూర్చిన గందరగోళము ఇంతా అంతా కాదు. గనుక నీ మనస్సును తెరచి, బైబిలు ద్వారా దేవుడు నీతో మాట్లాడనిమ్ము.

కీర్తనలు పాడుటను గూర్చిన ముఖ్య బైబిలు వచనములు రెండున్నవి. అవి ఎఫెసీ 5:19; మరియు కొలస్స 3:16. అవి రెండు ఇంచుమించు ఒకేలాగున్నవి. "ఒకనినొకడు కీర్తనలతోను సంగీములతోను ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి" (ఎఫెసీ 5:19). "సంగీతములతోను కీర్తనలతోను ఆత్మ సంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు కృపాసహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుచు సమస్త విధములైన జ్ఞాపకముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింప నియ్యుడి.

మరియు మాట చేతగాని క్రియ చేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరిట చేయుడి" (కొలస్స 3:16-17).

## పాటలుపాడు ఉద్దేశ్యము

పాటలు లేక కీర్తనలు పాడుట ఒక విధమైన బోధచేయుటయే. మనము పాడే పాటలలోని మాటల ద్వారా మనం ఒకరి కొకరము బోధించు కొందుము. మాటలే బోధిస్తాయి. గనుక ఆ మాటలు విశదముగా యున్నట్లు చూచుకోవాలి. అవి గ్రాహ్యమయ్యే టట్లుండాలి. అవి లేఖనముల ప్రకారముండాలి. ఒక అబద్ధ బోధను పాటల ద్వారా ప్రబోధించుట జరుగరాదు. కొన్ని సూత్రములు గాన రూపముగా యుంటే వాటిని సులభముగా గుర్తుంచుకొనగలము. చిన్న పిల్లలకు పాటల ద్వారా బోధించుట చాలా సులభము. వారు సులభముగా, సర్దాగా నేర్చుకొందురు. గనుక పాటల ద్వారా బోధించుట ఉత్కృష్టము, మాటలు మాత్రమే ఉపదేశిస్తాయి. హెచ్చరిస్తాయి గనుక రాగము అంత ప్రాముఖ్యము కాదు. మనము ఆత్మీయ పాటలను పాడాలి. అంతేగాని మనకు నచ్చిన సరదా పాటలు పాడరాదు. కీర్తనలకు, పాటలకు, ఆత్మ సంబంధమైన పద్యములకు ఉన్న తేడా యేమిటని ప్రజలు తరుచు అడుగుదురు. వీటి మధ్యనున్న వ్యత్యాసమును ఖచ్చితంగా మనం చెప్పలేము. ఈ పదములు ఒకదానికొకటి తరుచు వాడబడుచున్నవి గనుక వాటి వ్యత్యాసమును గూర్చి పెద్దగా ఆలోచించనక్కరలేదు.

మనము ఒకరికొకరము బోధించుకొందుము. గనుక ఆరాధనలో ఒకరిపై నొకరు ఆధారపడియుందుము. తత్ఫలితముగా ఒండొరులకు క్షేమాభివృద్ధి కలుగును. పాటలకంటె ప్రోత్సహించునది మరొకటియుండదు. వాటిలో యున్న ఆత్మీయ తలంపులు హెచ్చరించును. మనం ఒకరికొకరము బోధించుకోవాలి గనుక యిది ఒక ప్రాముఖ్యమైన బైబిలు పద్ధతి. సంఘ మంతయు పాటలుపాడుట ద్వారా హెచ్చరిక చేయబడును. సంఘములో కొంతమందేగాక, సంఘమంతయు పాటలు కలిసిపాడవలెను. సంఘమంతయు ఏకముగా కలసి చేయుపని పాటలు పాడుట ఒక్కటే.

## ఆరాధన ఆత్మీయ యాగము

“కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒకప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము” (హెబ్రీ 13:15). యిది పాత నిబంధనలోని బల్యర్పణ పద్ధతిని సూచించుచున్నది. మరియు పాత నిబంధనలోని భౌతిక బలుల పద్ధతికి బదులు పాటలు పాడుట ఒక ఆత్మీయ బలియాగమని చెప్పబడినది. మన పాటలలో దేవుడు చేసిన గొప్ప మేలులకు ఆయనను స్తుతించుదుము, ఆయన చేసిన మేలులకు కృతజ్ఞత చెల్లింతుము. గనుక పాటల ద్వారా దేవునితో సంభాషించు చున్నామని మరొకసారి జ్ఞాపకముంచు కొందుము. ఆరాధనలో మన తత్వమంతయు, మన ఆత్మ, హృదయము, మనస్సు, పెదవులు అన్నీ ఇమిడియున్నవి. ఎఫెసీ 5:19లో మన హృదయములో ప్రభువును

గూర్చి పాడుచు కీర్తించుడి యని చెప్పబడినది. మనం పాటలు పాడునప్పుడు మన మనస్సు, హృదయము కూడ మనం పాడే పాటలతో సమన్వయించి యుండాలి. లేని యెడల మన కీర్తనలు ఒక ఆచారకర్మగా తయారగును. నిష్ప్రయోజనమైన ఆచార కర్మలతో దేవుడు ఎన్నడు సంతోషించడు.

పాటలు సంఘము యొక్క ఐక్యతను చాటును : రోమా 15:6 లో క్రైస్తవులు ఏకభావము గలవారై ఏకగ్రీవముగా తండ్రియైన దేవుని మహిమ పరచాలని చెప్పబడినది. సంఘము యొక్క ఐక్యతను ఉద్ఘాటించు అనేక లేఖన భాగములున్నాయి. పాటలు కలసిపాడుట ద్వారా మన మధ్య ఉండవలసిన ఐక్యత సాధ్యమగును. అందువలన సంఘము ఐక్యముగా యుండని యెడల వారు చేయు ఆరాధన గొప్పగా దెబ్బతినును. క్రైస్తవులు ఏకముగా కూడి పాడుటకంటే ప్రోత్సాహకరమైన విషయం మరొకటి యుండదు.

## దేవుడు అనుమతి నిచ్చారు.

ఆరాధనలో మనము చేయు క్రియలకు అనుమతి యున్నదా యని అనేకులు అపార్థము చేసికొంటారు. రెండు విధములైన ఆజ్ఞలున్నవి. సాధారణ ఆజ్ఞలు ప్రత్యేక ఆజ్ఞలు అనునవి. ఏదైనా ఒక సంగతిని గూర్చి చెప్పబడినను అదెట్లు చేయాలో చెప్పకయుంటే అది సాధారణ ఆజ్ఞయగును. అది అట్లుండగా ప్రత్యేక ఆజ్ఞయైతే ఒకపని ఎట్లు చేయబడాలో చెప్పును. కొన్ని సాధారణ ఉదాహరణలను

గమనించుము. సర్వలోకమునకు సువార్త ప్రకటించుడియని దేవుడు మనల నాజ్ఞాపించారు. అది సాధారణ ఆజ్ఞ ఏలయనగా ఏలాగు వెళ్ళాలో ఆయన మనకు చెప్పలేదు. చితిసారకపు మ్రానుతో ఓడను తయారు చేయుమని దేవుడు నోవహుకు చెప్పారు. అది ప్రత్యేకమైన ఆజ్ఞ ఏలయనగా అతడు చితిసారకపు మ్రానునే వాడవలెను. వేరే యితర మ్రానులను అతడు ఉపయోగించకూడదు. సంగీతము అనునది అన్ని రకాల సంగీతమును సూచించును. అది సాధారణ పదము. సంగీతమును వాడండి అని దేవుడు చెప్పిన యెడల ఏరకమైన సంగీతమునైనను క్రైస్తవులు ఆరాధనలో వాడవచ్చును. అయితే దేవుడు పాటలు, కీర్తనలు అని ప్రత్యేకంగా చెప్పారు. అది మిగతా అన్ని రకాల సంగీతమును బహిష్కరిస్తాది. గనుక వాద్య సంగీతము బహిష్కరింపబడ్డాది. ఏవిధమైన వాద్య సంగీతము వాడరాదని దేవుడు చెప్పకపోయినను ఆయన గాత్ర సంగీతమును కోరగానే వాద్య సంగీతము బహిష్కరింప బడినది.

## వాద్యముల చరిత్ర

మత శాఖల సంఘముల వారనేకులు వాద్య సంగీతమును తమ పాటలతో ఉపయోగిస్తారు. అదెంత ప్రబలమై పోయిందంటే దానిని ప్రశ్నించేవారెవరు లేరు. అయితే సంఘారంభమునుండి అట్లులేదు. గాని గత కొద్ది శతాబ్దములనుండి వాద్య సంగీతమును ఉపయోగించుట పరిపాటియై పోయినది. దాని నెవ్వరు ప్రశ్నింపరు కూడ. ఆరాధనలో మనము పాటలు మాత్రమే పాడాలని చెప్పబడినది.

క్రొత్త నిబంధన ఆరాధనలో వాద్యములనుపయోగించుటను గూర్చి కూడా చెప్పబడలేదు. సంగీతము రెండు రకములు : గాత్రము, జంత్రము. ఆరాధన ఆత్మతో యుండాలిగనుక గాన సంగీతముకు ప్రాధాన్యత యున్నది. అయితే వాద్య సంగీతము యొక్క ప్రాధాన్యత భౌతికముగా యుండును. పౌలు మన హృదయం అనే పరికరాన్ని వాడాలని హెచ్చరించాడు.

కొలస్స 3:17లో సమస్తము ప్రభువైన యేసునామమున చేయబడాలని హెచ్చరింపబడిది. అంటే ఆయన అధికారము చొప్పున చేయబడాలి. ఆయన అనుమతించని వాద్యములనుపయోగిస్తు ఆయన అధికారము చొప్పున ఎట్లు పాటలు పాడగలము? వాద్యములను గూర్చి లేఖనములయితే సంపూర్తిగ మౌనియైయున్నవి. వాటిని ఖండించలేదు గనుక వాద్యోపకరణ సబబేయని అనేకులు చెబుతారు. అయితే లేఖనములు మౌనంగా యుంటే వాద్యములకు అనుమతించినట్లు కాదు.

హెబ్రీ పత్రికలో దీని విషయమై మనము రెండు ఉదాహరణలు చూడగలము. హెబ్రీ 1:4-5 లో దేవదూతలకంటే క్రీస్తు శ్రేష్టుడై యున్నారని లేఖకుడు తెలియజేయుచున్నాడు. అట్లు చెప్పుచు “నీవు నా కుమారుడవు నేను నేడు నిన్ను కనియున్నానని” ఆయన దూతలతో ఎవనితో నైనను చెప్పెనా? యని అడిగారు. చెప్పలేదు అనునది జవాబు. గనుక క్రీస్తు దూతలకంటే శ్రేష్టుడు. హెబ్రీ 7:13-14లో

యాజకుడు మారుట అవస్యమని లేఖకుడు నిరూపించుటకు ప్రయత్నించాడు. యేసు ఆయాజకుడగు నిమిత్తము ఒక క్రొత్త ధర్మశాస్త్రము అమలులోనికి రావలసియున్నది. ఏలయనగా పాతనిబంధనలో యూదా గోత్రము నుండి వచ్చు యాజకుని గూర్చి ఎన్నడు చెప్పలేదు. సరిగదా యాజకులందరు లేవీ గోత్రమునుండియే వత్తురని అది చెప్పినది. లేవీ గోత్రమని చెప్పబడి యున్నది గనుక అది మిగతా గోత్రములన్నిటిని బహిష్కరించుచున్నది. గనుక మోషే ధర్మశాస్త్ర ప్రకారము క్రీస్తు ప్రధాన యాజకుడు కాజాలడు ఏలయనగా ఆయన లేవీ గోత్రీకుడు కాదు. అదే విధముగా పాటలు పాడుట అధికారికంగా ఆమోదించబడినందున మిగతా రకముల సంగీతము బహిష్కరింపబడినది.

క్రైస్తవ్యము యొక్క చరిత్ర అంతటిలోను వాద్యము వ్యతిరేకించ బడినది. సంఘ తండ్రులు ఆరాధనలో వాద్యములనుపయోగించుటను మొదటినుండి ఎదురాడుచునే యున్నారు. క్రైస్తవారాధనలో ఆర్గను అను వాద్యము 7వ శతాబ్ధములో మొదట ప్రవేశ పెట్టబడెను. యూదులు తమ ఆలయ ఆరాధనలో వాద్యములనుపయోగించిరి. గ్రీకులు తమ విగ్రహారాధనలో వాటిని ఉపయోగించిరి. గనుక ఆదిమ క్రైస్తవులు వాద్యోపకరణమును గూర్చి ఎరిగియే యుందురు. అయినను ఆదిమ సంఘము వాద్యముల నెన్నడు ఆరాధనలో వినియోగించలేదని చరిత్రకారులందరు చెప్పుదురు.

అంతే కాకుండ ఆయా మతశాఖలను స్థాపించిన నాయకులు సయితము వాద్య సంగీతమును వ్యతిరేకించిరి. వారిలో కొందరి మాటలు గమనించుము:

మార్టిన్ లూథర్ : "ఆరాధనలో ఆర్గన్ అను వాద్యము బయలు దేవతా ప్రభావమైయ్యున్నది".

జాన్ కేల్విన్ : "ఆరాధనలో వాద్యము సాంబ్రాణి పొగలవలెను, మైనపు వత్తులను వెలిగించుట వలెను, పాత ధర్మ శాస్త్ర ఛాయలను పునరుద్ధరించుట వలెను యున్నది. దీనిని రోమన్ కేథలిక్కులు యూదులనుండి ఎరువు తెచ్చుకొన్నారు".

జాన్‌వెస్లీ : "మన గుడులలో ఆర్గన్ ఉండి అదికనబడకను, వినబడకను యున్న యెడల నాకు అభ్యంతరము లేదు".

జాన్‌నాక్స్ : "ఆర్గన్ అను వాద్యము ఒక ఈలల పెట్టె".

క్రొత్త నిబంధన సంఘమును పునరుద్ధరించుట మన ధ్యేయము. ఆదిమ క్రీస్తు సంఘము ఆరాధనలో ఎన్నడు వాద్యములను ఉపయోగించలేదు. దానిని తీవ్రముగా వ్యతిరేకించినది. గనుక ఎవడైనను నిజక్రైస్తవుడై యుండగోరిన యెడల ఆరాధనలో వాద్య సంగీతమునెన్నడు వినియోగించడు, దానిని ప్రోత్సహించడు.

# కానుకలిచ్చుట
## (Giving)

కానుకలిచ్చుట క్రైస్తవుని యొక్క ముఖ్య బాధ్యత మరియు ఆశీర్వాదము. యేసుక్రీస్తు సిలువపై మన కొరకు మరణించుట అన్నిటికంటే ప్రాముఖ్యమైన యీవి (కానుక)యై యున్నది. మార్కు 12:41-44లో ఇచ్చుటలో యున్న గొప్ప మాదిరిని మనము చూడగలము. దేవాలయపు కానుకల పెట్టెలో ప్రజలు కానుకలు వేయుట యేసు గమనించు చుండెను. ఒక బీద విధవరాలు వచ్చి దానిలో రెండు కాసులు వేసెను. అది ఆ రోజుల్లో యున్న నాణెములలో అత్యల్పమైనది. ఈ రోజులలో దాని విలువ యేమీ వుండదు. అయినను ఆ బీద విధవరాలు అందరి కంటె ఎక్కువ యిచ్చెనని యేసు చెప్పెను. ఏలయనగా వారందరు తమకు కలిగిన సమృద్ధిలోనుండి వేసిరి గాని యీామె తన లేమిలో తనకు కలిగిన దంతయు అనగా తన జీవనమంతయు వేసెనని ఆయన చెప్పెను.

## ఇచ్చుటలో ఉద్దేశ్యము

మనం ఎందు నిమిత్తము ఇచ్చుచున్నామో దేవునికి ముఖ్యము. మొదటిగా కాని ఉద్దేశ్యముతో ఇచ్చు వారిని గమనించుదాము. అది మన బాధ్యత యని గాక, పేరు కొరకు, గొప్ప కొరకు మనుష్యులచే పొగిడించుకొనుటకు ఇయ్యరాదు. ఏదైనా వ్యక్తిగతంగా చేయవలసి వచ్చినప్పుడు కొంచెం డబ్బు ఇచ్చేస్తే సరిపోదు. దేవుని సేవించుటకు మనకు బదులుగా ఇంకొకరిని కూలికి పెట్టుకోలేము.

క్రైస్తవుడు విశ్వాసము వలన, ప్రేమ వలన, భక్తి వలన దేవునికిస్తాడు. ఇచ్చుట ద్వారా దేవుని యెడల మన ప్రేమను వెల్లడి పరుస్తాము. మనము ఇచ్చుచు ఎదుగుదుము. మనం ఉదారముగా ఇచ్చుకొలది దేవుని స్వభావములో పాలి భాగస్థులమవుదుము. ఇచ్చుట ద్వారా దేవుడు మనలను దీవించుటకు మార్గము సుమమగును. చివరిగా క్రీస్తు రాజ్యమైన సంఘము అభివృద్ధి చెందు నిమిత్తము మనము యిత్తుము. సంఘము యొక్క అనేక అవుసరముల కొరకు ధనము అవుసరము. దేవుని బిడ్డలు ఆయన పనిని ఆర్థికంగా ప్రోత్సహించవలెననునది దేవుని యొక్క సంకల్పము.

## I కొరింథీ 16:1-2

"పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగు చేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతి వాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" అని అపో.పౌలు వ్రాసాడు.

ఈ లేఖన భాగములో కొంత సొమ్ము నిలువ చేయవలెననే ఆజ్ఞ యున్నది. సంఘము కూడియున్నప్పుడు, ఆదివారమున ఆ చందా పోగుచేయువలెనని చెప్పబడినందున అది సంఘమునకిచ్చిన చందాయని మనము గ్రహించవలెను. ఆ పోగు చేయబడడం ఇంటి వద్దనే అయితే అది ఎప్పుడైన జరిగించవచ్చును. గాని యిది సంఘము ఆదివారమున కూడి యున్నప్పుడు జరిగించవలెను.

యిది ప్రతి వ్యక్తికి ఈయబడిన ఆజ్ఞ. ప్రతివాడు దీనిలో పాలుపొందవలెను. ధనికులు, పెద్దవారే కాదు అందరు ఇయ్యాలి.

మనము నిలువ చేయవలెను. యిది డబ్బు మాత్రమేయని మనం తలుస్తాము గాని మనకున్నది ఏదైనా నిలువ చేయవచ్చును. తన యొద్ద యున్నది కొంచెము మాత్రమే గనుక ఇయ్యనక్కరలేదని తలంచరాదు. డబ్బు మాత్రమే ఇయ్యాలని బైబిలు ఎన్నడు చెప్పలేదు.

మనము అభివృద్ధి జెందిన కొలది ఇయ్యాలి. మనం ఇంత ఇయ్యాలని దేవుడు వ్యక్తపరచలేదు. యూదులు దశమభాగము నియ్యవలెనని ఆజ్ఞాపింపబడిరి. అయినను వారర్పించే అనేక బలులను కూడ పరిగణిస్తే వారు దశమభాగము కంటే ఎక్కువే యిచ్చారు. అయితే మనకున్నది వారికంటే శ్రేష్టమైన నిబంధన, శ్రేష్టమైన రక్షకుడు గనుక మనం వారి కంటే తక్కువ ఎందుకియ్యాలి? ఇక్కడ ముఖ్యమైనదేమంటే ఇతరులతో మనం పోల్చుకోరాదు. ఇచ్చుట వ్యక్తిగతమైనది. గనుక యితరులతో మనం పోల్చుకొనుచు ఇయ్యరాదు.

తదుపరి వారు చందాను పోగు చేయవలెను. పౌలు వారి యొద్దకు వచ్చినప్పుడు గాక ప్రతి ఆదివారమున వారు చందా నీయవలెను. పౌలు కొరింథు సంఘముకు వచ్చుసరికి వారు చందాను పోగు చేసియుండవలెను. అనగా ఏదైనా అవుసరం వచ్చు సరికి ధనము సిద్ధపాటు చేయబడి యుండును గాని అవుసరం వచ్చిన తరువాత దానిని సిద్ధపరచుట కాదు.

## 2 కొరింథీ 9:5-7

"కావున లోగడ ఇచ్చెదమని మీరు చెప్పిన ధర్మము పిసినితనముగా ఇయ్యక ధారాళముగా ఇయ్యవలెనని చెప్పి సహోదరులు మీ యొద్దకు ముందుగా వచ్చి దానిని జమ చేయుటకై వారిని హెచ్చరించుట అవసరమని తలంచితిని. కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంట కోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయునని యీ విషయమై చెప్పవచ్చును" (2 కొరింథీ 9:5-7).

మనం ఇష్టపూర్వకంగా, ఉత్సాహముగా ఇయ్యాలి. మనం బలవంతముగా ఇస్తే దేవుడు హర్షించరు. ప్రేమపూర్వక భావముతో మనం ఇయ్యాలి. ఇచ్చుట భారమని తలంచరాదు. కొన్ని సంఘములు తమ సభ్యులకు ఇచ్చుటకు బలవంతము చేతురు. వారు ఇంత యిస్తామని ప్రమాణము చేయించుకొందురు. నెల అయ్యేసరికి ఆ సొమ్ము నిమిత్తము ఒక బిల్లును వారికి పంపుదురు. అందువలన ఇచ్చుట ఉత్సాహముగా జరుగదు. అది వారికి కష్టతరముగా యుండును.

## మనం హృదయంలో నిశ్చయించుకొనిన కొలది ఇయ్యాలి

అనగా మనం ఇచ్చుటకు ముందే ఆలోచించుకొని ఎంత ఇయ్యవలెనో నిశ్చయించుకోవాలి. అన్నిటికంటే ముందుగా దేవునికి ఎంత ఇయ్యాలో నిశ్చయించుకోవాలి. తదుపరి మిగత సంగతులను గూర్చి ఆలోచించాలి. మన ఆదాయంలో ముందు దేవునికిచ్చుటకు నిశ్చయించుకొని మిగిలిన సొమ్మును గూర్చి తదుపరి ఆలోచించాలి.

ఈ లేఖనం మనలను ఇచ్చుటకు ప్రోత్సహించును. దేవుని కిచ్చుట మనం భారమని తలంచరాదు, ఏలయనగా దేవుడు మనం ఇచ్చిన దాని కంటే ఎక్కువ యిచ్చెదనని వాగ్దానం చేసారు. దుర్లాభాపేక్ష వలన మనం ఇయ్యరాదు. దేవునికిస్తే ఆయన ఎక్కువ యిస్తారనే దురాశతో మనం ఇయ్యరాదు. మనం యిచ్చుచుండగా దేవుడు దీవిస్తానని వాగ్ధానం చేసారు. టి.వి.లో మాట్లాడు బోధకులు ఈ లేఖన భాగమును దుర్వినియోగం చేయుచు డబ్బు దండుకొన యత్నించుదురు. ప్రేక్షకులు వారికి కొంత డబ్బును Seed (విత్తన) మనీగా పంపితే వారి అవుసరములన్నీ తీరేటంత డబ్బు దేవుడు వారికిస్తాడని వారు చెబుతారు. యిది కేవలం లేఖన విరుద్ధము; దురాశను రేకెత్తించు భావమును వారు కలుగజేయుదురు. మనం మంచి పనులు చేయుటకు దేవుడు సహాయము చేయునని 2 కొరింథీ 9:8-10 చెప్పుచున్నది.

## మనం యిచ్చు మొత్తము ముఖ్యము కాదు


"మొదట ఒకదు సిద్ధమైన మనస్సు కలిగి యుంటే శక్తికి మించి కాదుగాని కలిమి కొలదియే యిచ్చినది ప్రీతికరమగును" (2 కొరిథీ 8-12). ఇంకొక మాటలో మనం యిచ్చే కానుక యొక్క మొత్తమును ఆయన చూడరు. గనుకనే మన కానులను యితరులతో పోల్చుకోరాదు. ఒకని సామర్థ్యమును దేవుడు పరిగణిస్తాడు. దానిని దేవుడు మాత్రమే నిశ్చయించగలరు.

## ఇచ్చుట వలన కలగు ఫలితములు

మొదటిగా సంఘము యొక్క అవుసరములు తీరును. సంఘావుసరముల నిమిత్తము డబ్బు కొరకు రకరకాల కార్యక్రమములు, వ్యాపారములు జరిగించాలని లేఖనములు చెప్పుట లేదు. సభ్యులు డబ్బు ఇయ్యాలని తరుచు వారికి విన్నవించుట తగదు. టి.వి. బోధకులు పదే పదే డబ్బు కొరకు విజ్ఞాపనలుచేస్తారు. అది తగదు. సంఘము యొక్క పని సంఘ సభ్యులు చేత భరింపబడాలి.

ఇచ్చుట వలన కృతజ్ఞత పెరుగును, దేవునికి మహిమ కలుగును. సంఘము యొక్క పరిచర్యలు సంపూర్తి యగుటను యితరులు చూచునప్పుడు, అది మన పనియొక్క నిదర్శనమగును. దేవుని ఆజ్ఞకు మనం లోబడు చున్నందున దేవుడు మహిమ పరచబడును. “మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింప నియ్యుడి” యని అందుకే యేసుప్రభువు చెప్పారు (మత్తయి 5:16).

ఇచ్చుట వలన సంఘము, మనము కూడ అభివృద్ధి జెందుదుము. మనం ఇయ్యగలిగినంత సొమ్ము యిస్తే సంఘము తలపెట్టిన పనులు నిర్వర్తించగలుగును. తద్వారా యితరులు కూడా క్రీస్తులోనికి మార్చబడుదురు. అనేక ప్రాంతములకు సువార్త వెదజల్లబడును. ఏ పనిచేయని సంఘములో ఉండుటకు ఎవ్వరు ఇష్టపడరు. సంఘము పని చేయుట చూచుచుండగా దేవుడు మహిమ పరచబడును. సత్క్రియలు జరిగించు సంఘములో సభ్యులుగా యుండుటకు అనేకులు ఆసక్తి చూపుదురు.



# III

# బైబిలు నిబంధనలు

1. బైబిలు నిబంధనలు
2. మోషే ధర్మశాస్త్రము
3. క్రీస్తు యొక్క ధర్మశాస్త్రము
4. క్రొత్త నిబంధన యొక్క శ్రేష్టత
5. ఇద్దరు స్త్రీలు - రెండు నిబంధనలు
6. క్రొత్త నిబంధనను అన్వయించుకొనుట

# 1. బైబిలు నిబంధనలు

## (Biblical Covenants)

ఈ అంశము చాల ప్రాముఖ్యము, అయినను తరుచు నిర్లక్ష్యము చేయబడునట్టిది. క్రైస్తవలోకంలో యున్న వివిధ నమ్మకములకు కారణం నిబంధనలను అపార్థము చేసికొనుట వలన కలిగెను. బైబిలు అంతయు దేవుని వాక్యము గనుక దాని కంతటికీ మనం విధేయత చూపాలని అనేకులు తలంతురు. గాని నిజానికి ఎవడును దానికంతటికినీ విధేయత చూపుటకు ప్రయత్నించడు. పాత నిబంధనలో వివిధ జంతు బలులు ఆజ్ఞాపింపబడెను. అయినను దేవుని ఆరాధనలో నేడు జంతు బలుల నర్పించుటకు ఎవడును ప్రయత్నించడు. గనుక బైబిలు నిబంధనల అంశమును మనము క్షుణ్ణంగా తెలిసికొనాలి.

### నిబంధన అనగా నేమి?

మొదటిగా నిబంధన యేమిటో మనం తెలిసికొనాలి. సింపుల్‌గా చెప్పాలంటే అదొక ఒడంబడిక. రెండు పక్షముల మధ్య ఏర్పడిన ఒడంబడిక అది. ఆ నిబంధనను అంతము వరకు నెరవేర్చడానికి ఇరుపక్షములవారికి వివిధ బాధ్యతలుంటాయి. పూర్వకాలములో రెండు రకములైన నిబంధనలుండేవి. ఒకటి రెండు సమాన పక్షముల మధ్య కుదిరిన ఒడంబడిక, ఇద్దరు సమ ఉజ్జీల మధ్య కలిగిన ఒప్పందము. వారు తర్జనభర్జన చేసి, బేరసారాలు జరిపించి చివరకు ఇద్దరు ఒప్పుకొని అంగీకారము తెలియజేయుదురు. యిది సాధారణంగా దేశముల మధ్య జరిగే ఒడంబడిక.

రెండవది ఒక బలమైన పక్షము బలహీన పక్షముతో కుదుర్చుకొనిన ఒప్పందము. యుద్ధములో విజయము సాధించిన వారు ఓడిపోయిన వారితో చేసికొనే ఒడంబడిక. అందులో బలమైనవారు ఓడిపోయిన వారి నుండి కొన్ని షరతులు కోరుదురు, కొన్ని సంగతులలో వారు రాజీపడవలెను. విజయం సాధించిన వారు కొన్ని వాగ్దానములు చేతురు. బలహీనులు వాటికి లోబడాలి. లేదా దాని పర్యవసానముల నెదుర్కొనాలి. దేవుడు మానవులతో చేసిన నిబంధనలు ఇట్టివే. దేవునితో బేరసారములాడుటకు మానవునికి ఎవ్విధమైన హక్కు కూడ లేదు. యేమీ కోరుకోడానికి హక్కు లేదు. ఏలయనగా ఆయన సృష్టికర్త.

ఈ నిబంధనలు సాధారణంగా ఒట్టుపెట్టుకొనుట ద్వారా అమలు లోనికి వచ్చును. మరియు సాక్షుల యెదుట ఈ నిబంధనలుజరుగును. దాని జ్ఞాపకార్థము ఏదో కటి ప్రతిష్టించుట ద్వారా యిట్టి నిబంధనలు అమలు చేయబడును. లేదా ఒకరికొకరు బహుమతుల నిచ్చుకొనుట జరుగును. ఈ నిబంధనల తీవ్ర ప్రాముఖ్యతను యిది తెలియజేయును. నిబంధన చేయబడిన తరువాత తీవ్రపరిణామములు లేకుండా అది ఉల్లంఘించబడదు. నిబంధన యొక్క ప్రాముఖ్యతను గలతీ 3:15లో పౌలు ఇట్లు చెప్పాడు: "సహోదరులారా, మనుష్య రీతిగా మాట్లాడుచున్నాను; మనుష్యుడు చేసిన ఒడంబడికయైనను స్థిరపడిన తరువాత ఎవడును దానిని కొట్టివేయడు, దానితో మరేమియు కలుపడు".

మనుష్యులు చేసిన ఒడంబడికయే అంత పట్టు కలిగియున్న యెడల దేవునితో చేయబడిన ఒడంబడిక మరి ఎంత బలము కలగి

యుంటాది? ఈ నిబంధన ఎవరితో చేయబడెనో వారికే అది వర్తించునని తెలిసికొనుట ముఖ్యము. ఒక మనుష్యునితో నేను ఏదైనా ఒప్పందము చేసికొంటే అది అతనికిని నాకును మధ్య మాత్రమే యుండును. అది మరొకని కెవనికిని వర్తింపదు. బైబిలు నిబంధనల విషయములో కూడా అదే సూత్రము వర్తించును. తదుపరి పాఠములలో ఈ ప్రాముఖ్య సంగతిని జ్ఞాపకముంచుకొనుట అత్యవసరము.

## దేవుడు చేసిన వేర్వేరు నిబంధనలు

ఇంతకు ముందే చెప్పుకొన్నట్లుగా దేవుడు వివిధ మనుష్యులతో వివిధములైన నిబంధనలు చేసారు. మొదటి నిబంధన ఆయన ఆదాముతో చేసారు. దేవుడొక వనమును సృష్టించి ఆదామును హవ్వను అందులో యుంచారు. వారికి కావలసిన సమస్తమును దేవుడిచ్చారు. అది భూమిపై పరదైసువంటిదే. వారు నిత్యము జీవించెదరని దేవుడు వాగ్దానము చేసారు. గాని ఒక షరతు విధించారు. వారు మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలమును మాత్రము తినరాదు. అయితే ఆదాము హవ్వలు నిషేధింపబడిన ఫలమును తిన్నారు. నిబంధన నుల్లంఘించారు. ఆ వనమునుండి తోలివేయబడ్డారు. తత్ఫలితముగా పాపము చేసినవారయ్యారు.

రెండవది దేవుడు నోవహుతో నిబంధన చేసారు. ఈ లోకము నంతటిని జలప్రళయముతో మరెన్నడు నాశనము చేయనని దేవుడు వాగ్దానము చేసారు. ఆ నిబంధనకు గురుతుగా ఆయన ఆకాశము మేఘములో తన (ఇంద్ర) ధనస్సు నుంచారు. (ఆది. కా 9:9-17). నోవహు ఫలించి అభివృద్ధి పొంది భూమిని నిండించాలని

ఆ నిబంధనలో భాగమై యుండెను (ఆది.కా. 8:17). దేవుడు మరొక నిబంధనను దావీదుతో చేసారు. 2 సమూయేలు 7వ అధ్యాయములో దేవుడు దావీదుకు ఇట్లు వాగ్దానము చేసారు. "నీ దినములు సంపూర్ణములగునప్పుడు నీవు నీ పితరులతో కూడ నిద్రించిన తరువాత నీ గర్భములో నుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి, రాజ్యమును అతనికి స్థిరపరచెదను... నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును, నీ సంహాసనము నిత్యము స్థిరపరచబడుననెను" (2 సమూ 7:12,16). దేవుడు చేసిన ఈ వాగ్దానమును దావీదు నిబంధన యని చెప్పియున్నాడు (2 సమూ 23:5). మరల కీర్తన 132:12లో ఈ నిబంధనను గూర్చి చెప్పబడినది. "నీ కుమారులు నా నిబంధనను గైకొనిన యెడల నేను వారికి బోధించు నా శాసనమును వారు అనుసరించిన యెడల వారి కుమారులు కూడ నీ సింహాసనము మీద కూర్చుందురని యెహోవా సత్య ప్రమాణము దావీదుతో చేసెను" (కీర్తన 132:11-12). దావీదు యొక్క వారసుడు అతని సింహాసనముపై నిత్యము వుండునని దేవుడు ఇక్కడ చెప్పుట చూడగలము.

దేవుడు అబ్రాహాముతో కూడ నిబంధన చేసెను. దీనిని గూర్చి ముఖ్యముగా ఆది కాండము 12:1-3లో చదువగలము. "అబ్రాహాము తొంబది తొమ్మిది యేండ్ల వాడైనప్పుడు యెహోవా అతనికి ప్రత్యక్షమై నేను సర్వశక్తిగల దేవుడను, నా సన్నిధిలో నడుచుచు నిందా రహితుడవైయుండుము. నాకును నీకును మధ్య నా నిబంధనను నియమించి నన్ను అత్యధికముగా అభివృద్ధి పొందించెదనని అతనితో

చెప్పెను” (ఆది. కా. 17:1–3). మరల 12:1–3లో “యెహోవా నీవు లేచి నీ దేశము నుండియు నీ బంధువుల యొద్ద నుండియు లేచి నీ దేశము నుండియు నీ బంధువుల యొద్ద నుండియు నీ తండ్రి యింటి నుండియు బయలు దేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము. నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును; నీవు ఆశీర్వాదముగా యుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను. నిన్ను దూషించినవానిని శపించెదను. భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదింపబడుననెను”.

అబ్రాహాము పక్షమున ఈ దేవుని నిబంధనలో నాలుగు ముఖ్య వాగ్దానము లున్నవి. అబ్రాహాము ఒక గొప్ప జనాంగముకు తండ్రియగును. ఈ జనాంగము నివసించుటకు ఒక దేశముండును. అతని నాశీర్వదించుటకు దేవుడు వాగ్దానము చేసెను. మరియు అబ్రాహాము ద్వారా ఈ లోకములోని జనాంగములన్నియు ఆశీర్వదించబడును. ఈ ఆఖరి వాగ్దానము ఆత్మీయమైనది. దానిముందున్న మూడు భౌతికమైన దీవెనలు. ఈ ఆత్మీయ వాగ్దానము పరోక్షముగా యేసు క్రీస్తును గూర్చి ఉద్దేశించినది. ఆయన వచ్చి ఈ లోకము నంతటికి పాపములనుండి రక్షణను గ్రహించును. అది ఇశ్రాయేలీయులకే, అబ్రాహాము సంతతికే కాదు గాని ప్రజలందరికీ.

తరువాత అబ్రాహాము సంతతివారు ఐగుప్తులోని బానిసత్వమును వీడిన తరువాత, దేవుడు వారిని సీనాయి కొండకు నడిపించి, వారితో మోషే ద్వారా ఒక నిబంధనను చేసెను.

"మోషే దేవుని యొద్దకు ఎక్కిపోవగా యెహోవా ఆ పర్వతము నుండి అతని పిలిచి - నీవు యాకోబు కుటుంబీకులతో ముచ్చటించి ఇశ్రాయేలీయులకు తెలుపవలసిన దేమనగా - నేను ఐగుప్తీయులకు ఏమి చేసితినో, మిమ్మును గద్ద రెక్కల మీద మోసి నా యొద్దకు మిమ్ము నెట్లు చేర్చుకొంటినో మీరు చూచితిరి. కాగా నా మాట శ్రద్ధగా విని నా నిబంధనను సరించి నడిచిన యెడల మీరు సమస్త దేశములలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్త భూమియు నాదేగదా. మీరు నాకు యాజక రూపమైన రాజ్యము గాను పరిశుద్ధమైన జనము గాను ఉందురని చెప్పుము; నీవు ఇశ్రాయేలీయులతో పలుక వలసిన మాటలు ఇవే" యని చెప్పెను (నిర్గమ 19:3-6). ఈ నిబంధనలో పది యాజ్ఞలు కూడ ఇమిడియున్నవి. "అతడు నలుబది రేయింబవళు ౣ యెహోవాతో కూడ అక్కడ ఉండెను. అతడు భోజనము చేయలేదు, నీళ్ళు త్రాగలేదు. అంతలో ఆయన ఆ నిబంధన వాక్యములను అనగా పడి ఆజ్ఞలను ఆ పలక మీద వ్రాసెను" (నిర్గమ 34:28).

దేవుడు తన ఆఖరి నిబంధనను మానవులందరితో చేసారు. అది యేసు క్రీస్తు సిలువపై మరణించగా స్థాపించబడెను. ఈ ఆఖరి నిబంధనను గూర్చి ఈ పాఠములలో ముఖ్యముగా నేర్చుకొన బోవుచున్నాము. ఈ నిబంధనలను అర్ధము చేసి కొనుటలో ఉద్భవించిన గందరగోళము క్రైస్తవ లోకములో యున్న అనేక డినామినేషన్లకు, చీలికలకు హేతువాయెను. వచ్చే పాఠములలో ఈ రెండు నిబంధనలను మరింత విపులముగా తెలిసికొందము.

# ౨. మోషే ధర్మశాస్త్రము

## (The Law of Moses)

ఇశ్రాయేలీయులు సీనాయి కొండయొద్ద బసచేసినప్పుడు వారికి మోషే ధర్మశాస్త్రము అనుగ్రహించబడెను. “కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధననుసరించి నడిచిన యెడల మీరు సమస్త దేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్త భూమియు నాదే గదా. మీరు నాకు యాజక రూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురు అని చెప్పుము. నీవు ఇశ్రాయేలీయులతో పలుకవలసినమాటలు ఇవే'' (నిర్గమ 19:5-6). దేవుడు ఇశ్రాయేలీయులకు ప్రత్యేక వాగ్దానములు చేసినట్లు గమనించుము. ఇశ్రాయేలీయులు దేవుని మాటలు విని లోబడిన యెడల వారాయనకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్త జనాంగములలోను వారు దేవుని యొక్క ప్రజలై యుందురు. అనగా వారు దేవుని ఆశీర్వాదముల ననుభవింతురు. ప్రజలందరు ఆ నిబంధనను సంతోషముతో అంగీకరించిరి. “అందుకు ప్రజలందరు యెహోవా చెప్పినదంతయు చేసెదమని యేకముగా ఉత్తరమిచ్చిరి” (నిర్గమ 19:8). ఈ నిబంధనను ఇశ్రాయేలు ప్రజలు సంతోషముతో అంగీకరించినను, వారు ఆ నిబంధనను తరుచు భంగపరచుచు వచ్చినట్లు వారి చరిత్ర చెప్పుచున్నది.

ఇశ్రాయేలీయులు ఈ ధర్మశాస్త్రమును పొందినప్పుడొక క్రొత్త జనాంగమయ్యారు. ప్రతి దేశమునకు చట్టములు అవుసరము. ఆ

చట్టముల ప్రకారం వారు జీవించాలి. మోషే ద్వారా ఈయబడిన ధర్మశాస్త్రములో భౌతిక చట్టములు, ఆత్మీయ చట్టములు ఇమిడియుండెను. ఇంకొక మాటలో ఆ ధర్మశాస్త్రములో వారు దేవుని ఆరాధించు నియమములు, వారి ఒండొరుల మధ్య యుండవలసిన నియమములు యుండెను. ఈ చట్టములలో పది యాజ్ఞలుండెను. మరియు అనేక నియమములుండెను. మరియు యాజకులకు నియమములు, వివిధ బలులు, అవి అర్పించు విధానము మొదలగునవి అందు ఉండెను. ఈ ధర్మశాస్త్రము యూదులకు మాత్రమే ఇయ్యబడెను. అన్యులకు ఇయ్యబడలేదు.

మోషే ధర్మశాస్త్రము నిత్యము అమలులో యుండాలని దేవుడు ఎన్నడు తలంచలేదు. దీనిని మనం గుర్తుంచుకోవాలి. యిర్మియా ప్రవక్త ద్వారా దేవుడు "ఇదిగో నేను ఇశ్రాయేలీయుల వారితోను యూదా వారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి" యని చెప్పారు (యిర్మియా 31:31). ఒక క్రొత్త నిబంధన లేక ఒడంబడిక చేయబడినప్పుడు, పాత ఒడంబడిక లేక నిబంధన నిర్వీర్యమగును. ఈ క్రొత్త నిబంధన పాత నిబంధనకు కలుపబడలేదు. అది పాత నిబంధనను తొలగించి దాని స్థానములో యుండుట కీయబడెను. ఈ క్రొత్త నిబంధన క్రీస్తు యొక్క చట్టము; ఆయన సిలువపై మరణించినప్పుడది ప్రతిష్టించబడెను.

## ధర్మశాస్త్రము యొక్క ప్రయోజనము

మోషే ధర్మశాస్త్రము యొక్క ప్రయోజనమును కొద్ది నిమిషముల

మట్టుకు ఆలోచింతము. దేవుడు మొదట్లోనే మానవులందరకు ప్రయోజనకరమగు ధర్మశాస్త్రము నెందుకు ఇయ్యలేదని కొందరు ప్రశ్నిస్తారు. మొదట ఒక ధర్మశాస్త్రమునిచ్చి తదుపరి దాని స్థానమున ఇంకొకటి ఎందుకు ఇయ్యాలి?

పాపముయొక్క తీవ్రతను తెలియజేయుట ధర్మశాస్త్రము యొక్క ప్రయోజనమై యుండెను. పాపము యొక్క తీవ్రతను స్వల్పము చేయుట మానవుని నైజము. మన చుట్టూ పాపము నిండి యున్నందున అది అంత తీవ్రమైనది కాదని తలంచుదుము. మరీ ముఖ్యముగా అందరు "చిన్న చిన్న" పాపములలో యున్నవారే గనుక పాపము అంత ప్రమాదకరమనిపించదు. అయితే పరిశుద్ధుడైన దేవుడు పాపముతో ఎవ్విధముగను సహవసింపరు, సరిగదా సహించరు. అందువలన "నీ కనుదృష్టి దుష్టత్వము చూడలేనంత నిష్కళంకమైనది" యని హబక్కూకు చెప్పాడు (హబక్కు 1:13). గనుక పాపమును, దాని తీవ్రతను తెలియజేయుట ధర్మశాస్త్రము యొక్క ప్రయోజనమైయున్నది. "ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు; ధర్మశాస్త్రము వలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది" యని అపో.పౌలు వ్రాసాడు (రోమా 3:20). మరల "ధర్మశాస్త్రము వలననే గాని పాపమనగా ఎట్టిదో నాకు తెలియకపోవును" అని అతడు చెప్పాడు (రోమా 7:7).

మనుష్యులను క్రీస్తు నొద్దకు నడిపించుటకు ధర్మశాస్త్రము యొక్క మరియొక ప్రయోజనమై యుండెను. ఒక ప్రజలను, ఒక జనాంగమును

క్రీస్తు రాక కొరకు సిద్ధపరచుటకు అది ప్రయోజనకారి యాయెను. యేసుక్రీస్తు ద్వారా ప్రజలందరు పాపములనుండి రక్షింపబడుదురు. "కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడి యాయెను గనుక ఇక బాల శిఓకుని క్రింద ఉండము" (గలతీ 3:24-25). బాలశిక్షకుడు ప్రాధమిక విద్యను నేర్పుతాడు. ప్రాథమిక విద్య అయిన తరువాత వారు ఉన్నత విద్యనభ్యసించుదురు. బాల శిక్షకుని పాత్ర అంతటితో అంతమగును. అతని పాత్ర కేవలము తాత్కాలికమే. అట్లే పాత నిబంధన కూడా క్రీస్తు నొద్దకు నడిపించుట దాని పాత్ర ఆయెను. క్రీస్తు రాగానే దాని పాత్ర అంతమాయెను. అందువలన "క్రీస్తు ధర్మ శాస్త్రమునకు సమాప్తియై యున్నాడని" అపొ.పౌలు రోమా 10:4లో చెప్పెను. విశ్వాసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియైయున్నాడు.

చివరిగా ధర్మశాస్త్రము రాబోవు మేలుల ఛాయగా యుండుటకు ఈయబడెను. హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక ఈ విషయమును చక్కగా విశ్లేషించు చున్నది. "ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయగలదియే గాని ఆ వస్తువుల నిజ స్వరూపముగలది కాదు గనుక ఆ యాజకులు ఏటేట ఎడతెగకుండ అర్పించు ఒక్కటే విధమైన బలులు వాటిని తెచ్చువారికి ఎన్నడును సంపూర్ణ సిద్ధ కలుగ జేయనేరవు" (హెబ్రీ 10:1). ఒక చెట్టు యొక్క నీడ వంటిది ఛాయ. అది నిజ స్వరూపము యొక్క నీడను కాంతిహీనముగా చూపించును. గనుక

ధర్మశాస్త్రము ఒక పరిపూర్ణ బలియాగము నిమిత్తము మనుష్యులకు ప్రాథమిక బోధన చేసెను. మన పాపముల నిమిత్తము యేసుక్రీస్తు చేయు పరిపూర్ణ బలియాగము నిమిత్తము ప్రజలను ధర్మశాస్త్రము సిద్ధపరచెను. పాత నిబంధనలో యున్న యాజకులు పరలోక యదార్థతకు ఒక నకలుగా లేక ఛాయగా పనిచేసారు.

మానవుడు క్రీస్తును అంగీకరింపజేయుటకు ధర్మశాస్త్రము నియమింపబడెను. ఆయన రాకను దాని భావమును గ్రహించు కొనుటకును, మనకు రక్షకుడెందుకు అవుసరమో తెలియజేయుటకును పాత నిబంధన ఉపయోగపడెను. తదుపరి పాఠములో యేసుక్రీస్తు ద్వారా దేవుడు మానవునితో చేసిన నిబంధనను గూర్చి తెలిసికొందము.

# 3. క్రీస్తు ధర్మశాస్త్రము
## (The Law of Christ)

పాత నిబంధన కొంక ప్రయోజనమున్నదని, ఆ ప్రయోజనము నెరవేరినప్పుడు అది అదృశ్యమాయెనని మనం నేర్చుకొన్నాము. “ధర్మశాస్త్రము నైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియు గతించిపోయి ననేగాని ధర్మశాస్త్ర మంతయు నెరవేరు వరకు దాని నుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను” అని యేసు చెప్పెను (మత్తయి 5:17-18).

యేసుక్రీస్తు ధర్మశాస్త్రమును నెరవేర్చుటకే వచ్చెనుగాని దానిని తొలగించుటకు రాలేదని కొందరు చెప్పుదురు. అయితే ఏదైనా ఒకటి దాని ప్రయోజనమును నెరవేర్చితే దానినింకా ఉంచుకో వలసినపని యేమున్నది? యేసు చెప్పిన దానిని గమనించుము. ఆయన ధర్మశాస్త్రమును నెరవేర్చుటకు వచ్చారు. అది అంతయు నెరవేరు వరకు దానిలో యేమీ కొట్టివేయబడదని చెప్పారు. అనగా అది నెరవేరిపోయిన తరువాత అది తొలగిపోవును. గనుక యేసుచెప్పిన దేమంటే ఒకసారి ఆయన దానిని పూర్తిగా నెరవేర్చిన తరువాత, అనగా సిలువకు మేకులతో కొట్టివేయబడిన తరువాత, అది గతించిపోవును. అందుకే యేసుప్రాణము విడువక ముందు “సమస్తమును సమాప్త మాయెను” అని బిగ్గరగా పలికారు (యోహాను 19:30). యేసు చేయడానికి వచ్చిన పని అంతయు సమాప్తి చేసారు. ధర్మశాస్త్రాన్ని నెరవేర్చారు,

మానవ పాప పరిహార బలి అర్పించారు. క్రొత్త నిబంధనను, శ్రేష్టమైన నిబంధనను  అనుగ్రహించారు.

అయితే మనకు క్రొత్త నిబంధన యున్నందున పాత నిబంధన నిష్ప్రయోజనమైనదని తలంచరాదు. దాని ద్వారా మనము ఇంకను పాఠములను, హెచ్చరికలను పొందుచునే యుందుము. "ఏలయనగా ఓర్పువలనను, లేఖనముల వలని ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి" యని అపొ.పౌలు చెప్పాడు (రోమా 15:4). పాత నిబంధన దేవుని గూర్చి, సృష్టిని గూర్చి, క్రీస్తును గూర్చి, పాపమును గూర్చి, దాని విరుగుడును గూర్చి మొదలగు అనేక పాఠములను మనకు బోధించుచున్నది. యిదివరలో అది యూదులకు ఎట్లు బోధించెనో ఇప్పుడు మనకును అది బోధించుచున్నది. పాత నిబంధన లేకుండా మనము క్రొత్త నిబంధనలో అనేక సంగతులు గ్రహించుకోలేము. గనుక నేటికిని అది మనకు ప్రయోజనకరమైన పాఠ్యపుస్తకమై యున్నది గాని ఒక చట్టముగా అది మన మీద ఏలుబడి చేయదు. మనం దేవునికి చేయు సేవలో, ఆరాధనలో ఏమేమి చేయాలో తెలియ జెప్పుటకు దానికి అధికారము లేదు. మనము పాత చట్టము క్రింద ఇకమీదట జీవించుట లేదు ఏలయనగా అది పాత నిబంధనలో ఒక  భాగమైయుండెను.

యేసుక్రీస్తు ఒక శ్రేష్టమైన క్రొత్త నిబంధన నిచ్చుటకు వచ్చెను. ఆయన సిలువపై మరణించినప్పుడు ఆ పాత నిబంధన సిలువకు మేకులతో కొట్టబడెను (కొలస్స 2:14). అదే సమయములో ఆయన

క్రొత్త నిబంధనను ప్రతిష్టించెను. ఏలయనగా “మరణశాసన మెక్కడ ఉండునో అక్కడ మరణ శాసనము వ్రాసిన వాని మరణము అవశ్యము. ఆ శాసనమును వ్రాసిన వాడు మరణము పొందితేనే అది చెల్లును; అది వ్రాసినవాడు జీవించుచుండగా అది ఎప్పుడైనను చెల్లునా? ఇందుచేత మొదటి నిబంధన కూడ రక్తము లేకుండ ప్రతిష్టింపబడలేదు (హెబ్రీ 9:16-18). క్రీస్తు యొక్క మరణము యొక్క ఆవశ్యకతను తెలియజేయుటకు లేఖకుడు ఈ ఉదాహరణను చూపియున్నాడు. మనుష్యులు సాధారణముగా వీలునామా (మరణ శాసనము) వ్రాయుదురు. వారి తదనంతరము వారి ఆస్థి ఎట్లు విభజింప బడవలెనో అందులో వ్రాయుదురు. అయినను ఆ వీలునామా వ్రాసిన వాడు మరణిస్తేనే అది అమలులోనికి వచ్చును. అతడు బ్రతికియుండగా మొదట వ్రాసిన వీలునామాను ఎన్నడయినను మార్చుకొనవచ్చును. అదే విధముగా క్రీస్తు యొక్క క్రొత్త నిబంధన ఆయన మరణించే వరకు అమలులోనికి రాలేదు. ఆయన క్రొత్త నిబంధనను ప్రతిష్టించుటకు తన రక్తమును చిందించారు. మోషే ధర్మశాస్త్రము జంతువుల రక్తముచే ప్రతిష్టింపబడితే క్రీస్తు యొక్క క్రొత్త నిబంధన తన స్వరక్తముతోనే ప్రతిష్టింపబడెను. గనుక పాత నిబంధనకు బదులుగా క్రొత్త నిబంధన యేసు సిలువ యొద్ద ప్రతిష్టింపబడెను. గనుక ఆయన శ్రేష్టమైన క్రొత్త నిబంధనకు పూట కాపాయెను (హెబ్రీ 7:22).

క్రొత్త నిబంధన పాత నిబంధనకు కలుపబడలేదు. అది దానికి బదులుగా ఈయబడెను. క్రొత్త నిబంధన అనగానే పాత నిబంధన

తొలగించబడెనను భావము కలుగును. "ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుట చేత మొదటిది పాతదిగా చేసి యున్నాడు. ఏది పాత గిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా యున్నది" (హెబ్రీ 8:13). ఆయన "ఆ రెండవ దానిని స్థిర పరచుటకు మొదటి దానిని కొట్టివేయుచున్నాడు" (హెబ్రీ 10:9).

రెండు నిబంధనలకు ఒకే సమయమందు మనము బద్ధులపై యుండలేము. గత పాఠంలో నేర్చుకొనినట్లు మనం ఇప్పుడు విశ్వాసము ద్వారా క్రీస్తులో యున్నాము, బాలశిక్షకుని క్రింద ఇకమీదటలేము; అది పాత నిబంధన (గలతీ 3:25). అంతేగాక మనము పాత ధర్మశాస్త్రము క్రిందకు పోలేము; పాత దానిని క్రొత్తదానితో కలుపలేము. "మీలో ధర్మ శాస్త్రము వలన నీతి మంతులని తీర్చబడు వారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరు చేయబడి యున్నారు. కృపలో నుండి తొలగిపోయి యున్నారని" పౌలు చెప్పాడు (గలతీ 5:4). మనము కృప ద్వారా నీతి మంతులముగా తీర్చబడుచున్నాము (ఎఫెసీ 2:8), అయినను మనము పాత నిబంధనను పాటించగోరుచున్న యెడల కృపలోనుండి తొలగిపోయి యున్నాము. మరియు మనం రక్షింపబడే ఒకే ఒక్క మార్గమును కోల్పోవుదుము.

ఈ క్రొత్త నిబంధన మరింత మహిమ గలది. దాని యీవులు పాత నిబంధన కంటే ఎంతో శ్రేష్టమైనవి. మోషేకు ఆ పాత నిబంధన ఇయ్యబడినప్పుడు ఎంత మహిమ గలదై యుండెనంటే ఇశ్రాయేలీయులు ప్రకాశించుచున్న మోషే ముఖమును సయితము చూడలేకపోయిరి (2 కొరింథీ 3:7). అయినను ఆ మహిమ తగ్గి

పోవునదై యుండెను (2 కొరింథీ 3:8). "తగ్గిపోవునదే మహిమ గలదై యుండిన యెడల నిలుచునది మరి యెక్కువ మహిమ గలదై యుండునుగదా" (2 కొరింథీ 3:11). ఈ సందర్భములో తగ్గిపోవునది రాతి మీద వ్రాయబడిన పరిచర్యయై యుండెను; దానిలో పది యాజ్ఞలు భాగమైయుండెను. అపో. పౌలు ఇంకా ఇట్లు చెప్పాడు. "ఆయన మన సమాధానమైయుండి మీకును మాకును ఉండిన ద్వేషమును అనగా విధి రూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును తన శరీరమందు కొట్టివేయుట చేత మధ్యగోడను పడగొట్టి మన ఉభయులను ఏకము చేసెను. ఇట్లు సంధి చేయుచు ఈ యిద్దరిని ఒక్క నూతన పురుషునిగా సృష్టించి తన సిలువ వలన ఆ ద్వేషమును సంహరించి దాని ద్వారా వీరిద్దరిని తన యందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి తన సిలువ వలన ఆ ద్వేషమును సంహరించి దాని ద్వారా వీరిద్దరిని ఏక శరీరముగా చేసెను" (ఎఫెసీ 3:14-16). ఈ రెండు లేఖన భాగములలోను పది యాజ్ఞలతో కూడిన పాత నిబంధన ఎత్తి వేయబడెనని మనకు విపులీకరించ బడినదని గమనించుము.

లోపభూయిష్టమైన, పాప పరిహారమునియ్యలేని ధర్మ శాస్త్రమును దేవుడెందుకు యిచ్చారు? నిజానికి ధర్మశాస్త్రము లోపము గలది కాదు. అది ఎందు నిమిత్తము ఈయబడెనో ఆపని అది పూర్తి చేసెను. పాపమును గూర్చిన జ్ఞప్తి తెచ్చుటకును, దాని క్షమాపణ ననుగ్రహించు క్రీస్తునొద్దకు ప్రజలను తెచ్చుటకును అది ఇయ్యబడెను. ఆ పని అది నెరవేర్చెను, ధర్మశాస్త్రములో లోపములేదు. సమస్య అంతా మానవుని

బలహీనతలోను, అతని పాపపు తత్వములోను యుండెను. అతడు ఆ ధర్మశాస్త్రమును పాటించలేక పోయెను.

పాత నిబంధన తొలగించ బడినందున, నేడు ఆత్మీయ విషయాల్లో పాత నిబంధనను బట్టి జరిగించలేము. ఆ అధికారము దానికిలేదు. పది యాజ్ఞలతో సయితము పాత నిబంధనలో ఏ భాగమైనను అమలులో నేడు లేదు. అంటే అనేకులు చేయు మత సంబంధ క్రియలకు, ఆచారములకు దైవానుమతి లేదు. పాత నిబంధనలో యున్నాయి గదా అని చేయు క్రియలు నిష్ప్రయోజనము. వీటిలో యాజక ధర్మము, దశమ భాగము, సబ్బాతు నాచరించుట, వాద్య సంగీతము మొదలగునవి నేడు నిష్ప్రయోజనము. అందువలననే ఎవరును నేడు జంతు బలులు అర్పించరు. పాత నిబంధన ఆచారములను మన యిష్ట ప్రకారము కొన్నింటిని క్రొత్త నిబంధన సంఘములోనికి తేకూడదు. నిజానికి పాత నిబంధనలో ఏ ఆజ్ఞనైనా అనుసరింపగోరితే ఆ యాజ్ఞలన్నింటికి లోబడాలి. ఏలయనగా ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుట యందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్థుడని వ్రాయబడియున్నది (గలతీ 3:10; 5:3). క్రొత్త నిబంధన శ్రేష్టమైనది గనుక పాత నిబంధన నాచరించుటకు తలంచేనే కూడదు. తదుపరి పాఠములో క్రొత్త నిబంధన యొక్క శ్రేష్టతలను గూర్చి నేర్చుకొందము.

# 4. క్రొత్త నిబంధన యొక్క శ్రేష్టత

## (Superiority of the New Testament)

పాత నిబంధన కంటే క్రొత్త నిబంధన పలు విధములుగా శ్రేష్టమైనది. వాటన్నిటిని ఒక పాఠములో చర్చించవీలు పడదు. హెబ్రీ పత్రిక లేఖకుడు ఈ అంశముపై సుదీర్ఘ చర్చను జరిపాడు. గనుక ఆ లేఖకుడు తెలియ జేసిన శ్రేష్టమైన సంగతులను కొన్నింటిని తెలిసికొనుము.

### శ్రేష్టమైన యాజకత్వము

ప్రజల పక్షముగా బలుల నర్పించుటకు పాత నిబంధన ఒక యాజకత్వమును నెల కొల్పెను. ప్రజలు నేరుగా దేవుని సమీపించ వీలులేకుండెను. సరిగదా వారు తమ అర్పణలను, బలులను ఒక యాజకుని యొద్దకు తేగా అతడు వారి తరపున వాటిని దేవునికి అర్పించేవాడు. ఈ యాజకులు లేవీ గోత్రమునుండి ఏర్పరచబడిన వారు మరియు ప్రధాన యాజకుడు అహరోను సంతతినుండి నియమింపబడెను. ఈ యాజకులు సామాన్యులే. వారు తమ బలహీనతలను, పొరబాట్లను కలిగి యుండిరి. అందువలన వారు మానవులే గనుక మిగతా మానవులతో సానుభూతి కలిగి యుండిరి. “తాను కూడా బలహీనత చేత ఆవరింపబడి యున్నందున అతడు ఏమియు తెలియని వారి యెడలను త్రోవ తప్పిన వారి యెడలను తాలిమి చూపగల వాడైయున్నాడు. ఆ హేతువు చేత ప్రజల కొరకేలాగో ఆలాగే తన కొరకును పాపముల నిమిత్తము అర్పణము చేయవలసిన

వాడై యున్నాడు" (హెబ్రీ 5 : 2-3). యాజకుడు మిగతా వారందరి వలె పాపియైన వాడు గనుక మొదట అతడు తనకొరకు బలి అర్పించిన తరువాత, మిగతావారి కొరకును బలి అర్పించబాధ్యుడై యుండెను. క్రొత్త నిబంధనలో అయితే మనకొక శ్రేష్టమైన ప్రధాన యాజకుడైన యేసుక్రీస్తువున్నారు. "ఆకాశ మండలము గుండా వెళ్ళిన దేవుని కుమారుడైన యేసు అనుగొప్ప ప్రధాన యాజకుడు మనకున్నాడు గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము. మన ప్రధాన యాజకుడు మన బలహీనతల యందు మనతో సహానుభవము లేని వాడు కాడుగాని సమస్త విషయములలోను మనవలే శోధింపబడినను ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము'' (హెబ్రీ 4:14-16). మన బలహీనతల విషయంలో మనతో సానుభూతి కలిగిన ప్రధాన యాజకుడు మనకున్నాడు. ఏలయనగా ఆయన మానవుడయ్యారు, మానవుని వలె అన్ని శోధనలు అనుభవించారు. గాని ఆయన ఎన్నడు శోధనకు లొంగి పోలేదు. ఆయన ఎన్నడు పాపము చేయలేదు.

"పవిత్రుడును, నిర్దోషియు, నిష్కల్మషుడును పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడును ఆకాశమండలము కంటె మిక్కిలి హెచ్చయిన వాడునైన యిట్టి ప్రధాన యాజకుడు మనకు సరిపోయినవాడు.. ఈయన ఆ ప్రధాన యాజకులవలె మొదట తన సొంత పాపముల కొరకు తరువాత ప్రజల పాపముల కొరకు దినదినము బలులు అర్పింప వలసిన అవసరము గలవాడు కాడు; తన్నుతాను అర్పించుకొన్నప్పుడు

ఒక్కసారే యీ పని చేసి ముగించెను" (హెబ్రీ 7:26-28). గనుక యేసు యొక్క యాజకత్వము శ్రేష్టమైనది.

## శ్రేష్టమైన వాగ్దానములు

క్రొత్త నిబంధన అంతరంగికమైనది; ఆత్మీయమైనది. "వారి మనస్సులలో నా ధర్మ విధులను ఉంచెదను, వారి హృదయముల మీద వాటిని వ్రాయుదును" (హెబ్రీ 8:10). మొదటి నిబంధన రాతిపలకల మీద వ్రాయబడెను గాని క్రొత్త నిబంధన అయితే మన హృదయముల మీద వ్రాయబడెను. దేవుడు తన వాక్యమును నేరుగా మన హృదయములలోనికి పంపునని దీని ఉద్దేశ్యముకాదు. బోధించుట ద్వారా, పఠించుట ద్వారానే నేటికిని జ్ఞానము కలుగును. "వారందరు దేవుని చేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడియున్నది గనుక తండ్రి వలన విని నేర్చుకొనిన ప్రతివాడును నా యొద్దకు వచ్చును" అని యేసు చెప్పారు (యోహాను 6:45). మనం దేవుని వాక్యాన్ని వినుచూ యుండాలి, నేర్చుకొనుచు యుండాలి అని గమనించుము. అయితే ఇప్పుడా వాక్యము మన హృదయముల మీద వ్రాయబడియున్నది. పాత నిబంధన ప్రకారము ఒకడు భౌతిక జన్మద్వారా దానికి బాధ్యుడయ్యాడు, తరువాత అతడు దేవుని గూర్చి బోధింపబడ్డాడు. ఇప్పుడైతే ఒకడు దేవుని గూర్చి విని నేర్చుకొని హృదయపూర్వకముగా లోబడి, దేవుని రాజ్యసభ్యుడవుతాడు. దేవుని వాక్య సారాంశము అతని హృదయములో నాటబడనంత వరకు అది శక్తిహీనమైన దగును.

ఇప్పుడు మనము దేవునితో సన్నిహిత సంబంధము కలిగి యున్నాము. "నేను వారి దేవుడనై యుందును వారు నా ప్రజలై యుందురు (హెబ్రీ 8:10). ఈ మాట లేమీ క్రొత్తవి కావు. అవి లేవీ 26:12లో కనబడును. అయినను వాటికిప్పుడు ఒక పరిపూర్ణ భావమున్నది. పాత నిబంధన నిజానికి దేవునికి ఆయన ప్రజలకు గొప్ప దూరమును కల్పించినది. దేవాలయములో యున్న అడ్డ తెరయు, యాజకత్వము దీనికి సాదృశ్యము, గాని ఇప్పుడయితే అందరు నేరుగా దేవుని చేరుకోగలరు. క్రైస్తవులందరు, స్త్రీలు పురుషులు, అన్ని జనాంగముల వారు పాత నిబంధన యాజకులతో సమానులు. "ప్రభువు సమీపముగా యున్నాడు" (ఫిలిప్పీ 4:50). "సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాభావము" యేసు క్రీస్తువలన ఇప్పుడు మనము కలిగియున్నాము (ఫిలిప్పీ 4:7).

''వారిలో ఎవడును ప్రభువును తెలిసికొనుడని తన పట్టణస్థునికైనను ఉపదేశము చేయడు. వారిలో చిన్నలు మొదలుకొని పెద్దల వరకు అందరును నన్ను తెలిసికొందురు" (హెబ్రీ 8:11). మనం ఇంతకు ముందే చెప్పుకొన్నట్లు పాత నిబంధనలో ఒకడు శరీరమూలముగా జన్మించును, తదుపరి దేవుని గూర్చి అతనికి బోధింపబడును. అనేకులకు అది కుటుంబాచారము లేదా దేశాచారము. వ్యక్తిగత సమర్పణ యేమీలేదు. అనేకులు దేవుని గూర్చి తెలిసికో లేదు, ఆయన బోధల నంగీకరించలేదు. కొత్త నిబంధనలో దేవుని గూర్చి నేర్చుకొని ఆత్మీయముగా తిరిగి జన్మించిన వారమై ఆ నిబంధనకు బాధ్యుల మవుదుము (యోహాను 3:3-5). క్రొత్త నిబంధన

సమస్త జనులకు, సర్వజనాంగములకు, మానవులందరికీ వర్తించును. పాత నిబంధనయైతే ఇశ్రాయేలు జనాంగమునకే వర్తించెను.

## శ్రేష్టమైన బలియాగము

"నేను వారి దోషముల విషయము దయగలిగి వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొననని ప్రభువు సెలవిచ్చుచున్నాడు" (హెబ్రీ 8:12). పాత నిబంధనలో నిజమైన క్షమాపణ ఎన్నడు లభించలేదు. ఏలయనగా "ఎడ్ల యొక్కయు మేకల యొక్కయు రక్తము పాపములను తీసి వేయుట అసాధ్యము" (హెబ్రీ 10:4). పాత నిబంధనలో అర్పింపబడిన బలుల రక్తము "పాపములను తీసివేయు దేవుని గొర్రెపిల్ల" వైపు సూచించెను (యోహాను 1:29). పాత నిబంధన బలులు పాపములను ఏటేటా జ్ఞప్తికి తెచ్చెను. గాని పాప పరిహారము ఇయ్యకుండెను (హెబ్రీ 10:3). అయితే క్రీస్తులో దేవుడు మన పాపములను ఎన్నడు జ్ఞాపకముంచుకొనడు. యేసుతానే పరిపూర్ణ బలియాగముగా తన్ను తాను అర్పించుకొనెను. "క్రీస్తు కూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడి తన కొరకు కనిపెట్టుకొని యుండు వారి రక్షణ నిమిత్తము పాపము లేకుండ రెండవసారి ప్రత్యక్షమగును" (హెబ్రీ 9:28). "యేసు క్రీస్తుయొక్క శరీరము ఒక్క సారియే అర్పింపబడుట చేత ఆ చిత్తమును బట్టి మనము పరిశుద్ధపరచబడు చున్నాము" (హెబ్రీ 10:10). సర్వకాల సర్వావస్థల యందుండు మానవులందరి నిమిత్తము యేసు పాపపరిహార బలియాయెను. పాత నిబంధనలోని పశుబలుల వలె ఈయన పదేపదే బలి అవ్వ వలసిన పనిలేదు.

## ముగింపు

పాత నిబంధన కంటె క్రొత్త నిబంధన అనేక మేలులను సమకూర్చెను. మనము ఇంకా ఎన్నో చెప్పుకొనవచ్చును. అయితే శ్రేష్ఠమైన నిబంధనకు క్రీస్తు పరిపూర్ణమధ్య వర్తియాయెనని తెలిసి కొనుటకు యివి చాలును. మనలో ప్రతివాడును ఈ నూతన నిబంధనలో సభ్యులమైయుండునట్లు జాగ్రత్త పడవలెను. ఈ నిబంధన సంబంధమును మరి దేని కొరకైననూ ఎన్నడు పోగొట్టుకొనకూడదు. ఈ నూతన నిబంధనలో ప్రవేశించు షరతులు సూక్ష్మమైనవే. యేసు క్రీస్తు నందలి విశ్వాసము పాపముల విషయమైన మారు మనస్సు, క్రీస్తునందలి విశ్వాసము యొక్క ఒప్పుకోలు (రోమా 10:10) మరియు పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము (అపో.కా. 2:36-39), యివి జరిగించగానే ఆయన నీ పాపములు క్షమించి నిన్ను తన రాజ్యమైన సభ్యునిగా చేర్చుకొనును!

## పాత క్రొత్త నిబంధనల తారతమ్యము

| పాత నిబంధన | క్రొత్త నిబంధన |
|---|---|
| మొదటిది హెబ్రీ 10:9 | రెండవది హెబ్రీ 10:9 |
| పాతది హెబ్రీ 8:13 | కొత్తది హెబ్రీ 8:13; 9:15 |
| భూ సంబంధ ప్రధాన యాజకుడు హెబ్రీ 5:1, 7:23 | పరలోకమందున్న ప్రధాన యాజకుడు హెబ్రీ 8:1 |
| లేవీయులే యాజకులు హెబ్రీ 7:11 | యూదా గోత్రపు ప్రధాన యాజకుడు హెబ్రీ 7:13-14 |
| యాజకులు మరణించేవారు. హెబ్రీ 7:23 | నిరంతరము జీవించు ప్రధాన యాజకుడు. హెబ్రీ 7:24 |
| మోషేధర్మ శాస్త్రము మలాకీ 4:4 | క్రీస్తు ఇచ్చిన క్రొత్త నిబంధన యాకోబు 4:12 |
| మధ్యవర్తి మోషే నిర్గమ 20:19 | మధ్యవర్తి యేసు క్రీస్తు హెబ్రీ 9:15; 12:24 |
| బలహీనమైన నిబంధన హెబ్రీ 8:7 | శ్రేష్టమైన నిబంధన హెబ్రీ 8:16 |
| లోపముగలది, తరచు బలులు అర్పించాలి హెబ్రీ 9:9, 10:1-4 | ఒకే ఒక్క పరిపూర్ణ బలి హెబ్రీ 9:12 |

| | |
|---|---|
| జంతువుల రక్తము, హెబ్రీ 10:4 | క్రీస్తు రక్తము హెబ్రీ 9:12 |
| పాపక్షమాపణ లేదు<br>హెబ్రీ 10:4,11 | పాపక్షమాపణ కలదు<br>హెబ్రీ 9:15, అపొ.కా. 13:38 |
| జంతువుల రక్తముచే ప్రతిష్టింపబడెను.<br>హెబ్రీ 9:19 | క్రీస్తు రక్తముచే ప్రతిష్టింపబడెను.<br>హెబ్రీ 9:18-28 |
| పాపముల జ్ఞప్తియుండెను<br>హెబ్రీ 10:1-3 | శుద్ధిచేయబడిన మనస్సాక్షి<br>హెబ్రీ 9:14; 1 పేతురు 3:21 |
| దేవుని యెదుట ధైర్యములేదు | దేవుని యెదుట ధైర్యము<br>హెబ్రీ 10:19 |
| ఒక్క జనాంగమునకే. మలాకీ 4:4 | అన్ని జనాంగములకు<br>మత్తయి 28:19-20 |
| తాత్కాలికము. గలతీ 3:19 | ఆఖరి నిబంధన. గలతీ 1:6-9 |
| భౌతికమైనది. హెబ్రీ 9:10 | ఆత్మీయమైనది. యోహాను 4:23-24 |
| ఛాయ, రూపకములు.<br>హెబ్రీ 9:24, 10:1 | నిజస్వరూపము<br>హెబ్రీ 8:1-5 |
| శారీరక శుద్ధి హెబ్రీ 9:13 | ఆత్మీయ శుద్ధి 1 పేతురు 1:22 |
| మహిమగలది<br>1 కొరింథీ 3:9-10 | అత్యధిక మహిమ గలది<br>1 కొరింథీ 3:9-10 |
| రాతిమీద వ్రాయబడెను | హృదయముల మీద వ్రాయబడెను |

| | |
|---|---|
| 1 కొరింథీ 3:7 | హెబ్రీ 8:10 |
| గతించిన పోయెను<br>2 కొరింథీ 3:11 | నిలిచియున్నది<br>2 కొరి 3:11 |
| ఎత్తివేయబడెను<br>ఎఫెసీ 2:15 | నిత్యముండును<br>యోహాను 12:48 |
| తీసివేయబడెను<br>హెబ్రీ 10:9 | స్థిరపరచబడెను<br>హెబ్రీ 10:9 |
| దాని నుండి విడుదల పొందితిమి.<br>రోమా 7:7 | అందరికీ ఒక్కసారే అప్పగింపబడెను.<br>యూదా: 3 |
| తుడిచి వేయబడెను<br>కొలస్స 2:14 | నిలుచును, స్థిరముగా యుండును.<br>కొలస్స 1:23 |

# 5. ఇద్దరు స్త్రీలు - రెండు ధర్మశాస్త్రములు

## (Two Women and Two Laws)

రెండు నిబందనలను గూర్చి పూర్తిగా వివరించుటకు గాను అపొ. పౌలు గలతీ 4:21-5:1 లో ఇద్దరు స్త్రీలను అనగా శారాను, హాగరును ఉదాహరణగా వినియోగించాడు. నిబంధనల సంబంధమును మనము అర్ధము చేసికొనునట్లు ఈ ఉదాహరణను ఈ పాఠములో మరికొంత పరిశీలింతము.

మొదటిగా మనము సందర్భమును గ్రహించుకోవాలి. గలతీయులకు వ్రాయబడిన పత్రిక ముఖ్యముగా యూదులలోనుండి క్రైస్తవులయిన వారికి వ్రాయబడెను. వారు మరల పాత ఆచారములకు, నిబంధనకు మరలిపోవుటకు యత్నించు చుండిరి. అబ్రాహాము యొక్క సంతతి మేమని యూదులు గర్వించేవారు. అందువలన దేవుని యొక్క వాగ్దానములు, ఆశీర్వాదములు తమవే యనివారు తలంచేవారు. గనుక అబ్రాహాముకు ఇద్దరు కుమారులుండిరని పౌలు వారికి జ్ఞప్తిచేసాడు. ఒకేడేమో వాగ్దాన పుత్రుడయితే రెండవ వాడయితే అతని దాసి యొక్క కుమారుడు. ఒకనికి ఆశీర్వాదము లియ్యబడెను, రెండవ వానికి ఇయ్యబడలేదు. గనుక అబ్రాహాముకు భౌతికంగా జన్మించిన వారమని చెప్పుకొంటే ఆశీర్వాదములు పొందుదుమనే నిర్ధారణ యేమీ లేదు. ఈ ఉదాహరణలో ధర్మశాస్త్రమీయబడిన సీనాయి పర్వతము హాగరుకు గురుతుగా యుంటే, ఆమె కుమారుడైన ఇష్మాయేలు ఇశ్రాయేలు జనాంగముకు గురుతుగా యుండెను. వారికి యెరూషలేము

కేంద్రముగాను, ఆరాధన స్థలముగాను యుండెను. శారా అయితే క్రొత్త నిబంధనకు గురుతుగా యున్నది. అది కల్వరి కొండకు ఇస్సాకుకు గురుతుగా యున్నది. విశ్వాసము ద్వారా క్రీస్తులో యున్న ప్రతివారు ఆ నూతన నిబంధనలో సభ్యులవుదురు.

## జననము

సహజ పరిస్థితులలోనే ఇష్మాయేలు జన్మించెను. దేవునిశక్తి పై ఆధారపడకుండా అబ్రాహాము దేవుడు తన వాగ్దానమును నెరవేర్చుటకు ఆయనకు సహాయ పడగోరినందున ఇష్మాయేలు జన్మించెను. అతని జన్మతో జత గూడిన వాగ్దానములు యేమీలేవు. ఇశ్రాయేలు జనాంగము శరీర సంబంధమైన కుమారుడు. దాని ఆశీర్వాదములు ఎక్కువగా భౌతికమైనవే. ఒకడు పాత నిబంధనలోనికి భౌతికంగా జన్మించేవాడు. ఇశ్రాయేలు జనాంగములో సభ్యత్వము వంశపారంపర్యము, రక్తమాంసముల సంబంధము.

అది అట్లయితే ఇస్సాకు పర సంబంధమైన సూత్రములతో జన్మించాడు. అతని తల్లి అబ్రాహాము యొక్క భార్యయైన శారా. అతనిది కూడా సహజ జన్మయేగాని, అతడు జన్మించునట్లు దేవుడు సంకల్పించారు. దేవుడు చేసిన వాగ్దాన ఫలితముగా అతడు జన్మించాడు. అతడు విశ్వాసమూలమున జన్మించినపుత్రుడు. ఇస్సాకు యొక్క సంతతి వారు దేవుని వాగ్దానములను ఆత్మీయముగా పొందుదురు. అవన్నియు ఆత్మీయ వాగ్దానములే. రోమీయులకు వ్రాసిన పత్రికలో భౌతిక సంబంధమైన ఇశ్రాయేలుకును ఆత్మీయ సంబంధమైన ఇశ్రాయేలుకును గల వ్యత్యాసమును తెలియజేయుచున్నాడు. ఇస్సాకు

ఆత్మీయ ఇశ్రాయేలుకు గురుతుగా యున్నాడు. వారు క్రొత్త జన్మద్వారా ఆత్మీయముగా తిరిగి జన్మించినవారు. "వారు దేవుని వలన పుట్టిన వారే గాని రక్తము వలన నైనను శరీరేచ్ఛ వలన నైనను మానుషేచ్ఛ వలన నైనను పుట్టిన వారు కారు" (యోహాను 1:13). నీకొదేము యేసునొద్దకు వచ్చినప్పుడు క్రొత్త జన్మను గూర్చి ఆయన అతనికి తెలియజేసారు. ఒకడు ఆత్మమూలముగాను నీటి మూలముగాను తిరిగి జన్మించాలని యేసు చెప్పారు (యోహాను 3:3-5). గనుక పాత నిబంధన యొక్క భౌతిక జన్మకు వ్యత్యాసముగా ఈ క్రొత్త నిబంధన జన్మ ఆత్మీయమైనది.

## వారు జీవించిన పరిస్థితులు

హాగరు, ఇష్మాయేలు బానిసలు. వారు సీనాయి కొండ మీద ఇయ్యబడిన పది ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమునకు గురుతుగా యున్నారు. ఈ నింబధన తమ పితరులు సయితము మోయలేని కాడిగా వర్ణించబడెను. పాత నిబంధన ప్రకారము మనము జీవించినంత కాలము ఈ లోక పాపములకు మనము బానిసలైయుందుము.

శారా, ఇస్సాకులు స్వతంత్రులు. యెరూషలేములో ఇయ్యబడిన క్రీస్తు చట్టము (క్రొత్త నిబంధన) మనలను స్వతంత్రులనుగా చేయును. "ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు. కాబట్టి మీరుస్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడి" (గలతీ 5:1). క్రీస్తులో మనము మోషే ధర్మశాస్త్రము నుండి విడుదల పొందియున్నాము. కృపను బట్టి మనం ఇప్పుడు దేవుని సేవించుటకు స్వతంత్రులమైయున్నాము. ధర్మశాస్త్రము

వలన కాదు. విశ్వాసమును బట్టి కృప ద్వారా ఇప్పుడు మనం రక్షింపబడి యున్నాము. పాపక్షమాపణను పొంది యున్నాము. అది ధర్మశాస్త్రమును బట్టి సాధ్యము కాలేదు. ఈ స్వాతంత్ర్యము పాపమునుండి విడుదల గాని పాపము చేయుటకు కాదు.

## ఇద్దరు కుమారుల యొక్క మనస్సు

ఇష్మాయేలుకు బానిసతత్వము, హింసాగుణముండెను. ఇస్సాకు పెరుగుచుండగా ఇష్మాయేలు ఆ బాలుని హేళన చేసాడు, హింసించాడు. యిది తదుపరి ఆత్మీయ ఇశ్రాయేలు అయిన సంఘమునకు గొప్ప పాఠమైయుండెను. క్రీస్తు యొక్క సంఘమును ఎక్కువగా యూదుల జనాంగమే హింసించెను.

ఇస్సాకు బాధనొందినవాడు, వినయముగలవాడు, ఆత్మీయముగా యున్నవాడు. క్రీస్తు సంఘము స్థాపించబడిన వెంటనే యూదుల నాయకులనుండి, పెద్దల నుండి హింస ప్రారంభమాయెను. అవును "క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రతుకనుద్దేశించు వారందరు హింసపొందుదురు" (2 తిమో 3:12). యూదా మతము లోనికి తిరిగి ఆకర్షించు ఈ బోధకులు నిజముగా క్రైస్తవుల శత్రువులని వారు గమనించాలని పౌలు గలతీయులకు వ్రాసిన పత్రిక చెప్పుచున్నది.

## కడవరి అంతము

ఇష్మాయేలు వారసుడు కాదు. అతడు ఒక బానిసకు రావలసిన దానికి మాత్రమే అర్హుడు. ఇష్మాయేలు ఇస్సాకును హేళన చేయగా శారా దానిని చూచెను. గనుక హాగరును ఆమె కుమారుడైన

ఇష్మాయేలును వెళ్ళగొట్టవలెనని శారా అబ్రాహామును ప్రోత్సహించెను. ఇష్మాయేలు ఎందుకు వెళ్ళ గొట్ట బడెను? ఏలయనగా అతడు ఇస్సాకుతో సమాన వారసుడు కానేరడు. పాత నిబంధన వెళ్ళగొట్టబడెనని దీని యర్థము! ఇశ్రాయేలీయుల ఆశీర్వాదములు కానాను దేశమును స్వతంత్రించు కొను వరకు మాత్రమే. వారు కూడ నిత్య రక్షణను పొందవచ్చును. గాని పాత నిబంధన యొక్క సంకల్పము అదికాదు. పాత నిబంధనను పాటించుట ద్వారా ఎవనికిని రక్షణ కలుగదు.

వాగ్దాన పుత్రుడైన ఇస్సాకు అబ్రాహాము యొక్క ఆస్థి నంతటికిని వారసుడు, యిది సంఘమునకు గురుతుగా యున్నది. "మనము పిల్లలమయితే వారసులము, అనగా దేవుని వారసులము; క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమ పడిన యెడల క్రీస్తుతోడివారసులము" (రోమా 8:17). క్రైస్తవులుగా మనము పాపము నుండి విడుదల చేయబడితిమి. "కాగా సహోదరులారా, మనము స్వతంత్రురాలి కుమారులమే గాని దాసి కుమారులము కాదు. ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసి యున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కు కొనకుడి" (గలతీ 4:31-5:1). క్రొత్త నిబంధన అనుగ్రహించు దీవెనలలో పాప క్షమాపణ భాగమైయున్నది. మరియు నిత్య జీవమను వాగ్దానము కూడ మనకున్నది. పాత నిబంధన చొప్పున నడువ ప్రయత్నించిన యెడల మరల దాసత్వములోనికి తిరిగిపోవుటయే.

## ముగింపు

రెండు నిబంధనలున్నవి. పాత నిబంధన మోషేద్వారా సీనాయి కొండ వద్ద ఈయబడినది; క్రొత్త నిబంధన క్రీస్తు ద్వారా ఇయ్యబడినది. అది క్రీస్తు సిలువతో ప్రతిష్ఠింపబడినది. పాత దాని స్థానములో క్రొత్త నిబంధన ఇప్పుడున్నది. పాత నిబంధన ప్రకారము నడుచుకొనుట కృపలోనుండి తొలగిపోవుటయే (గలతీ 5:4). ఈ రెండు నిబంధనలను మనం పాటించలేము. క్రీస్తుయొక్క పరిపూర్ణ క్రొత్త నియమముకు (యాకోబు 1:25) దేనినైనా కలిపితే క్రీస్తును కించ పరచినట్లే యగును. క్రొత్త నిబంధన వలన కలుగు ఆశీర్వాదములను పోగొట్టు కొనుట జరుగును.

# ౬. క్రొత్త నిబంధనను అన్వయించుకొనుట
## (Practical Applications of the New Testament)

పాత నిబంధన ఎత్తివేయబడెనని మనం గమనించియుంటిమి. ఇప్పుడు క్రొత్త నిబంధన అధికారము చొప్పున మనము జీవించు చున్నాము. దీని ప్రభావము మన జీవితములో ఎట్లుండును? కొన్ని మత సంబంధ బోధలు పాత నిబంధనలో మాత్రమే చెప్పబడెను. వాటికి క్రొత్త నిబంధన అధికారమేమియు లేదు. అట్టి కొన్ని సాధారణ ఆచారములను ఇప్పుడు పరిశీలింతము.

### సబ్బాతు దినమును ఆచరించుట

కొన్ని మత శాఖలవారు, ముఖ్యముగా సెవెంతుడే అడ్వెంటిస్టు సంఘము వారు పది యాజ్ఞలలోని నాల్గవ ఆజ్ఞ ఇంకను అమలులో యున్నదని చెప్పుదురు. నిర్గమ 20:8-11లో ఇట్లు చెప్పబడి యున్నది: "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచు కొనుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను, ఏడవదినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము. దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను, నీ దాసుడైనను, నీ దాసి యైనను నీ పశువైనను, నీ యిండ్లలో నున్న పరదేశి యైనను ఏ పనియు చేయ కూడదు. ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృష్టించి యేడవ దినమున విశ్రమించెను. అందుచేత యెహోవా విశ్రాంతి దినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధ పరచెను". దేవుడు ఏడవ దినమందు

విశ్రమించెను. దాని జ్ఞాపకార్థముగా ఆయన సబ్బాతును ప్రతిష్టించెను గనుక మనము సబ్బాతును ఆచరించవలెనని కొందరు వాదింతురు.

సబ్బాతును గూర్చిన ఆజ్ఞ రాతి పలకల మీద వ్రాయబడిన ఆజ్ఞలలో ఒకటై యున్నది. ఆ చట్టము అదృశ్యమగుటకు స్థిమైయున్నదని పౌలు చెప్పాడు. "మరణ కారణమగు పరిచర్య రాళ్ళమీద చెక్కబడిన అక్షరములకు సంబంధించినదియై నను మహిమతో కూడిన దాయెను. అందుకే మోషే ముఖము మీద ప్రకాశించు చుండిన ఆ మహిమ తగ్గిపోవునదైనను ఇశ్రాయేలీయులు అతని ముఖము తేరి చూడలేకపోయిరి. ఇట్లుండగా ఆత్మ సంబంధమైన పరిచర్య యెంత మహిమ గలదై యుండును? తగ్గిపోవునదే మహిమగలదై యుండిన యెడల నిలుచునది మరి యెక్కువ మహిమగలదై యుండును గదా" (2 కొరింథీ 3:7-8, 11). గనుక సబ్బాతును గూర్చిన అధికారము గతియించిపోయెను. సబ్బాతును ఆచరించవలెననెడి ఆజ్ఞ సీనాయి కొండ వరకు ఇయ్యబడలేదు. అప్పటి వరకు ఎవరును సబ్బాతును ఆచరించలేదు.

"సీనాయి పర్వతము మీదికి దిగివచ్చి ఆకాశమునుండి వారితో మాటలాడి వారికి నీతియుక్తమైన విధులను సత్యమైన ఆజ్ఞలను మేలుకరమైన కట్టడలను ధర్మములను నీవు దయచేసితివి. వారికి నీ పరిశుద్ధమైన విశ్రాంతి దినమును ఆచరింప నాజ్ఞ ఇచ్చి నీ దాసుడైన మోషే ద్వారా ఆజ్ఞలను కట్టడలను ధర్మశాస్త్రమును వారికి నియమించితివి" (నెహెమ్యా 9:13-14). సబ్బాతును గూర్చిన ఆజ్ఞను దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయులకు సీనాయి కొండకు దిగివచ్చి

యిచ్చినట్లు నెహెమ్యా పరిశుద్ధాత్మ వలన చెప్పుచున్న దానిని గుమనించుము. లేని చట్టమునకు ఎవడును విధేయుడు కానేరడు. ఇంకా ఆదిమ క్రైస్తవుల వ్రాతలను బట్టి ఆదిమ సంఘము దేవుని నారాధించుటకు వారములో మొదటి దినమున అనగా ప్రతి ఆదివారమున కూడుకొనుచున్నట్లు తెలిసికొనగలము.

## వాద్య సంగీతము

ఇంచుమించు అన్ని మతశాఖలవారు ఆరాధనలో వాద్యములనుపయోగింతురు. దైవారాధనలో వాద్య సంగీతమునుపయోగించుటకు క్రొత్త నిబంధనలో ఎక్కడా అనుమతి కనబడదు. సరిగదా పాటలు పాడవలెనని కనబడ్తాది. పాత నిబంధనలో వాద్యములనుపయోగించవలెనని చెప్పబడెను, నిజమే. అయితే నేటి మన ఆచరణ నిమిత్తము పాత నిబంధననుసరింపరాదు. బూరలు, వీణలు మొ॥గు వాటిని గూర్చి ప్రకటన గ్రంథము చెప్పుచున్నది. అవి దేవుని ఆరాధనలో ఉపయోగించినట్లు మాత్రము చెప్పబడలేదు. సరిగదా ప్రకటన గ్రంథమంతయు అలంకార రూపక భాషలో వ్రాయబడెను. పరలోకమే ఆత్మీయమైనది. అది భూసంబంధముకాదు. గనుక భౌతిక సంబంధమైన వాద్యములు ఆత్మీయ ప్రదేశములో ఎట్లుండును? ఎందుకు వుండును? ఆత్మీయ సంగతులలో క్రొత్త నిబంధన మన మార్గదర్శియైయున్నది. క్రొత్త నిబంధన ఆరాధనలో వాద్యములనుపయోగించుటకు దాని పుస్తకములలో ఎక్కడా అనుమతి లేదు.

## దశమ భాగము

మతశాఖల వారందరు తమ సభ్యులు పదియవ వంతు కానుక లీయవలెనని ఆజ్ఞాపింతురు. పాత నిబంధనలో తమ ఆదాయములో దశమ భాగము దేవునికీయాలని ఆజ్ఞాపింపబడినది. "భూ ధాన్యములలో నేమి, వృక్ష ఫలములలో నేమి భూ ఫలములన్నిటిలో దశమ భాగము యెహోవా సొమ్ము. అది యెహోవాకు ప్రతిష్ఠితమగును" (లేవీ 27:30).

పాత నిబంధనాచార ప్రకారము నేడు క్రైస్తవులు కూడ తమ ఆదాయములో దశమ భాగము నీయాలని అనేకులు బోధింతురు. "నేను వచ్చినప్పుడు చందా పోగు చేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడు తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1 కొరిథీ 16:2). ఇక్కడ క్రైస్తవులు కానుకలిచ్చు ఆజ్ఞయున్నది. తాను వర్ధిల్లిన కొలది ఇయ్యవలెనని పౌలు చెప్పుచున్నాడు. ఎంత ఇయ్యవలెనో విశదీకరించలేదు. అనగా మనము తక్కువ ఇయ్యాలని దీని యర్థము కాదు. ఒక బలహీనమైన నిబంధనలో యున్న ఇశ్రాయేలీయులు దశమ భాగము ఇయ్యాలని ఆజ్ఞాపింపబడితే దానికంటే శ్రేష్టమైన నిబంధన క్రింద యున్న మనము కనీసము అంత అయినా ఇయ్యాలి. గనుక దశమ భాగముతో ఆరంభించాలి. సణుగుకొనకయు బలవంతముగా కాకయు ఒకడు తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఉత్సాహముగా ఇయ్యవలెనని పౌలు ఆజ్ఞాపించుచున్నాడు (2 కొరింథీ 9:7-8). ఇంత ఇయ్యవలెనని ఒకడు ఆజ్ఞాపింపబడినప్పుడు, అది అతనిలో ఉత్సాహాన్ని కలిగించదు;

ఇష్టపూర్వకముగా ఇయ్యలేదు. ఉత్సాహ పూర్వకముగా ఇయ్యని కానుక యుంటే మనం పొందవలసిన దీవెనలను పొందము.

## నేరుగా దేవునికే ప్రార్థించుట

పాత నిబంధన ప్రకారము ఒకడు దేవుని ఆరాధించాలంటే అతడు యాజకుని ద్వారా ఆ పని జరిగించాలి. ప్రజలు జంతు బలుల నర్పించారు కాని నిజానికి అర్పించేవాడు యాజకుడు. ఆరాధనలో సాంబ్రాణి పొగల నర్పించేవాడు యాజకుడే. ఇంకొక మాటలో ఆరాధకునికి (మానవునికి) దేవునికి మధ్య యాజకుడు ఉండేవాడు.

క్రొత్త నిబంధనలో అయితే మానవుడు నేరుగా దేవుని సమీపించగలడు. ఇప్పుడు దేవుని సన్నిధికి చేరుకోవాలంటే భూ సంబంధ యాజకుడెవరు లేడు. ఏలయనగా మనందరము పరిశుద్ధమైన యాజకులమే. ఆత్మసంబంధ బలుల నర్పించుటకు క్రైస్తవులందరు యాజకులే (1 పేతురు 2:5). మనం జంతు బలుల నర్పించము గాని బలుల నర్పింతుము. మనము మన శరీరములను సజీవ యాగముగా దేవునికి అర్పింతుము. “కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుడని మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది” (రోమా 12:1). “కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతి యాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము” (హెబ్రీ 13:15).

మనము బలుల నర్పింతుముగాని ఆ బలులు ఆత్మీయ బలులు. పాత నిబంధన యాజకులు దేవునికి సాంబ్రాణి ధూపములనర్పించాలని ఆజ్ఞాపింపబడిరి (నిర్గమ 30:8). నేడు కూడ మనము ధూపార్పణము చేతుముగాని అదే మన ప్రార్థనలు గాని సాంబ్రాణి పొగల నర్పించము ప్రార్థనలు చేతుము. “ఆయన దానిని తీసికొనినప్పుడు ఆ నాలుగు జీవులును, వీణెలను ధూప ద్రవ్యములతో నిండిన సువర్ణ పాత్రలను పట్టుకొని యున్న ఆ యిరువది నలుగురు పెద్దలును ఆ గొర్రె పిల్ల యెదుట సాగిలపడిరి. ఈ పాత్రలు పరిశుద్ధుల ప్రార్థనలు” (ప్రకటన 5:8). ఆరాధనలో ఆత్మీయ సంగతులకే ప్రాధాన్యత యున్నట్లు గమనించుము మరియు ప్రతి క్రైస్తవుడు నేరుగా దేవుని సమీపించగలడు. ఒక మానవ మాత్రుడైన యాజకుడు అవసరము లేదు.

## సున్నతి

శారీరక సున్నతి పొందుట పాత నిబంధన యొక్క గురుతుగా యుండెను. యూదులలో పుట్టిన ప్రతి మగవాడును నిబంధన సంబంధ గురుతుగా సున్నతి పొందవలసియుండెను. క్రైస్తవులకు కూడ సున్నతియున్నది గాని అది ఆత్మీయమైనది. అది హృదయ సంబంధమైన సున్నతి. “మీరును క్రీస్తు సున్నతియందు శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించి ఆయన యందు చేతులతో చేయబడని సున్నతి పొందితిరి” (కొలస్స 2:11). ఈ సున్నతిని ఆత్మీయ సున్నతి యని పౌలు చిత్రీకరించుట గమనించుము. అది చేతులతో చేయబడలేదు.

భౌతిక శారీరక సున్నతియైతే పాత నిబంధనలో చేతులతో చేయబడెను. ఆత్మీయ సున్నతి యనగా శరీర సంబంధమైన పాపములను విసర్జించుటయే. "అయితే అంతరంగమందు యూదుడైన వాడే యూదుడు. మరియు సున్నతి హృదయ సంబంధమైనదై ఆత్మయందు జరుగునదే గాని అక్షరము వలన కలుగునది కాదు. అట్టి వానికి మెప్పు మనుష్యులవలన కలుగదు, దేవుని వలననే కలుగును" (రోమా 2:29). మరల "యేసు క్రీస్తునందుండు వారికి సున్నతి పొందుట యందేమియులేదు, పొందకపోవుట యందేమియు లేదు గాని ప్రేమ వలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజనకరమగును" అని అపొ.పౌలు వ్రాసాడు (గలతీ 5:6).

బాప్తిస్మమును నిబంధనకు గురుతుగా కొందరు చూపించ ప్రయత్నిస్తారు గాని దానిని పౌలు అట్లు చెప్పలేదు. గాని "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడిన వారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" యని అతడు కొలస్స 2:12లో చెప్పాడు. మనము బాప్తిస్మము నీటిలో పాతిపెట్టబడినప్పుడు ఆత్మీయ సున్నతి సంభవించును. అయితే బాప్తిస్మము సున్నతి కాదు. గాని దేవుడు మనలను ఆత్మీయముగా శుద్ధి చేసి, మన పాపములను క్షమించుసమయమది. క్రొత్త నిబంధనకు గురుతుగా బాప్తిస్మము ఎన్నడు, ఎక్కడా చెప్పబడలేదు. సరిగదా పరిశుద్ధాత్మునిలో మనము ముద్రిపంబడియున్నాము (ఎఫెసీ 4:30).

## ముగింపు

బైబిలు ఆధారములేని కొన్ని పద్ధతులను మత శాఖల వారు ఆచరించు వాటిని క్లుప్తముగా మనము చూచుకొని యున్నాము. ప్రజలు పాత క్రొత్త నిబంధనల సంబంధము నెరుగనందున చాలమట్టుకు ఈ గందరగోళము ఉద్భవించినది. పాత నిబంధనలో ఆచరింపబడిన, క్రొత్త నిబంధనలో ఆచరింపబడని కొన్ని ఆచారములను కూడ మనము గమనించాము. ఇంకా కొన్ని తేడాలను మీరే గుర్తించగలరు. దేవుని పరిచర్యలో మనము చేయు దానికి దేవుని అనుమతియున్నదో లేదో మనం పరీక్షించుకోవాలి. ఆయధికారము క్రొత్త నిబంధనలో మాత్రమే మనకు లభించును. ఈ పాఠములు నిబంధనల సంబంధమును మీరు మరింత గ్రహించుకొనునట్లు సహాయ పడెననియే నా విశ్వాసము. దానిని గ్రహిస్తే మీరు సత్యవాక్యమును సరిగ విభజించగలరు (2 తిమోతి 2:15).

This book translated from English
to Telugu by Joshua Gootam
Dec. 2019
Second printing January 2022

*Copies can be had from:*

**SATYA VANI - CHURCH OF CHRIST**
**P. O. BOX 80, KAKINADA,**
**INDIA - 533 001**